RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com
Postal Regd. No. GTR/117/2025-27




# వుదయం




గుంటూరు | 08-03-2026 ఆదివారం | సంపుటి : 12 | సంచిక : 372 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Follow us on

## కూటమి ప్రభుత్వం.. ప్రజా ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న
- విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు రోడ్డులో ప్రజా దర్బార్
- ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఆయా సమస్యల పరిష్కారానికి కృషి

5



## మహిళలను గౌరవిద్దాం.. సమాన హక్కులు కల్పిద్దాం


- అనేక రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- జిల్లా వైద్యాధికారిని డాక్టర్ వీ.సుజాత
- జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



5

## దుర్గమ్మను ఎన్నిసార్లు దర్శించుకున్నా తనివి తీరదు: హోం మంత్రి అనిత

**విజయవాడ :**



మహా కుంభాభిషేకం సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మను హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి అచ్చెన్నాయుడు శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు దేవస్థానం అధికారులు. అమ్మవారి దర్శనానంతరం కంచి కామకోటి పీఠాధిపతులను హోం మంత్రి అనిత కలిశారు.అనంతరం హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమ్మవారిని ఎన్నిసార్లు దర్శించుకున్నా తనివి తీరదని తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు మహా కుంభాభిషేకం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈరోజు, రేపు అంతరాలయ దర్శనం నిలిపివేస్తారని అన్నారు. ప్రతి 12 ఏళ్లకు వచ్చే ఈ మహా కుంభాభిషేకం మహోత్సవాన్ని వీక్షించేందుకు రేపు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.



## విజయవాడలో పోలీసులపైకి కాల్పుల యత్నం

**విజయవాడ:**

పోలీసులు కార్డన్‌సెర్చ్ చేస్తుండగా దుండగుడు పోలీసులపైకి కాల్పులకు యత్నించాడు. ఈ ఘటన విజయవాడ నగరంలో చోటుచేసుకుంది. బస్టాండ్ సమీపంలోని బాలాజీ హోటల్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఇదే సమయంలో దుండగుడు.. పోలీసులు, ఈగల్ టీమ్ అధికారులపైకి కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. అనంతరం పారిపోతున్న నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని తెలంగాణలోని వరంగల్‌కు చెందిన మురళిగా గుర్తించారు. ట్రిగ్గర్ ప్రెస్ చేయకపోవడంతో బుల్లెట్ ఛాంబర్‌లోకి రాలేదని పోలీసులు తెలిపారు. ఆపరేషన్ 'వజ్ర ప్రహార్'లో భాగంగా పోలీసులు, ఈగల్ టీమ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



## ఆపరేషన్ 'వజ్ర ప్రహార్'.. ఏపీ వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్

**అమరావతి:**

ఏపీ వ్యాప్తంగా పోలీసులు నిర్బంధ తనిఖీలు చేపట్టారు. పలు జిల్లాల్లో వందకు పైగా బృందాలతో సోదాలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తున్నారు. నివాస ధ్రువీకరణ పత్రాలనూ తనిఖీ చేస్తున్నారు. అనుమానిత వ్యక్తులు, గంజాయి విక్రయాలపై దృష్టి సారించారు. ఆపరేషన్ 'వజ్ర ప్రహార్'లో భాగంగా ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే ప్రధాన లక్ష్యమని ఈగల్ ఐజీ రవికృష్ణ తెలిపారు. ''రాష్ట్రవ్యాప్తంగా 100 చోట్ల ఆపరేషన్ వజ్రప్రహార్ కార్డెన్ సెర్చ్ జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి సరఫరా జరిగే 849 హాట్ స్పాట్స్ గుర్తించాం. వీటికి అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు కొనసాగుతాయి'' అని ఐజీ చెప్పారు.

# భవిష్యత్‌లో అనేక దేశాలకు మన విద్యుత్

- ఐటీలో భారతీయుల పరిజ్ఞానం అందరికీ తెలిసిందే
- విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో ఎక్కువ శాతం ఏపీ వాళ్లే
- భవిష్యత్‌లో గ్లోబల్ కమ్యూనిటీకి సేవ చేసే సామర్థ్యం భారత్‌కే

న్యూ ఢిల్లీలో నిర్వహించిన 'రైసినా డైలాగ్' సదస్సులో చంద్రబాబు




**న్యూఢిల్లీ :**

ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా స్థానికులతో కలిసిపోయే అత్యుత్తమ డిప్లొమాట్స్ భారతీయులే అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు 'రైసినా డైలాగ్-2026'కు ఆయన హాజరై.. 'సాంకేతికత - సుపరిపాలన - భవిష్యత్తు' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. ప్రపంచ దేశాలకు విస్తృత సేవలు అందిస్తున్న వారిలో భారతీయులే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ప్రత్యేకించి ఐటీ సహా వివిధ రంగాల్లో గ్లోబల్ కమ్యూనిటీ, ప్రపంచ సంక్షేమానికి భారతీయులు విస్తృత సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో సిలికాన్ వ్యాలీలాంటి చోట్లకు మేధో వలసలు జరిగాయని.. కానీ త్వరలో రివర్స్ మైగ్రేషన్ మొదలవుతుందని తెలిపారు.

### నిపుణులు, వనరులు ఉన్న చోటికే అవకాశాలు

నిపుణులు, వనరులు ఉన్న చోటికే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. దూరాలు ఇక అడ్డంకి కాదని, ఎక్కడి నుంచైనా పనిచేసే అవకాశాలు ఉన్నాయని వివరించారు. నాలెడ్జ్ ఎకానమీలో ఎక్కడైనా పెద్ద కంపెనీని ప్రారంభించి పనిచేసే అవకాశాలున్నాయని చంద్రబాబు తెలిపారు. త్వరలో డేటా సెంటర్‌ల కోసం గ్రీన్ ఎనర్జీని పెద్దఎత్తున ఉత్పత్తి చేస్తున్నామన్నారు. భారత్‌లో ప్రస్తుతం సింగిల్ గ్రిడ్ ద్వారా ఎనర్జీ ట్రాన్స్‌ఫర్మేషన్ జరుగుతోందని చెప్పారు. త్వరలో విద్యుత్ ఎగుమతి చేసేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. గ్రీన్ అమ్మోనియా కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి చేస్తున్నామని ఆయన చెప్పారు.

### ఏఐ, క్వాంటం ఏఐ ఆల్గారిథమ్స్‌లో పెద్ద అవకాశాలు

ఏఐ, క్వాంటం ఏఐ ఆల్గారిథమ్స్‌లో పెద్ద అవకాశాలున్నాయన్నారు సీఎం. ఇటీవల ట్రైనింగ్ కోసం పిలుపు ఇస్తే 50వేల మంది రిజిస్టర్ చేసుకున్నారని వెల్లడించారు. ఏజింగ్ సమస్యను ఎదుర్కొంటున్న దేశాలు జనాభా నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫెర్టిలిటీ రేటును 1.5 నుంచి 2.1కు పెంచేందుకు పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ రూపొందించామని చంద్రబాబు తెలిపారు. మూడో బిడ్డ పుడితే రూ.25వేల ఆర్థిక సాయం, నెలవారీగా రూ.వెయ్యి అందించాలని నిర్ణయించామని చెప్పారు. చైల్డ్ కేర్ లీవ్‌లాంటి ప్రోత్సాహకాలు ఆలోచిస్తున్నామని వివరించారు. ఓ ప్రజాప్రతినిధిగా గతంలో జనాభా నియంత్రణపై మాట్లాడానని.. ఇప్పుడు భవిష్యత్ ప్రమాదాలను గుర్తించి జనాభా నిర్వహణ పాలసీని ప్రోత్సహిస్తున్నానని ఆయన చెప్పారు. పేద, ధనిక తారతమ్యం లేకుండా జనాభా వృద్ధిపై దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. భారత్‌లో గతంలో పెద్ద కుటుంబాలు దేశ ఆస్తిగా ఉండేవని.. ఇప్పుడు మైక్రో ఫ్యామిలీలుగా మారాయన్నారు. ఈ విషయంలో ప్రజల దృష్టి కోణం మార్చే ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.



## మహిళల సాధికారతకు విద్యే పునాది : గద్దె అనురాధ

**విజయవాడ మార్చి 7 వుదయం న్యూస్ బ్యూరో :-**

విజయవాడలో పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్ లోని కె.వి.ఎస్.ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో,( ఎస్ ఏ ఎఫ్ ఈ )సంస్థ సహకారంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో మహిళా హక్కులు, సమానత్వం మరియు సాధికారతపై అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణాజిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు శ్రీమతి గద్దె అనురాధ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

సమాజంలో మహిళల హక్కులు, సమానత్వం మరియు సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడానికి విద్య కీలక పాత్ర పోషిస్తుందని ఆమె తెలిపారు. మహిళల సామర్థ్యాన్ని గుర్తించి వారికి అవకాశాలు కల్పించడం ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో "నిజమైన సమానత్వం సాధించడానికి లింగ కోటా అవసరమా?" అనే అంశంపై వాదోపవాద పోటీ నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులు తమ ఆలోచనాత్మక ప్రసంగాలతో అందరినీ ఆకట్టుకున్నారు అని ( ఎస్ ఏ ఎఫ్ ఈ )సంస్థ ప్రతినిధి స్వరూప రాణి తెలిపారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన సామాజిక కార్యకర్త శ్రీమతి పి.ఏ. దేవి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళల సాధికారతతోనే సమాజం పురోగమిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆచంటి సునీత మాట్లాడుతూ మహిళా దినోత్సవం మహిళల సాధికారతకు ప్రతీక అని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చైతన్యాన్ని పెంపొందించి సమానత్వ భావనను పెంపొందించడానికి దోహదపడతాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో నిర్వహించిన వాదోపవాద పోటీల్లో విజేతలకు మరియు పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని కార్యక్రమ కార్యనిర్వహణాధికారి మరియు మహిళా సాధికారత కమిటీ అధ్యక్షురాలు డా. హెచ్. విజయలక్ష్మి తెలిపారు.

## అక్రమ మద్యం.. మౌనమే జగన్ సమాధానమా?: నారా లోకేశ్

**అమరావతి:**

గత ప్రభుత్వ హయాంలో అక్రమ మద్యం వేల కుటుంబాలను నాశనం చేసిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అక్రమ మద్యం ద్వారా జగన్ అనుచరుల జేబుల్లో రూ.వేల కోట్లు చేరాయని ఆరోపణలు వచ్చాయన్నారు. రూ.కోట్ల నగదు లావాదేవీలకు సంబంధించి ఈడీ ఆధారాలను బయటపెట్టినట్లు గుర్తు చేశారు. ఈ ఆరోపణలపై ఏపీ ప్రజలకు జగన్ సమాధానం చెప్పగలరా? అని ప్రశ్నించారు. 'సమాధానం చెప్పలేక.. మౌనమే జగన్ సమాధానమా' అని అన్నారు. ఇదేనా జగన్ 2019లో నిషేధం అమలు చేస్తానన్న హామీ వెనుక అసలు కథ అంటూ ఎక్స్ వేదికగా నిలదీశారు.



## సినీ పరిశ్రమలో చిరంజీవి ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం

చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం రావడంపై డిప్యూటీ సీఎం పవన్ సంతోషం

**అమరావతి :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ ఫిల్మ్ అవార్డులను ప్రకటించింది. ఈ అవార్డుల్లో అత్యున్నతమైన ఎన్టీఆర్ జాతీయ పురస్కారం మెగాస్టార్ చిరంజీవికి ప్రకటించారు. చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం రావడంపై జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. చిరంజీవికి అభినందనలు తెలియజేశారు. తెలుగు సినీ పరిశ్రమలో చిరంజీవి ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. 'అన్నయ్య, అగ్రశ్రేణి కథానాయకులు చిరంజీవికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని ప్రకటించడం సంతోషాన్ని కలిగించింది. తెలుగు సినీ పరిశ్రమలో అన్నయ్య చిరంజీవి ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం' అని పేర్కొన్నారు.

## పద్మావతి మహిళా యూనివర్సిటీ పరిశోధనలు అనేక జాతీయ సంస్థలకు ఉపయోగం

### గవర్నర్ అబ్దుల్ నజీర్



**తిరుపతి:**

పద్మావతి మహిళా యూనివర్సిటీ పరిశోధనలు అనేక జాతీయ సంస్థలకు ఉపయోగకరమని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. ఈ పరిశోధనలు కేవలం ప్రయోగశాలలకు మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. అవి సమాజ అభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 22వ స్నాతకోత్సవ వేడుకలు(శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్, ఆయన సతీమణి సమీరా నజీర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ, నగరపాలక సంస్థ కమిషనర్, స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ స్నాతకోత్సవం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త శశికళ సిన్హాకు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు. శాస్త్ర సాంకేతిక రంగంలో ఆమె చేసిన సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందించారు. స్నాతకోత్సవ వేడుకల్లో విద్యార్థులకు పెద్ద సంఖ్యలో పురస్కారాలు ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం 102 బంగారు పతకాలు అందజేశారు. అదేవిధంగా పలువురు విద్యార్థులకు నగదు బహుమతులు కూడా ప్రదానం చేశారు.





# బ్రహ్మోత్సవాలలో వైభవంగా చక్ర స్నానం

### పాల్గొన్న ప్రముఖ పాలకులు

**కావలి, మార్చి 07, వుదయం న్యూస్:**

నెల్లూరు జిల్లా, కావలి నియోజకవర్గం బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా చక్రస్నానం కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా శనివారం జరిగింది. ఆలయ పరిసరాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన పుష్కరిణిలో ఈ చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతులు, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ సంప్రదాయబద్ధంగా చక్రస్నానం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకుని పుణ్యస్నానం చేశారు. అనంతరం వేమిరెడ్డి దంపతులు స్వామివారికి తీర్థప్రసాదాలు సమర్పించారు. ఈ



సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించేలా దేవస్థానాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలియజేశారు.





## మహిళలను గౌరవిద్దాం.. సమాన హక్కులు కల్పిద్దాం

- జిల్లా వైద్యాధికారిని డాక్టర్ వి.సుజాత
- అనేక రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**నెల్లూరు (వుదయం ప్రతినిధి) మార్చి 7వ తేదీ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమంలో డిఎం.హెచ్ఓ డాక్టర్ వి. సుజాత మాట్లాడుతూ మహిళల సాధికారత, సమాన హక్కులు మరియు సమాజంలో మహిళల పాత్రను గుర్తుచేసుకునే ప్రత్యేకమైన రోజు అని అన్నారు. మహిళలు కుటుంబం, సమాజం, విద్య, విజ్ఞానం, రాజకీయాలు వంటి అనేక రంగాల్లో గొప్ప సేవలు చేస్తున్నారని, తల్లి, అక్క, చెల్లి, గురువు వంటి అనేక పాత్రల్లో మహిళలు మన జీవితాన్ని మార్గనిర్దేశం చేస్తారని, ఈ రోజు మహిళల కష్టాన్ని గౌరవించడం, వారికి సమాన అవకాశాలు ఇవ్వడం మరియు మహిళా సాధికారతను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. మహిళలను గౌరవించడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం పిఎంపి, రూడ్స్ ఆధ్వర్యంలో జిల్లా డిఎం అండి ఇచ్చివో అధికారిని డాక్టర్ సుజాతను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ కోఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, జిల్లా పీ.హెచ్.పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, పివి. రమణయ్య, యు. శేఖర్, ఎన్. ప్రసాద్, సి. వీరయ్య, యు. రామదాసు, జి. జగన్ మోహన్ రావు, సి. సాయి మురళి, కె. సుభాష్ చంద్రబోస్,యన్. మాలిని, టి. శంకరమ్మ పి. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



## మేకపాటి వారిని విమర్శించే స్థాయి మీది కాదు

**ఆత్మకూరు రూరల్ మర్రిపాడు (వుదయం ప్రతినిధి) మార్చి ఏడవ తేదీ** ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డిని మాజీ నెల్లూరు పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజ మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి టిడిపి పార్టీకి లేదని మర్రిపాడు మండలం వైఎస్ఆర్సిపి నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో టీడీపీ పార్టీయే లేదుని. నెల్లూరు పార్లమెంట్ మాజీ సభ్యులు మేకపాటి రాజ మోహన్ రెడ్డిని, వారి కుటుంబాన్ని విమర్శించే స్థాయి నిన్న మీడియా సమావేశంలో మాట్లాడిన ఏ నాయకుడికి లేదని వైఎస్సార్సీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మర్రిపాడులోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్ట నియోజకవర్గాలైన ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు మేకపాటి కుటుంబం ఎంత మేలు. చేకూర్చిందో ప్రతి ఒక్కరికి తెలుసునని, అలాంటి కుటుంబంపై నిన్న టీడీపీ నాయకులమని చెప్పుకుంటూ విమర్శలు చేసిన నాయకులకు ఎలాంటి అర్హత లేదన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో మూడు దశాబ్దాల క్రితం టీడీపీ గెలిచిందని, మళ్లీ ఇప్పుడు ఏదో గాలి వాటం మీద మళ్లీ అతి తక్కువ మెజారిటితో గెలిచారని, అయితే ఇప్పుడు మీ పక్కనున్న, మీడియా సమావేశంలో మాట్లాడిన ఏ ఒక్కరూ కూడా నిజమైన టీడీపీ వారు కాదన్న విషయం అందరికి తెలుసున్నారు. మర్రిపాడు మండలం మొత్తం మీద ఉండేది వైఎస్సార్సీపీ, కాంగ్రెస్ నేతలేనని, మేకపాటి వారి గురించి మాట్లాడిన వారందరూ ఆ కుటుంబం పెట్టిన రాజకీయ బిక్షతోనే పైకొచ్చిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఒక మాజీ పార్లమెంట్ సభ్యునిగా మెట్ట నియోజకవర్గాలైన ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో విద్యాభివృద్ధికి ఎంత కృషి చేశారు.

ఉదయగిరిలో కళాశాల, మర్రిపాడులో కెజిబివి ఇలా వారి స్వంత నిధులతో ఇక్కడి వారందరూ బాగా చదవాలని ఆశయంతో కష్టపడ్డారని, అలాంటి కుటుంబంపై డాక్యుమెంటరీ తీసి విడుదల చేస్తామన్న టీడీపీ నాయకులు 10-15 రోజుల్లో విడుదల చేయాలని, లేకుంటే మేము వెబ్ సిరీస్ లు విడుదల చేస్తామని, అయితే మా విక్రమ్ రెడ్డి ఇలాంటి వాటిని ప్రోత్సహించరని, వారికి కావాల్సింది. నియోజకవర్గ అభివృద్ధి. మెట్ట ప్రాంత ప్రజల సంక్షేమమేనన్నారు. సంగం, మర్రిపాడు ఇసుక కొండల మాయం విషయం వైఎస్సార్సీపీ వాళ్లదేనన్నారని, అయితే దీనిపై ఎక్కడికొచ్చి ప్రమాణం చేసేందుకు మేము సిద్దంగా ఉన్నామని, అచ్చమాంబ గుడిలో అయినా, శ్రీకాళహస్తి గుడిలో అయిన ప్రమాణం చేసేందుకు సిద్ధమని, మీరు సిద్ధంగా ఉన్నారా అని సవాల్ చేశారు. రాజకీయాల్లో విమర్శలు సాధారణమని అయితే స్థాయికి తగ్గట్టుగానే విమర్శలు చేయాలని, స్థాయిని మించి విమర్శలు చేయవద్దని అన్నారు. ఈ మీడియా సమావేశంలో మర్రిపాడు వైఎస్సార్సీపీ కన్వీనర్ చెన్ను వెంకటేశ్వరరెడ్డి, గంగవరపు శ్రీనివాసులునాయుడు, బొర్రా సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాయుడు హజరత్ రెడ్డి, చంద్రా నారాయణ స్వామి, చల్లా వెంకటేశ్వర్లు, ప్రతాప్ రెడ్డి, ప్రసాద్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.



## మహిళల సంక్షేమమే కూటమి ధ్యేయం

### రూ.8 వేలు విలువ చేసే ఇస్త్రీ పెట్టెను అందజేసిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్

**విజయవాడ మార్చి 7 వుదయం న్యూస్ బ్యూరో :-** మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించి వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. పటమట అశోక్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్‌కు చెందిన పుసుపులేటి వీరభద్రంకు జీవనోపాధి నిమిత్తం రూ.8.వేల విలువ చేసే ఇస్త్రీ పెట్టెను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తన సొంత నిధులతో కొనుగోలు చేసి ఉచితంగా శనివారం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలన్నదే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి తన సొంత నిధులతో సహాయాన్ని అందిస్తున్నానని అన్నారు. డ్వాక్రా సంఘాల వ్యవస్థను రాష్ట్రంలో అమలు చేసి మహిళలకు ఆర్థిక స్వేచ్ఛను కల్పించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిదేనని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు మరిన్ని వర్గాలను తమ ప్రభుత్వం ప్రకటించడానికి సిద్ధంగా ఉందన్నారు.

ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందచేయడమే కాకుండా, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కూడా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. జనసేన తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమానికి అదనంగా ఎమ్మెల్యే గద్దె రామమోమన్ కూడ తన సొంత నిధులతో తన స్థాయిలో స్వయం ఉపాధి కొరకు కొన్ని పరికరాలను పంపిణీ చుయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ కరీమ్, హరిప్రసాద్, నిస్సార్ ఉమ్రి, హతావుల్లా, వాహిద్, అశోక్, నడికుప్పల రవి, ఆనంద్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం.. ప్రజా ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న
- విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు రోడ్డులో ప్రజా దర్బార్
- ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఆయా సమస్యల పరిష్కారానికి కృషి

**విజయవాడ మార్చి 7 వుదయం న్యూస్ బ్యూరో :-** రాష్ట్రంలో పాలన సాగిస్తున్న టిడిపి, బిజేపి, జనసేన కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు రోడ్డులో పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు ప్రజా దర్బార్ కార్యాక్రమాన్ని శనివారం నిర్వహించారు. అధికారులు, టిడిపి నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు ప్రజల నుంచి నేరుగా విజ్ఞాపనలు స్వీకరించి ఆయా సమస్యల పరిష్కారంకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న స్వయంగా ప్రజల నుంచి సమస్యలతో కూడిన వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ.. పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ చొరవతో పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల ముంగిట్లోకే ప్రజా ప్రభుత్వం వచ్చిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పార్టీ అధిష్టానం సూచనలతో నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలోనూ ప్రజా దర్బార్ కార్యక్రమాలను ఎంపీ కేశినేని శివనాథ్ ఏర్పాటు చేయించి అన్ని విభాగాలకు చెందిన అధికారులను ప్రజల వద్దకే తీసుకువస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఆయా సమస్యల పరిష్కారంకు కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం టిడిపి ప్రభుత్వంలోనే సాధ్యమని ప్రజా దర్బార్‌లు రుజువు చేస్తున్నాయన్నారు.

కార్యక్రమంలో 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి చంటి , ఎన్టీఆర్ జిల్లా టిడిపి కార్యదర్శి పిల్లా శీను, ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు సోలంకి రాజు, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు కామా దేవరాజ్, పేటేటి రాజమోహన్, మైలపల్లి రాజు, టిడిపి సీనియర్ నాయకులు పీత బుజ్జి బంక నాగమణి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాల మాధవ, 50 డివిజన్ అధ్యక్షురాలు కొప్పుల అరుణ శ్రీ , డివిజన్ ప్రధాన కార్యదర్శి కాళ్ళ ఈశ్వరరావు , కో క్లస్టర్ కొప్పుల గంగాధర్ రెడ్డి , బూత్ కన్వీనర్ వీర్ల వాసు యాదవ్, డివిజన్ కమిటీ నాయకులు కందుబోతు శ్రీను , యూనిట్ ఇంచార్జ్ నాగిరి కంటి రమాదేవి, 144బూత్ కన్వీనర్ షేక్ మోబినా ,142బూత్ కన్వీనర్ పీత మోహన్ రావు, కొండపు బుజ్జి , వాణిజ్య విభాగం నాయకులు ధనేకుల నాని , తెలుగుయువత అధ్యక్షుడు మాధవ, ఐటీడీపి అధ్యక్షులు చైతన్య



, ప్రధాన కార్యదర్శి రమేష్, శంకర్ యాదవ్, పశ్చిమ నియోజకవర్గం తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి పితాని పద్మ ,టిఎన్టీయూసి వైస్ ప్రెసిడెంట్ యర్రంశెట్టి పద్మ, కోడెబోయిన స్రవంతి , పుప్పాల దుర్గ మల్లేశ్వరి , పట్నాల భార్గవి, ఐ టి డి పి నాయకురాలు పి ప్రియాంక , కామాక్షి, 52 డివిజన్ ప్రెసిడెంట్ ఈగల్ సాంబ , 53 డివిజన్ ప్రెసి డెంట్ నందే విజయలక్ష్మి, 49 డివిజన్ ప్రెసిడెంట్ బడుగు వెంకన్న, 51 డివిజన్ ప్రెసిడెంట్ కుంచం దుర్గారావు, బాలకృష్ణ , విజయ్ , శ్రీనివాస రావు, బోస్ బాబు, నమ్మి బాను , వడ్డాది రమణ, వడ్డాది నరేష్ , భోగవల్లి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.




## ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహజమైన ఆహారం తీసుకోవాలి


- ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు గద్దె అనురాధ
- క్యాన్సర్‌పై అవగాహన
- విద్యార్థినులతో రాంప్ వాక్

**విజయవాడ మార్చి 7 న్యూస్ బ్యూరో :-** రూట్స్ ఫౌండేషన్ మరియు ఏఓఎల్ (అమెరికన్ అంకాలజీ ఇన్స్టిట్యూట్) ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సిద్ధార్థ మహిళా కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు పాల్గొని ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పించే ఉద్దేశంతో రాంప్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమం రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పోలవరపు విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు గద్దె అనురాధ మాట్లాడుతూ ప్రస్తుతం ఆహార అలవాట్లలో వచ్చిన మార్పులు, కూరగాయలు , ఇతర ఆహార పదార్థాల్లో అధికంగా ఉపయోగిస్తున్న రసాయన ఎరువులు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహజమైన ఆహారం, తాజా కూరగాయలు, పండ్లు తీసుకోవడం అవసరమని సూచించారు. కొన్ని రకాల క్యాన్సర్ల నివారణ కోసం ప్రభుత్వం వ్యాక్సిన్ కార్యక్రమాలు కూడా అమలు చేస్తోందని తెలిపారు. ప్రముఖ నటి అంజెలినా జోలీ క్యాన్సర్ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి తీసుకున్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్‌పై అవగాహన పెంచిందని ఉదాహరణగా చెప్పారు. క్యాన్సర్ అనేది భయపడాల్సిన వ్యాధి కాదని, ముందుగా గుర్తిస్తే చికిత్స ద్వారా నయం కావచ్చని వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

సమాజంలో మహిళలు సగభాగంగా నిలబడి ప్రతి రంగంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తమ జీవితాలపై మహిళలు స్వయంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగడమే నిజమైన మహిళా సాధికారిత అని పేర్కొన్నారు. మహిళలు ఎన్నుకున్న రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మహిళల సాధికారత కోసం గతంలో ఎన్టీఆర్ పాలనలో సమాన హక్కులు కల్పించారని, అనంతరం చంద్రబాబు నాయుడు పాలనలో డ్వాక్రా గ్రూపుల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. మహిళల అభివృద్ధి సమాజ అభివృద్ధికి కీలకమని తెలిపారు. కార్యక్రమంలో సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా. వి.వి.ఎస్. కుమార్, జూనియర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. పద్మజా, డా. పాటిబండ్ల అనీల, డా. ఐనపురి ఇషాంత్, డా. డి. శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ రామస్వామి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో యూరాలజీ విభాగం అందుబాటులోకి..

**కావలి, మార్చి 07, వుదయం న్యూస్:** కావలి పట్టణంలోని డాక్టర్ రామస్వామి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నందు యూరాలజీ విభాగం ప్రారంభం చేసినట్లు డాక్టర్ రామస్వామి తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో డాక్టర్ రాశి వీరయ్య గౌడ్ యూరాలజిస్ట్ (కిడ్నీ వ్యాధి నిపుణులు )మాట్లాడుతూ కిడ్నీలో రాళ్లు మూత్రపిండాల రాళ్లు, పురుషులలో సెక్సువల్ రిలేటెడ్, మూత్రంలో రక్తము పురుష జనన సంబంధిత వ్యాధులకు మంచి వైద్యం అందించబడునని తెలిపారు. అంతేకాకుండా వీర్య నాళాలు బ్లాక్ అవ్వడం, మూత్రం ఆపుకోలేకపోవడం, బరువులు ఎత్తినప్పుడు మూత్రం రావడం, మూత్రం నిలిచిపోయి కిడ్నీ ఉబ్బడం



వంటి సమస్యలకు అద్భుతమైన వైద్యం అందించబడునని తెలిపారు. కావలి పట్టణంలో మొట్ట మొదటిసారిగా లేజర్ ట్రీట్మెంట్ కిడ్నీకి సంబంధించి కోతలేని ఆపరేషన్లు చేయబడునని తెలియజేశారు. ఈ అవకాశాన్ని కావలి ప్రాంత ప్రజలు మరియు చుట్టుపక్కల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.



## నీతి నిజాయితీకి,అభివృద్ధికి మారుపేరు తుమ్మల

### జిల్లా కాంగ్రెస్ కమిటీ ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి

**ఖమ్మం వుదయం బ్యూరో మార్చి 7** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జరిగిన సమావేశంలో నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అవాకులు చెవాకులు మానుకోవాలని హితవు పలికారు.బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, పువ్వాడ అజయ్ కుమార్ భూదాన్ పేదలను కల్లబొల్లి కబుర్లతో మభ్యపెడుతున్నారని ఈ భూములపై గత ప్రభుత్వ హయాంలో కోర్ట్ లో వేశారని అట్టి తీర్పు ఈనాటికి వెలువడిందని, మాజి మంత్రి పువ్వాడ పది సంవత్సరాలు కళ్ళు మూకొన్నావా,భూదాన్ పేదల దగ్గర గడ్డలలగా మారి వారిని మభ్యపెట్టి వారి దగ్గర డబ్బులు పోగుచేసుకొన్నారని,ఇకనైనా అనవసర ఆరోపణలు మాని అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

అదే విధంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు నాలుగు దశాబ్దాల చరిత్ర గల నీతి నిజాయితీకి జిల్లా అభివృద్ధికి ఏ విధంగా పాటుపడ్డారో జిల్లా ప్రజలందరికీ తెలుసని, తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నియోజక వర్గంలో గెలిచినప్పటి నుండి నియోజకవర్గం దినదినాభివృద్ధికి అహర్నిశలు పాటు పడుతున్నారన్నారు. అటువంటి వారిపై నిందలు వేయటం ఆకాశంపై ఉమ్మి వేసిన చందంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వీరితో పాటు నగర ఐ యన్ టి యు సి అధ్యక్షులు నరాల నరేష్ నాయుడు, నగర ఓ బి సి సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కల్వకుంట్ల గోపాల్, కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ పాల్గొన్నారు.



## యథేచ్ఛగా చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా

**ఆత్మకూరు రూరల్ సంగం (దయం ప్రతినిధి )మార్చి 7వ తేదీ** సంగం మండలంలో చికెన్ పెద్దల అక్రమ రవాణా ఏదేచిగా సాగుతుంది. ఎక్కడికి అక్కడ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న కొందరు చాపల గుంటల యజమానులు కళ్ళు కప్పి వాటిని సరఫరా చేస్తున్నారు. శుక్రవారం చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకొని గుంత తీసి ఆ చికెన్ వ్యర్థాలను పూడ్చి పెట్టడం జరిగింది. చికెన్ చికెన్ వేద్దాలతో పెరిగిన చేపలను తింటే మనుషులకు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలియజేశారు. ఈ విషయంపై ఇప్పటికైనా చాపలగుంటలో యజమానులు ఈ యొక్క చికెన చాపల గుంటలకు వేయడం మానేస్తే మానవ సమాజానికి ఎంతో మేలు చేసిన వారు అవుతారని అలా కాకుండా అదేవిధంగా చికెన్ వ్యర్థాలు చాపల గుంటలకు వేస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని పోలీసు వారు చెప్పడం జరిగింది.



## ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం

**చండూరు, మార్చి 07 (వుదయం విలేఖరి)** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని చండూరు మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డా. ఎం. రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు ప్రజలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేసి తగిన వైద్య సలహాలు ఇచ్చారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కటకం రమేష్,డా.ఎం.రాజు,డా.సంధ్యా బ్లెస్సీ, సూపర్వైజర్ విజయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తాడ్వాయి–నేలమర్రి డబుల్ రోడ్డు విస్తరణకు రూ.24 కోట్లు

**కోదాడ:మార్చి 7(వుదయం)** NH–9 నుండి నేలమర్రి వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులకు రూ.24 కోట్లు మంజూరు చేయడం హర్షణీయమని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తక్కెలపాటి సాయి అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరైనట్లు తెలిపారు.ఈ రహదారి అభివృద్ధితో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు. సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించడం వల్ల తాడ్వాయి, వెంకట్రామపురం, నేలమర్రి ప్రాంతాల మధ్య రాకపోకలు సులభమవడంతో పాటు ప్రమాదాలు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రహదారి విస్తరణకు సహకరించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కోదాడ నియోజకవర్గ అభివృద్ధికి వారు చేస్తున్న కృషికి ప్రజలు రుణపడి ఉంటారని సాయి అన్నారు.

## ఘనంగా విద్యార్థుల వీడ్కోలు సమావేశం

**ఖమ్మం వుదయం బ్యూరో రూరల్,మార్చి 07** ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థుల వీడ్కోలు సమావేశం ప్రధానోపాధ్యాయులు ఆమంచి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రూరల్ మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి జగదీష్,సర్పంచ్ బండి సతీష్,ఉప సర్పంచ్ షేక్ దావూద్,మాజీ ఏఏపిసి చైర్మన్ పప్పుల విజయ,మాజీ ఎస్ ఎం సి చైర్మన్ పప్పుల రమణ,మాజీ జెడ్పీటీసీ పెరుమాళ్లపల్లి మోహనరావు లు మాట్లాడుతూ...విద్యార్థులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు ప్రతి సంవత్సరం కల్పిస్తున్నామని,గత ఏడాది 10వ తరగతి లో 100శాతం ఉత్తీర్ణత సాధించామని వారందరికీ ఇచ్చిన మాట ప్రకారం ప్రోత్సాహకాలను,నగదు బహుమతులను అందజేశామని, ఈ సంవత్సరం కూడా మంచిగా చదువుకొని గ్రామానికి,గురువులకు,తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పప్పుల రమాదేవి రిటైర్డ్ ఉద్యోగి ప్రతి సంవత్సరంలానే ఈసారి కూడా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు ,పెన్నులు



అందించారు.గతేడాది ఉత్తీర్ణత సాధించిన మొదటి,రెండవ,మూడవ స్థానంలోని విద్యార్థులకు మాజీ జెడ్పీటీసీ మోహనరావు 3వేల 500 నగదును అందజేశారు.2వ వార్డు సభ్యులు తంగెళ్లపల్లి నారాయణమ్మ విద్యార్థులకు కంపాస్ బాక్స్, స్కేల్స్,పెన్సిల్స్ అందజేశారు. అలాగే కొత్తగా ఎన్నికైన ఏఏ పిసి చైర్మన్ రమాదేవి కి స్వాగతం పలుకుతూ మాజీ చైర్మన్ విజయకు వీడ్కోలు సన్మానం చేసిన అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగులమీరా, సీనియర్ జర్నలిస్ట్ వేణుగోపాల్, రిటైర్డ్ ఆర్.ఐ. కనకయ్య,ఉపాధ్యాయులు సతీష్,పార్వతి,కమల,వార్డు సభ్యులు కందుల భాస్కర్,గుండె తిరపయ్య, మోత్కురి లక్ష్మయ్య,విద్యార్థిని,విద్యార్థులు,ఆఫీస్ సబార్డినేట్ రఫీ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న సురేఖ





**కావలి, మార్చి 07, వుదయం న్యూస్:** గృహిణిగా ఉంటూ తనకున్న లక్ష్యసాధనే ధ్యేయంగా రక్తదానం చేయుటలో చురుకైన పాత్ర పోషిస్తున్న ఇంటూరి సురేఖ దాతృత్వం గొప్పది. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా ఇంటూరి సురేఖ కావలి ప్రభుత్వ వైద్యశాలలో ఉన్నటువంటి బ్లడ్ బ్యాంక్ కేంద్రంలో రక్త దానం చేశారు. నెల్లూరు జిల్లా కావలి నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని వీ సేవ ఫౌండేషన్ సహకారంతో ఉమెన్స్ డే సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీ మాజీ పిసిసి మెంబర్ ఇంటూరు శ్రీహరి సతీమణి ఇంటూరి సురేఖ పలు మరులు బ్లడ్ డొనేట్ చేయడం జరిగినది. సందర్భంగా డా.ఆర్.వి హరిత కూడా బ్లడ్ డొనేట్ చేశారు. రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలవ డం మాకెంతో సంతోషంగా ఉందని కుమారు డు ఇంటూరి వెంకట వికాష్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉషా బాల, డాక్టర్ ప్రమీల, డాక్టర్ విజయ వాణి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఇంచార్జ్, తదితర వైద్యులు, మీసేవ ఫౌండేషన్ బ్లడ్ మోటివర్ వినయ్ కుమార్, బ్లడ్ వాలంటీర్ అనిత, బ్లడ్ వాలంటీర్ ప్రవళిక, బ్లడ్ వాలంటీర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.




## మహిళాసాధికారత దిశగా సమాజం ముందుకు

### అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వక్తల పిలుపు

**కావలి, మార్చి 07, వుదయం న్యూస్:** కావలి ఉమన్ ఫోర్స్, కలయిక విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ' పురస్కరించుకుని కలయిక విజ్ఞాన కేంద్రం లో " నేటి సమాజంలో మహిళా సాధికారత " అనే అంశంపై చర్చా వేదిక, విజయవంతంగా జరిగింది. చర్చకు రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ , కలయిక విజ్ఞానకేంద్ర నిర్వాహక కమిటీ సభ్యులు అయిన బి . చంద్రశేఖర్ సంధానకర్తగా వ్యవహరించారు. అనాదిగా వస్తున్న పురుషాధిక్యత తగ్గుతున్నా, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమ శక్తియుక్తులను నిరూపించుకుంటున్నా, ఇంకా సాధికారత సాధించడం లో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం అంత తృప్తికరంగా లేదని వక్తలు అభిప్రాయపడ్డారు. చర్చా వేదిక కు ముందు , పాఠశాల స్థాయిలో, 'ఓపెన్ టూ ఆల్ ' విభాగాల్లో ' ఉపన్యాసపోటీలు నిర్వహించడం జరిగింది. న్యాయనిర్ణేతగా సెయింట్ ఆన్స్ స్కూల్ రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ డోరతి వ్యవహరించారు. ప్రతి విభాగంలో బాలురు – బాలికలకు, స్త్రీలు – పురుషులకు విడివిడిగా బహుమతులు అందజేశారు. స్త్రీల విభాగంలో రాజ్యలక్ష్మి సరోజని, చంద్రిక లకు, పురుషుల విభాగంలో దిలీప్ రాయపాటి, ఆంజనేయులకు వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో అధ్యక్షత వహించిన కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్, సి . శారద మాట్లాడుతూ, మొదటి మహిళాదినోత్సవం 1908 లో స్థానిక మహిళల హక్కుల సాధన కోసం జరిగిన పోరాట ఫలితంగా జరిగిందని అప్పటి నుండి ప్రతి ఏటా మార్చ్ నెల 8 వ తేదీన మహిళాదినోత్సవం జరుపుకుంటున్న మహిళలకు మహిళా సంఘాలకు అభినందనలు తెలియజేశారు. ఎల్డర్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు దుగ్గిశెట్టి బాలయ్య , కలయిక విజ్ఞాన కేంద్రం నిర్వాహక కమిటీ సభ్యురాలు , ఎల్డర్స్ క్లబ్ అధ్యక్షులు పార్వతీశంకర్ , 'కలయిక ' కన్వీనర్లు జి.రాంప్రసాద్ , జి . లావణ్య సభలో ప్రసంగించారు. సభానంతరం సి. శారద, డి . బాలయ్య, బి . చంద్రశేఖర్ , లావణ్య రాం ప్రసాద్ దంపతులను వారి సేవలను గుర్తించి, జమయతే ఇస్లామి ఈ హింద్ మహిళా విభాగం ప్రతినిధులు , ఫాతిమా, నూర్జహాన్ మరియు ఇతర సభ్యులు, కలయిక నిర్వాహక బృందం ఘనంగా సత్కరించారు. కలయిక విజ్ఞానకేంద్రం తరచూ ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ కావలిలో ప్రజలను ఒకచోటికి చేర్చాలని సభికులు లలిత, కవిత, రజనీకాంత్, దస్తగిరి, కోరారు.



# జాతీయం-అంతర్జాతీయం



## బెంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ వైఫల్యం.. రాష్ట్రపతి అసహనం




**ఉదయం డెస్క్ :**

పశ్చిమ బెంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ వైఫల్యంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అసహనం వ్యక్తం చేశారు. ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన తనకు సీఎం నుంచి గానీ.. మంత్రుల నుంచి గానీ అధికారిక స్వాగతం లభించలేదని పేర్కొన్నారు. తాను ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిన ఆదివాసీ సదస్సుకు అనుమతి నిరాకరించడమే కాకుండా.. వేదిక వద్దకు ప్రజలకు ప్రవేశాన్ని కూడా నిరోధించారన్నారు. అయినప్పటికీ మమత ప్రభుత్వంపై ఎటువంటి ద్వేషం లేదని..ఆమె తనకు సోదరితో సమానమని అన్నారు.

9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో ప్రసంగించడానికి రాష్ట్రపతి బెంగాల్‌లోని సిలిగుడికి వెళ్లారు. ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతికి ముఖ్యమంత్రి గానీ ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు గానీ స్వాగతం పలకాల్సి ఉంటుంది. అయితే అధికారికంగా స్వాగతించడానికి ప్రభుత్వం తరఫున ఎవరూ రాకపోవడం గమనార్హం.

## నిరుద్యోగులకు నెలకు రూ.1500: మమతా బెనర్జీ





**ఉదయం డెస్క్:**

త్వరలో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని పదో తరగతి పాసై ఉద్యోగాలు లేని వారికి నెలకు రూ.1500 నిరుద్యోగ భృతి అందించనున్నట్లు వెల్లడించారు. నేటి నుంచే ఈ డబ్బులు నిరుద్యోగుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. యువ సాథీ అనే ఈ స్కీమ్ 2140ఏళ్ల వారికి వర్తిస్తుందని తెలిపారు. ఈ సాయంతో వారు స్వయం సమృద్ధిగల భవిష్యత్తు వైపు పయనించగలుగుతారన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

యువ సాథీ స్కీమ్‌ను ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని ముందు భావించినట్లు మమత తెలిపారు. అయితే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తేదీలో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా.. కోల్‌కతాలో చేపట్టిన ధర్నాలో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు.

తమ పాలనలో బెంగాల్‌లో నిరుద్యోగిత రేటు 40శాతం తగ్గిందని సీఎం తెలిపారు. ప్రభుత్వం దాదాపు 40లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందించిందని.. వారిలో 10లక్షల మంది ఇప్పటికే ఉపాధి పొందుతున్నారని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఇప్పటికే ఏడాదికి రూ.10వేలు ఇస్తోందన్నారు. బెంగాల్‌లో పెట్టుబడులు పెట్టడానికి అనేక ఐటీ కంపెనీలు ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడించారు.

## పొరుగు దేశాలకు ఇరాన్ లొంగిపోయింది: ట్రంప్



**ఉదయం డెస్క్:**

దాడుల విషయంలో గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పిన వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. పశ్చిమాసియాలో ఓటమి పాలైన దేశంగా ఇరాన్‌ను పేర్కొన్నారు. ఆ దేశం దాని పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పి లొంగిపోయిందన్నారు. ఇకపై దాడులు చేయబోమని కూడా హామీ ఇచ్చిందని గుర్తుచేస్తూ.. అమెరికా, ఇజ్రాయెల్ నిరంతర దాడుల వల్లే ఇది సాధ్యమైందన్నారు. పశ్చిమాసియాను ఇరాన్ ఇక బెదిరించలేదని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు.

"పశ్చిమాసియాను గుప్పిట్లో పెట్టుకుని, పాలించాలని ఇరాన్ చూసింది. కానీ, ఓటమి పాలైంది. ఆ దేశం లొంగిపోవడమో, లేదా కుప్పకూలిపోవడమో జరిగే వరకు.. దశాబ్దాలపాటు పరిస్థితి ఇలాగే కొనసాగుతుంది. ఈ రోజు ఇరాన్‌పై భీకర దాడులు జరగనున్నాయి. ఆ దేశ దుష్ప్రవర్తన కారణంగా.. అక్కడి ప్రాంతాలను సర్వనాశనం చేసే అంశం కూడా పరిశీలనలో ఉంది" అని ట్రంప్ హెచ్చరించారు.

ఇజ్రాయెల్, అమెరికా దాడులతో ఇరాన్ ప్రతిదాడులు మొదలుపెట్టిన విషయం తెలిసిందే. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట పశ్చిమాసియా దేశాలపై పెద్దఎత్తున క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తోంది. ఈ క్రమంలోనే ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. గల్ఫ్ దేశాలకు క్షమాపణలు చెప్పారు. ఈ దేశాలపై ఇకపై దాడులు చేయబోమన్నారు. అయితే, అవి తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం.. స్పందించే హక్కు ఉందని స్పష్టం చేశారు.

## భారీగా పెరిగిన గ్యాస్ ధరలు

**ప్రధాన నగరాల్లో కొత్త ధరలు ఇలా..**

(గృహ వినియోగ సిలిండర్..14.2కేజీ)
- ఢిల్లీ - రూ.913
- ముంబయి - రూ 912.50
- కోల్‌కతా - రూ. 939
- చెన్నై - రూ.928.50

వాణిజ్య సిలిండర్ ధరలు ఇవి (19కేజీ)..
- ఢిల్లీ - రూ.1883
- ముంబయి - రూ.1835
- కోల్‌కతా - రూ.1990
- చెన్నై - రూ.2043





**ఉదయం డెస్క్:**

దేశంలో వంట గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. గృహవినియోగ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.60, కమర్షియల్ సిలిండర్‌పై రూ.115 పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చాయి. దీంతో హైదరాబాద్‌లో ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.965కి చేరింది. ఉజ్వల్ పథకం ద్వారా అందించే సిలిండర్ ధరల్లో మార్పు లేదని చమురు సంస్థలు స్పష్టం చేశాయి. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలోనే ధరలు పెరిగినట్లు తెలుస్తోంది.

పశ్చిమాసియాలో ఘర్షణల నేపథ్యంలో ఇంధన లభ్యతపై ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై ఇటీవల కేంద్ర పెట్రోలియం శాఖమంత్రి హర్దీప్‌సింగ్ పురి స్పందించారు. "పౌరులకు అందుబాటు ధరలో ఇంధన లభ్యత ఉండేలా చూడటం మా తొలి ప్రాధాన్యత. దేశంలో ఎలాంటి కొరతా లేదు. దీనిపై ఆందోళన చెందాల్సిన పనిలేదు" అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. దేశంలో పెట్రోల్, డీజిల్ కొరతపై నెట్టింట్లో చక్కర్లు కొడుతున్న సమాచారాన్ని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కూడా తోసిపుచ్చింది. ముడిచమురు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్‌పీజీ విషయంలో భారత్ సౌకర్యవంతమైన స్థితిలోనే ఉందని శుక్రవారం ప్రభుత్వ వర్గాలు భరోసా ఇచ్చాయి. హర్మూజ్ అంతరాయాల వేళ వేర్వేరు సోర్సుల నుంచి దేశానికి భారీ స్థాయిలో ఇంధనం లభ్యమవుతోందని పేర్కొన్నాయి.

## యుద్ధ నౌకపై జైశంకర్ కీలక వ్యాఖ్యలు



**ఉదయం డెస్క్:**

శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్‌దేనాపై దాడి చేసిన అమెరికా జలాంతర్గామి దానిని ముంచేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందించారు. ఇటీవల విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు వచ్చిన పలు ఇరాన్ యుద్ధ నౌకలు అనుకోని విధంగా యుద్ధ ప్రభావానికి గురయ్యాయని అన్నారు. ఆ నౌకల ప్రయాణ ఉద్దేశం వేరైనా.. ఉద్రిక్త పరిస్థితుల వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

అదే సమయంలో ఐరిస్ లావన్ అనే మరో నౌక తిరిగి వెళ్తుండగా అందులో సాంకేతిక సమస్య తలెత్తిందన్నారు. దీంతో కొచ్చిలో నౌక అత్యవసర నిలుపుదలకు ఇరాన్ విజ్ఞప్తి చేసిందన్నారు. ఈ విషయంలో చట్టపరమైన సమస్యలు ఉన్నప్పటికీ.. మానవతా దృక్పథంతో భారత్ ఈ నెల 1న సంబంధిత అనుమతి మంజూరు చేసిందన్నారు. దీంతో ఈ నెల 4న నౌకను ఇరాన్ కొచ్చిలో నిలిపిందన్నారు. అందులోని 183మంది సిబ్బందికి కొచ్చిలోనే ఆశ్రయమిచ్చినట్లు తెలిపారు. భారత్ సరైన నిర్ణయమే తీసుకుందన్నారు. శ్రీలంక తీరంలో దాడి జరిగిన వెంటనే ఐరిస్ దేనా నౌక నుంచి తొలుత శ్రీలంక నౌకా దళానికి ప్రమాద హెచ్చరిక వచ్చిందని, ఆ వెంటనే భారత నౌకా దళాలు సైతం సహాయక చర్యల్లో పాల్గొన్నాయని తెలిపారు.

## మా జోలికి రావొద్దు

### ఇరాన్ ప్రెసిడెంట్ కీలక ప్రకటన

**ఉదయం డెస్క్:**

ఇరాన్ ప్రెసిడెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. గల్ఫ్ దేశాలపై చేసిన దాడులకు క్షమాపణలు చెప్పారు. ఇకపై పక్కదేశాలపై దాడి చేయమన్నారు. "మీరు మా జోలికి రాకుంటే.. మేము మీ జోలికి రామని" తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు ఎట్టి పరిస్థితుల్లో లొంగే ప్రసక్తి లేదని మసౌద్ పెజెష్కియాన్ స్పష్టం చేశారు. అదే విధంగా మీ దేశాలను అమెరికా స్థావరాలుగా మార్చొద్దని.. అక్కడి నుండి అమెరికా తమపై దాడి చేయకుండా చూసుకోవాలని సూచించారు.

ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ప్రతిదాడులతో ఇరాన్ విరుచుకపడింది. ఈ నేపథ్యంలో దుబాయి, కువైట్, బహ్రెయిన్, యుఏఈలతో పాటు ఇతర గల్ఫ్ దేశాలలోని USA స్థావరాలతో ఇరాన్ దాడులు జరిపింది. అక్కడితో ఆగకుండా ఆ దేశంలోని ఆయిల్ రిఫైనరీలు, విమానాశ్రయాలపై మిస్సైల్స్‌తో విరుచుకపడింది. దీంతో ఇరాన్ తీరుపై గల్ఫ్ దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు క్షమాపణలు చెప్పారు.

## బిహార్‌కు కొత్త సీఎం ఎవరు?



**పట్నా:** బిహార్‌లో తొలిసారి భాజపా సర్కార్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. సుదీర్ఘకాలం సీఎంగా కొనసాగిన నీతీశ్‌కుమార్ త్వరలో రాజ్యసభకు వెళ్లనుండటంతో కమలం పార్టీకి మార్గం సుగమమైంది. దీంతో భాజపా నుంచి ముఖ్యమంత్రి పగ్గాలు ఎవరు చేపడతారనే విషయమై తీవ్రచర్చ మొదలైంది. సీఎం రేసులో బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్, ఉప ముఖ్యమంత్రి విజయ్‌సిన్హా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

**బడుగు, బలహీన వర్గాలకే...**

భాజపా సామాజిక వ్యూహంతోనే బడుగు, బలహీన వర్గాలకే సీఎం పీఠం కట్టబెట్టవచ్చనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. బిహార్ ఉపముఖ్యమంత్రి, హోంశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సామ్రాట్ చౌధరీఓబీసీ సామాజిక వర్గానికి చెందినవారు. ఈ వర్గానికి ఇప్పటివరకు సీఎం అయ్యే అవకాశం రాలేదు. ఆయనను పెద్ద నాయకుడిని చేస్తామని ఎన్నికల ప్రచారంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. సామ్రాట్ చౌధరీ ఆర్జేడీ నుంచి వచ్చి పదేళ్లు కూడా కాకపోవడంతో భాజపా అధినాయకత్వం ఆయనపై ఎంతవరకు విశ్వాసం చూపుతుందన్నది ఆసక్తి రేపుతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ అయోధ్య ఉద్యమ సమయం నుంచి ఏబీవీపీలో, ఆరెస్సెస్‌లో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన బిహార్‌లో అత్యధిక జనాభా కలిగిన యాదవ సామాజిక వర్గానికి చెందినవారు.

రాయ్‌కు అవకాశం ఇస్తే అగ్రవర్ణాలు, నీతీష్ కుమార్ వర్గానికి చెందిన కుర్మీలు, ఇతర అత్యంత వెనుకబడినవర్గాల నుంచి వ్యతిరేకత రావచ్చని భాజపా వర్గాలు భావిస్తున్నాయి. అగ్రకులానికి చెందిన మంగళ్‌పాండే పేరు కూడా వినిపిస్తోంది. అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన వ్యక్తికి సీఎం పదవి కట్టబెట్టాలని పార్టీ భావిస్తే సంజీవ్ చౌరాసియా పేరు పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది. వీరితో పాటు.. వెస్ట్ చంపారన్ ఎంపీ, రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షుడు సంజయ్ జైస్వాల్, బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ సిన్హా పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు నీతీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ కు ఉపముఖ్యమంత్రి పదవి దక్కొచ్చన్న ప్రచారం జోరందుకుంది.

## రాహుల్ విమర్శలు.. తిప్పికొట్టిన తివారీ భార్య



**ఉదయం డెస్క్:**

ఇటీవల విడుదలైన 'ది కేరళ స్టోరీ 2' చిత్రం ప్రస్తుతం దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీస్తోంది. కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమాను చూసేందుకు ప్రేక్షకులు ఎవరూ ఆసక్తి చూపడం లేదని, ఇది కేవలం విద్వేషాన్ని పెంచే సాధనంగా మారిందని ఆయన విమర్శించారు. అయితే ఈ చిత్రానికి బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ భార్య సురభి తివారీ మద్దతుగా నిలిచారు.

'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ ఈ సినిమాపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'కేరళ సంస్కృతి, అక్కడి సంప్రదాయాలపై దేశ ప్రజలకు పూర్తి అవగాహన ఉంది. అందుకే 'ది కేరళ స్టోరీ 2' వంటి చిత్రాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒక వర్గాన్ని కించపరచడానికి, సమాజంలో చీలికలు తీసుకురావడానికి సినిమాలను వాడుకుంటున్నారు. దీనివల్ల కొన్ని శక్తులు రాజకీయ లబ్ధి పొందుతుంటే, సామాన్య ప్రజలు నష్టపోతున్నారు' అని రాహుల్ పేర్కొన్నారు. భావప్రకటన స్వేచ్ఛపై కూడా రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు.

'ఎవరైనా తమ గొంతు వినిపించాలని చూస్తే వారిపై దాడులు జరుగుతున్నాయి. అయితే కొన్ని వర్గాలకు అనుకూలమైన కథనాలను యథేచ్ఛగా ప్రచారం చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు' అని రాహుల ఆవేదన వ్యక్తం చేశారు. కాగా రాహుల్ విమర్శలకు భిన్నంగా, బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ భార్య సురభి తివారీ ఈ చిత్రానికి మద్దతుగా నిలిచారు. ఏఎన్ఐ వార్తా సంస్థతో ఆమె మాట్లాడుతూ.. 'లోకం అన్న తర్వాత రకరకాల మాటలు వినిపిస్తూనే ఉంటాయి. అయితే ఇంటి వద్ద కూర్చుని విమర్శలు చేసే కంటే, థియేటర్లకు వెళ్లి సినిమా చూడమని నేను కోరుతున్నాను. ఆ తర్వాతే ఇది ప్రచార చిత్రమా లేక సమాజానికి అద్దం పట్టే వాస్తవమా అనేది అర్థమవుతుంది. హిందూ అమ్మాయిలు ఎదుర్కొంటున్న వేధింపులకు ఇది నిదర్శనం. ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది' అని ఆమె పేర్కొన్నారు.

## ఇరాన్‌పై భీకర పోరు

### అత్యవసరంగా ఇజ్రాయెల్‌కు 12 వేల బాంబులు





**ఉదయం డెస్క్:**

ఇరాన్‌తో యుద్ధం ముదురుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు అత్యవసర ఆయుధాల అమ్మకానికి అమెరికా ఆమోదం తెలిపింది. అత్యవసర మినహాయింపు ద్వారా (కాంగ్రెస్ ఆమోదం అవసరం లేకుండా) ఇజ్రాయెల్‌కు 151.8 మిలియన్ల డాలర్ల విలువైన 12,000 బాంబు కేసింగ్స్‌ను (ఒక్కొక్కటి 1,000 పౌండ్ల బరువు) విక్రయించనుంది.

ఇజ్రాయెల్ ప్రభుత్వానికి వెంటనే విక్రయించాల్సిన అత్యవసర పరిస్థితి వచ్చిందని విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో సమర్థించుకున్నారు. తద్వారా ఆయుధ ఎగుమతి నియంత్రణ చట్టంలోని సెక్షన్ 36(బి)ను మినహాయించినట్టు చెప్పారు. ఈ ప్రతిపాదిత అమ్మకం ప్రస్తుత, భవిష్యత్తు ముప్పులను ఎదుర్కోవడానికి ఇజ్రాయెల్ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందనీ, దాని రక్షణను బలోపేతం చేస్తుందని అని స్టేట్ డిపార్ట్‌మెంట్ బ్యూరో ఆఫ్ పొలిటికల్‌మిలిటరీ అఫైర్స్ ఒక ప్రకటనలో తెలిపింది.

అత్యవసర మినహాయింపు అంటే

**దీనిపై విమర్శలు**

ఈ నిర్ణయంపై అమెరికాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ సమీక్షను దాటవేయడం ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న వాదనలకు విరుద్ధంగా ఉందని . డెమొక్రాటిక్ నాయకుడు గ్రెగొరీ మీక్స్ విమర్శించారు. ప్రభుత్వం యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని చెబుతూనే, ఇలా "అత్యవసర" అధికారాన్ని వాడటం విడ్డూరంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

సాధారణంగా ఇలాంటి అమ్మకాలకు కాంగ్రెస్ ఆమోదం అవసరం. అయితే, సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో "ఆర్మ్స్ ఎక్స్‌పోర్ట్ కంట్రోల్ యాక్ట్" కింద తనకున్న ప్రత్యేక అధికారాన్ని ఉపయోగించి కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా ఈ విక్రయాన్ని వేగవంతం చేశారు. అమెరికన్ రక్షణ సంస్థలు తమ అత్యాధునిక ఆయుధాల ఉత్పత్తిని నాలుగు రెట్లు పెంచడానికి అంగీకరించాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ ఆయుధాల సరఫరా వల్ల ఇజ్రాయెల్ తన రక్షణను బలోపేతం చేసుకోవడమే కాకుండా, ప్రాంతీయ ముప్పులను అడ్డుకోవడానికి సహాయపడుతుందని బ్యూరో ఆఫ్ పొలిటికల్‌మిలిటరీ అఫైర్స్ తెలిపింది.






## నేడు ఇరాన్‌పై అతిపెద్ద దాడి

### అమెరికా మంత్రి సంచలన వ్యాఖ్యలు

**ఉదయం డెస్క్:**

అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై ఇప్పటి వరకు చేసిన దాడులకంటే అతిపెద్ద దాడి చేయడానికి తమ సైన్యం సిద్ధమైందన్నారు. ఎన్నో ఏళ్లుగా టెహ్రాన్ అభివృద్ధి చేస్తోన్న క్షిపణి తయారీ ఫ్యాక్టరీలు, క్షిపణి లాంచర్లను ఈ రోజు పూర్తిగా తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు. తాము చేపట్టిన అతిపెద్ద ఆపరేషన్‌గా ఇది చరిత్రలో నిలుస్తుందన్నారు. అమెరికా మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బెసెంట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన చెప్పినట్లుగానే టెహ్రాన్ సహా ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచి భారీ దాడులు జరుగుతుండటం గమనార్హం.





**ఇరాన్ వైపు మరో విమాన వాహక నౌక**

యుద్ధం నేపథ్యంలో ఇప్పటికే అమెరికా రెండు యుద్ధ విమాన వాహక నౌకలను ఇరాన్ వైపు తరలించిన విషయం తెలిసిందే. తాజాగా మరో వాహక నౌక యూఎస్ఎస్ జార్జ హెచ్‌డబ్ల్యూ బుష్.. అట్లాంటిక్‌ను దాటి తూర్పు మధ్య ధరా సముద్రం వైపు కదిలినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు ఇప్పటికే కరేబియన్ సముద్రంలో మోహరించి ఉన్న అమెరికా యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ తాజాగా ఎర్ర సముద్రం వైపు కదిలినట్లు తెలుస్తోంది.

**ఇజ్రాయెల్‌కు 'ఎమర్జెన్సీ' ఆయుధాలు..**

ఇరాన్‌తో యుద్ధం తీవ్రమవుతోన్న నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు భారీ మొత్తంలో సైనిక ఆయుధాలు, మందుగుండు సామగ్రి విక్రయించడానికి తమ ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. ఎమర్జెన్సీ ఆయుధ విక్రయాల్లో భాగంగా ఇజ్రాయెల్‌కు 12000 బాంబు కేసింగ్‌లను, ఇతర ఆయుధాలను సరఫరా చేసినట్లు తెలిపింది. వీటి ద్వారా టెల్ అవీవ్ ఇరాన్ దాడులను సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొంది.

**ఇరాన్ విమానాశ్రయంపై దాడి..**

శుక్రవారం అర్ధరాత్రి ఇరాన్‌లోని మెహ్రాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సహా పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ దాడిలో విమానాశ్రయంలోని కొంత భాగం దెబ్బతిన్నట్లు ఇజ్రాయెల్ మీడియా తెలిపింది. ఘటనా స్థలంలో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతున్నాయని.. సహాయక చర్యలు చేపట్టామని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు.




“* మహిళలు, పురుషులతో సమానంగా జీవించి సామాజిక గౌరవాన్ని పొందేలా చేయడంలో పురుషుల పాత్ర అసాధారణమైనది. మహిళల రక్షణకు పురుషులు బ్రాండ్ అంబాసిడర్లు కావాలి. ఆడపిల్లలను ఎవరైనా ఇబ్బందికి గురి చేసినప్పుడు వారిని ప్రశ్నించే తత్వాన్ని యువత అలవర్చుకోవాలి. మహిళలపై వేధింపులను చూసి చూడనట్టు ఊరుకోవడం కూడా నేరాన్ని ప్రోత్సహించడం కిందికే వస్తుంది. సొంత కుటుంబ సభ్యులకు ఎక్కడైనా వేధింపులు ఎదురైతే ఏవిధంగా స్పందిస్తామో ఇతర కుటుంబాల ఆడపిల్లల విషయంలోనూ అదే తీరుగా ఆలోచించాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కేవలం ఒక కార్యక్రమంగా నిర్వహిస్తే మహిళల పట్ల మన బాధ్యత తీరిపోయినట్లు కాదు. మహిళలు నిత్యం అభద్రత భయంతో బయటికి వెళ్లాల్సిన పరిస్థితులు ఉండకూడదు. ఈ దుస్థితి తొలగడానికి మనలను మనం సవరించుకోవాల్సిన అవసరం ఉన్నది. అందుకు ఇదే తగిన సమయం. స్త్రీల శక్తి సామర్థ్యాల పట్ల గట్టి నమ్మకం ఉంది.

* రేవంత్ రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి ”

## వేమన పద్యం

**చంపదగినయట్టి శత్రువు తనచేత**
**జిక్కనేని కీడు సేయరాదు**
**పొసంగ మేలుచేసి పొమ్మనుటే చాలు**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# ఇరకాటంలో ఇండియా

వేర్వేరు సందర్భాలను వేర్వేరుగా పరిగణించక తప్పదు. ముఖ్యం గా దేశాల మధ్య ఆదాన ప్రదానాలు, పరస్పర వ్యాఖ్యల విషయం లో ఆచి తూచి స్పందించాలి. ఇందులో దేశ ఆత్మగౌరవం, సార్వాభౌమాధికారం ఇమిడి ఉంటాయి. ఇతర దేశాల విషయంలో మాట్లాడేటప్పుడు హుందాతనాన్ని ప్రదర్శించడం ప్రజాస్వామిక మర్యాద. కాని ప్రపంచాధిపతిగా తనను తాను పరిగణించుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దేశదేశాలకు ఫత్వాలు జారీ చేయడం ప్రారంభించాడు. నిరంకుశ ఆదేశాలు ఇవ్వడం మొదలుపెట్టాడు. తనలోని సమరోన్మాదాన్ని చాటుకోడానికి తన పదవిని గరిష్ఠ స్థాయిలో దుర్వినియోగం చేస్తున్నాడు. తానే మొదలుపెట్టిన తాజా గల్ఫ్ యుద్ధంలో ఆయన ఏకపక్ష ధోరణి, నియమాతిక్రమణ హద్దులు మీరాయి . ఇరాన్ పై తొలి దాడిలోనే 160 మంది బాలికలను బలి తీసుకోవడం, ఇరాన్ అధినేత అలి ఖమేనిని హతమార్చడం ట్రంప్ అమానవీయ సామ్రాజ్య వాదానికి ప్రబల నిదర్శనం. యుద్ధ ప్రాంతం బయట సముద్ర జలాల్లో గల ఇరాన్ యుద్ధ నౌకను ముంచివేయడం మరో అమానుషత్వం. అందరికీ హద్దు గీతలు గీసే తనకు ప్రజాస్వామ్య పాఠాలు ఎవరూ చెప్పడానికి వీలు లేదన్నది ట్రంప్ ఉద్దేశం. భారత దేశం తమకు అత్యంత ప్రీతిపాత్రమైనదని, ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రియాతి ప్రియ మిత్రుడని పదే పదే చెప్పుకున్న ట్రంప్ ఆచరణలో మనను ఎంత తక్కువగా చూస్తాడో అనేకసార్లు ప్రపంచానికి ఎరుక అయ్యింది. ఇండియాపై సుంకాలను 3-5 శాతం నుంచి 50 శాతానికి పెంచివేసిన ట్రంప్ దానిని తిరిగి 18 శాతానికి తగ్గించాడు. ఇండియా దారికి వచ్చిందని కితాబు ఇచ్చాడు. ఆంక్షల కారణంగా డిమాండు తగ్గిపోయిన రష్యా ఆయిల్ తక్కువ ధరకు అందుబాటులో ఉండడంతో దానిని దీర్ఘాకాలం పాటు చౌక ధరకు విశేష స్థాయిలో దిగుమతిచేసుకొన్న భారత్ పై ట్రంప్ ఎంతగా పగసాధించాడోతెలిసిందే. సుంకాలను 50 శాతానికి పెంచడంలోనే ఇండియా తో ట్రంప్ నెరుపుతున్న మైత్రి ఎంత ఘాటైనదో వెల్లడయింది. ఈ దెబ్బకు రష్యా నుంచి ఆయిల్ కొనుగోలును ఇండియా భారీగా తగ్గించివేసింది. ఆ విధంగా అమెరికాకు దాసోహం ప్రకటించినట్లయింది. దీనిని అమెరికా మెచ్చుకోవడం జుగుప్సాకరంగా ఎవరికైనా అనిపిస్తే ఆక్షేపించవలసిన పనిలేదు. అంతే కాదు ప్రస్తుత యుద్ధంలో ఆయిల్ రవాణా ప్రధాన మార్గాల్లో ఒకటైన హోర్ముజ్ జల సంధిని ఇరాన్ మూసివేయడంతో తలెత్తిన సంక్షోభం నేపథ్యంలో అమెరికా మన మీద దయదలిచినట్టు చేసిన ప్రకటన బాధాకరమైనది. రష్యా నుంచి నెల రోజుల పాటు తిరిగి ఆయిల్ కొనుగోలుకు ఇండియాను అనుమతి ఇస్తున్నట్టు అమెరికా ప్రకటించడం ప్రపంచం దృష్టిలో మన ప్రతిష్ఠను దారుణంగా పలచబరిచింది. గతంలో ఇరాన్ నుంచి ఆయిల్ దిగుమతిని అమెరికా ఆదేశించగానే మనం అలాగే చేశాము. ఈ సారి అమెరికా అనుమతి పాదప్రయోగం వల్ల కలిగిన అవమానాన్ని గమనించిన ప్రధాని మోడీ ప్రభుత్వం తగ్గు స్వరంతో తన అసమ్మతిని ప్రకటించింది. తమకు ఎవరి అనుమతి అక్కరలేదని చెప్పింది. ఇండియా తీవ్రంగా స్పందించకుండా నిగ్రహాన్ని పాటించడం లో మోడీ ప్రభుత్వ అతి జాగ్రత్తను అర్థం చేసుకోవచ్చు. కాని అది దేశ సార్వభౌమాధికారానికి, హుందాతనానికి, ఆత్మగౌరానికి కలిగించిన హాని అంతా ఇంతా కాదు.



## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## 'తమ్మినేని ప్రయోగాలు సరే.. పార్టీ గోప్యత సంగతేంటి..?

భారతదేశ రాజకీయ పటంలో కమ్యూనిస్టు పార్టీలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. సిద్ధాంతం, క్రమశిక్షణ, అంతర్గత గోప్యత అనే మూడు స్తంభాల మీద ఈ పార్టీల నిర్మాణం ఆధారపడి ఉంటుందనేది ఒక సూత్రం. అయితే, మారుతున్న కాలంతో పాటు తెలంగాణ సీపీఎంలో వస్తున్న మార్పులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హయాంలో పార్టీ ప్రదర్శించిన అంశాలపై చర్చ జరుగుతోంది. తమ్మినేనితో పాటు మరో ఇద్దరిపై 'అభిశంసన' తీర్మానం చర్చకు తెరలేపింది. అయితే 'అభిశంసన' చర్యలు ఒకభాగమైతే, ఈ పరిణామక్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హయాంలో జరిగిన ప్రయోగాలు ఆ నిర్ణయాల్లో భాగస్వాములైన కమిటీ బాధ్యత, సడలుతున్న పార్టీ గోప్యతపై ఇప్పుడు అసలైన చర్చ జరగాల్సి ఉంది. కమ్యూనిస్టు పార్టీ రాజ్యాంగం ప్రకారం ఏ సెక్రెటరీ కూడా ఒంటెద్దు పోకడలతో నిర్ణయాలు తీసుకోలేరు. రాష్ట్ర సెక్రెటరీ సారథ్యంలో ప్రవేశపెట్టిన ప్రతి వ్యూహం వెనుక రాష్ట్ర కమిటీ, రాష్ట్ర కార్యవర్గాల ఆమోదం ఉంటుంది. ఈ లెక్కన ఒకవేళ ఆ ప్రయోగాలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోతే లేదా రాజకీయంగా దెబ్బతీస్తే, దానికి కేవలం అప్పుడు కార్యదర్శిగా ఉన్న తమ్మినేనిని మాత్రమే బాధ్యుడిని చేయడం సమంజసం ఎలా అవుతుంది..? 'అభిశంసన' చర్చ సాగుతున్న ఈ పరిస్థితుల్లో ఆ నిర్ణయాలు తీసుకున్నప్పుడు కమిటీలో ఉన్న ఇతర సీనియర్ నేతలు ఏం చేశారు..? అనేది ఇప్పుడు కేడర్‌లో, కమ్యూనిస్ట్ అభిమానులు, సానుభూతి పరుల్లో ఎదురవుతున్న మిలియన్ డాలర్ల ప్రశ్న. నిర్ణయం సరైనది కానప్పుడు అడ్డుకోని నేతలు, ఇప్పుడు అది విఫలమయ్యాక 'అభిశంసన' ప్రక్రియను ముందుకు తేవడం 'సమిష్టి బాధ్యత' అనే సిద్ధాంతానికి విరుద్ధం కాకుండా ఏమవుతుంది..?

సాధారణంగా కమ్యూనిస్టు పార్టీలు ఒక నిర్దిష్ట చట్రంలో, పాత కాలపు ఎత్తుగడలతో సాగుతాయనే విమర్శ ఉంటుంది. కానీ తమ్మినేని వీరభద్రం దీనికి భిన్నంగా తనదైన 'డైనమిక్' నాయకత్వాన్ని ప్రదర్శించారనే చెప్పాలి. కేవలం ఆర్థిక పోరాటాలకే పరిమితం కాకుండా 'సామాజిక న్యాయం' అనే నినాదాన్ని ఎత్తుకోవడం తమ్మినేని చేసిన అతిపెద్ద ప్రయోగం. మహాజన పాదయాత్ర ద్వారా కుల సంఘాలను, దళిత, బహుజన శక్తులను ఎర్రజెండాతో అనుసంధానించడంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారనేది కూడా మరువొద్దు. సంప్రదాయ పొత్తులకు భిన్నంగా, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (BLF) వంటి సరికొత్త ప్రయోగాలు చేయడం ద్వారా పార్టీకి కొత్త వర్గాలను పరిచయం చేసే ప్రయత్నం జరిగింది. ఇది పార్టీ క్యాడర్‌లో ఒకరకమైన చలనాన్ని తీసుకువచ్చిందని అప్పట్లో చర్చలు జరిగాయి. దళిత, బహుజన సమస్యలను పార్టీ ప్రధాన ఎజెండాలోకి తెచ్చారు. గతంలో కేవలం "కూలీ, నాలి" సమస్యలకే పరిమితమైన ఎర్రజెండా, ఆత్మగౌరవ పోరాటాలకు కూడా వేదికైంది. 5 నెలల పాటు సాగిన తమ్మినేని యాత్ర సిపిఎంకు ఒక కొత్త 'మాస్ అప్పీల్' ఇచ్చింది. తమ్మినేని ఒక రాజకీయ నాయకుడిగానే కాకుండా, ఒక సామాజిక కార్యకర్తగా ప్రజల్లోకి వెళ్లడం పార్టీ ఇమేజ్‌ను మార్చింది. ఇది ఆయన తీసుకున్న అత్యంత డైనమిక్ నిర్ణయం. అయితే కారణాలు ఏమైనప్పటికీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత కాలక్రమేనా సీపీఎం ఉనికి తగ్గుకుంటూ వచ్చింది. దీంతో ప్రయోగాలు ఫలితాలు ఇవ్వనప్పుడు కాలం గడిచాక సమీక్షించటం వల్ల ఏం ప్రయోజనం..? ఆ నిర్ణయాలు అప్పటి కార్యవర్గం ఆమోదించకుండానే, కేంద్ర కమిటి నాయకత్వానికి తెలియకుండానే అమలు జరిగాయా..? అనేది ఆలోచించాల్సిన అంశంగా చూడక తప్పదు. ఇక మరో అంశం ఏంటంటే సిపిఎంకు ఉన్న అతిపెద్ద బలం దాని అంతర్గత చర్చల గోప్యత. కానీ ఇటీవల కాలంలో ఈ 'ఇనుప కవచం' ముక్కలవుతోంది. సమావేశం లోపల నేతల మధ్య జరిగిన వాదోపవాదాలు, విమర్శలు యథాతథంగా మీడియాకు చేరడం వెనుక పెద్ద వ్యూహమే కనిపిస్తోంది. పార్టీలో తమ పట్టు నిలుపుకోవడానికి లేదా ప్రత్యర్థులను ఇరకాటంలో పెట్టడానికి కొందరు నేతలే ఉద్దేశపూర్వకంగా సమాచారాన్ని బయటకు పంపుతున్నారా..? అన్నది ఇప్పుడు క్షేత్రస్థాయిలో జరుగుతున్న చర్చ. కమ్యూనిస్టు పార్టీ అంటే క్రమశిక్షణకు కేరాఫ్ అడ్రస్ గా భావన ఉంటుంది. కానీ ఇప్పుడు సాధారణ రాజకీయ పార్టీల వలె లోపలి విషయాలు రచ్చకెక్కడం వల్ల సామాన్య కార్యకర్తల్లో నైతిక స్థైర్యం దెబ్బతింటోందనే స్పృహ అగ్రనేతలు మరిచారేమో అన్నట్లుగా వ్యవహారం సాగుతున్నది. ఒక నిర్ణయం తప్పని తెలిసినప్పుడు కమిటీలో వ్యతిరేకించకుండా, ఒక వేల వ్యతిరేకించినప్పటికీ చర్చలు జరిగి చివరికి ఆమోదం పొందిన నిర్ణయాలను ఆ తర్వాత ఆ నిర్ణయాల ఫలితం ఇవ్వలేదని భావించినప్పుడు ఆ తప్పును కేవలం వ్యక్తి మీదకు నెట్టివేసి తప్పుకోవాలని చూడటం సంస్థాగత బలహీనతను కూడా సూచిస్తుంది. మరో అంశం ఏంటంటే కమ్యూనిస్టు పార్టీలలో 'డెమోక్రటిక్ సెంట్రలిజం' (ప్రజాస్వామ్య కేంద్రకత) అత్యంత కీలకం. అంటే, చర్చలు నాలుగు గోడల మధ్య లోపల జరగాలి, నిర్ణయం మాత్రమే బయటకు రావాలి. కానీ, సిపిఎం అంతర్గత సమావేశాల్లో జరిగే సుదీర్ఘ చర్చలు, విమర్శలు, ప్రతివిమర్శలు యథాతథంగా మీడియాకు చేరడం విస్మయానికి గురిచేస్తోంది. సమావేశం ముగియక ముందే "ఎవరు ఎవరిని నిలదీశారు?", "ఎవరిపై వేటు పడబోతోంది..?" వంటి సమాచారం నిమిషాల వ్యవధిలో స్క్రోలింగ్‌లలో కనిపిస్తోంది. పార్టీ ప్రయోజనాల కంటే తమ వ్యక్తిగత అజెండాలను లేదా గ్రూపు రాజకీయాలను నెగ్గించుకోవడానికి కొందరు నేతలే ఉద్దేశపూర్వకంగా సమాచారాన్ని మీడియాకు ఇస్తున్నారా..? అనే సందేహాలు కూడా సహజంగానే కలుగుతున్నాయి. సోషల్ మీడియా యుగంలో రహస్యాలను దాచడం కష్టమైనప్పటికీ, కమ్యూనిస్టు కేడర్ ఆ స్థాయికి దిగజారడం ఆందోళనకరం. అయితే పార్టీ లోపల జరిగే చర్చలు మీడియాకు లీక్ అవ్వడం వెనుక రెండు కారణాలు ఉండవచ్చు ఒకటి, తమ వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లి హైకమాండ్‌పై ఒత్తిడి తేవడం. రెండు, ప్రత్యర్థి వర్గాన్ని దెబ్బతీయడం. ఈ రెండు ధోరణులు ఎవరు అనుసరించినా కమ్యూనిస్టు క్రమశిక్షణకు గొడ్డలి పెట్టు. ఆ పార్టీకి అప్రతిష్ట. ఇలాంటి స్థితిని నిబద్ధతతో సమీక్షించుకొని దిద్దుబాటు చేసుకుంటారా లేదా అనేది ఆ పార్టీ అగ్ర నాయకత్వమే తేల్చుకోవాల్సిన అంశం.



రాజేందర్ దామెర
సీనియర్ జర్నలిస్ట్

# నేపాల్ ఎన్నికల్లో నవతరం జోరు

నేపాల్‌లో అక్కడి నవతరం ఆకాంక్షలకు అనుగుణంగా మాజీ రాపర్, ఖట్మండూ మాజీ మేయర్, 35 ఏళ్ల బాలేంద్ర షా ( బాలెన్) నాయకత్వంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కడపటి వార్తలు అందుతున్న సమయానికి, అక్కడి పాత పార్టీలను వెనక్కు నెట్టి రాష్ట్రీయ స్వతంత్రతా పార్టీ మెజారిటీ స్థానాలలో ముందుకు దూసుకెళుతుండడమే ఇందుకు నిదర్శనం. నాలుగు సార్లు ప్రధాన మంత్రిగా చక్రం తిప్పిన కె.పి.ఓలిపై పోటీచేసి బాలేంద్ర విజయం సాధించడం ఆషామాషీ విషయం కాదు. ఈ ఏడాది సెప్టెంబర్ లో జెన్ జీ నాయకత్వంలో యువతరం నిరసనలతో నేపాల్ లో ముందస్తు ఎన్నికలు అనివార్యమయ్యాయి. నల్ల కళ్లజోడు, నల్లదుస్తులు ,నవతరాన్ని ఊపేసే ప్రసంగాలు, సోషల్ మీడియా పోస్టులతో యుతరాన్ని ఆకట్టుకుంటూ ఈ ఎన్నికలలో, బాలెన్ సుడిగాలి పర్యటనలు చేసి రాష్ట్రీయ స్వతంత్రతా పార్టీని విజయ పథంలో నడిపిస్తున్నాడు. 275 మంది సభ్యులుగల నేపాల్ ప్రతినిధుల సభ హౌస్ ఆఫ్ రెప్రజెంటెటివ్స్ లో 165 స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతుండగా , 110 స్థానాలను పార్టీలకు వచ్చిన ఓట్ల దామాషా ప్రకారం కేటాయిస్తారు. ఈ ఎన్నికలలో 65 రాజకీయ పార్టీలు 3,406 మంది అభ్యర్థులను రంగంలోకి దింపాయి.

**అస్థిర ప్రభుత్వాలు ః** నేపాల్ 2008లో ప్రజాస్వామ్య రిపబ్లిక్ గా అవతరించినప్పటినుంచి గత 18 సంవత్సరాలలో అక్కడ 14 ప్రభుత్వాలు మారాయి. ఏ ఒక్క ప్రభుత్వమూ తన పదవీ కాలాన్ని పూర్తి చేయలేకపోయింది. దీనికితోడు రాజకీయపార్టీలు అవసరార్థం పొత్తులతో అధికారం కైవసం చేసుకుంటూ వచ్చాయి. 2008 తర్వాత జరిగిన ఎన్నికలలో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో అవసరార్థం పొత్తులే అక్కడి పార్టీలకు దిక్కయ్యాయి.

**జెన్ జీ మహిమ :** పట్టుమని మూడున్నరేళ్ల క్రితం, ఏర్పడిన ఆర్.ఎస్.పి ఇప్పుడు అక్కడి పాత పార్టీలైన పుష్పకమాల్ దహల్ ప్రచండ నాయకత్వంలోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు సెంటర్) -సిపిఎన్ (ఎంసి), కెపిశర్మ ఒలి నాయకత్వంలోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ )-సిపిఎన్ (యుఎంఎల్), షేర్ బహదూర్ దేవ్ బా నాయకత్వంలోని నేపాలీ కాంగ్రెస్ లకు పెను సవాలుగా నిలిచింది. ఇదంతా జెన్ జీ మహిమే. 2022 జూన్ 21న రాష్ట్రీయ స్వతంత్రా పార్టీని టెలివిజన్ ప్రెజెంటర్ రబి లమిచ్చానే ఏర్పాటు చేశారు. అవినీతికి వ్యతిరేకంగా దీనినొక బలమైన వేదికగా అప్పట్లో ప్రకటించుకుని 2022 పార్లమెంటరీ ఎన్నికలలో ఆ పార్టీ పోటీ చేసినా, ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఏడు స్థానాలు, పార్టీకి వచ్చిన ఓట్ల దామాషా ప్రకారం 13 ప్రాతినిధ్య స్థానాలు మాత్రమే దక్కించుకుంది. ఇప్పుడు పెద్ద పార్టీలకు ఇది పెను సవాలుగా నిలిచింది.

**సామాజిక మాధ్యమమే అస్త్రం :** ఇప్పటివరకు నేపాల్ లో




రాజకీయాలు నడిపిన సంప్రదాయ పార్టీల నేతలంతా ఏడు పదులవయసులో ఉండడం, ఉవ్వెత్తున ఎగిసిన జెన్ జీ నిరసనలతో పాత పార్టీలలోనూ యువతరానికి చోటు కల్పించడానికి ఆలోచిస్తున్న సమయంలోనే 35 ఏళ్ల బాలేన్ ఖట్మండూ మేయర్ పదవికి రాజీనామా చేసి రాష్ట్రీయ స్వతంత్రతా పార్టీలో చేరారు. పాత తరం నాయకులంతా తమ ప్రచారానికి ఇంకా ప్రెస్ మీట్లుపెట్టుకుంటూ కూర్చుంటుంటే రూటు మార్చి బాలేన్ సామాజికమాధ్యమాల ద్వారా యువతరానికి చేరువయ్యే ప్రయత్నం చేశారు. ఫేస్ బుక్ లో 35 లక్షల మంది ఫాలోవర్లు, ఇన్‌స్టాగ్రామ్‌లో పది లక్షల మంది, ఎక్స్‌లో నాలుగు లక్షల మంది, యూట్యూబ్‌లో పది లక్షలమంది ఫాలోవర్లతో సోషల్ మీడియా వేదికలను తన ప్రధాన ప్రచారాస్త్రాలుగా చేసుకుని యువతకు దగ్గరయ్యారు.

**నేపాల్ తో మన బంధం :** నేపాల్ తో మన బంధం ఈనాటిది కాదు. రెండు దేశాలమధ్య సన్నిహిత సంబంధాలున్నాయి. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐదుసార్లు నేపాల్ సందర్శిస్తే, నేపాల్ ప్రధానులు పది సార్లు భారత్ ను సందర్శించారు. ఇండియా - నేపాల్ మధ్య ఐదు రాష్ట్రాలు సిక్కిం, పశ్చిమబెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ లతో సరిహద్దు ఉంది. నేపాల్ తో చైనా సంబంధాల వంటి అంశాలు అప్పుడప్పుడూ తెరపైకి వచ్చినా రెండు దేశాల మధ్య సంబంధాలు సజావుగానే సాగుతున్నాయి. నేపాల్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా, ఇన్వెస్టర్‌గా భారత్ ఉంది. నేపాల్ ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు వీలుగా భారతీయ పోర్టులను వాడుకునే సదుపాయాన్ని ఇండియా కల్పించింది. భారతీయ సంస్థలు బ్యాంకింగ్. ఇన్సూరెన్స్ , పవర్, తయారీ రంగం, పర్యాటకం, డ్రైపోర్టుల రంగంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా నేపాల్ జీడిపికి, ఉపాధి కల్పనకు ఊతం ఇస్తున్నాయి. నేపాల్‌లో ఏ ప్రభుత్వం ఏర్పడినా , ఆ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు , ద్వైపాక్షిక సంబంధాలు పటిష్టం చేసుకునేందుకు సిద్దంగా ఉన్నట్టు మన దేశం ఇప్పటికే ప్రకటించింది.

**వివాదాస్పద వ్యాఖ్యలు :** ఇప్పటివరకూ ఉన్న మీడియా కథనాల ప్రకారం రాష్ట్రీయ స్వతంత్రతా పార్టీని విజయ తీరాలకు చేరుస్తున్న బాలేంద్ర షా కే ప్రధానమంత్రి పగ్గాలు అప్పగిస్తారని ప్రచారం సాగుతోంది. మరో రెండు రోజులలో పూర్తి ఫలితాలు వచ్చాక పరిస్థితి మరింత స్పష్టం అవుతుంది. అయితే మాటల తూటాలు పేల్చి యువతను ఆకట్టుకునే బాలేంద్ర అంతర్జాతీయ సంబంధాలు, సున్నిత దౌత్య సంబంధాల విషయంలో ఏ మేరకు నెగ్గుకు రాగలరన్నది చూడాలి. గతంలో ఖట్మండూ మేయర్ గా ఉన్నప్పుడు బాలేంద్ర చేసిన పలు వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. రాజకీయపార్టీలన్నిటిపైనా ఒక సారి సామాజిక మాధ్యమాలలో విరుచుకుపడిని బాలేంద్ర ఆ తర్వాత కొద్ది గంటలలోనే వాటిని ఉపసంహరించుకున్న సందర్భాలూ ఉన్నాయి. మేయర్‌గా ఉంటూనే ఇతర దేశాలతో నేపాల్ సంబంధాలను ప్రభావితం చేసే వ్యాఖ్యలు చేసినపుడే, బాలేంద్ర జాతీయ రాజకీయాలలోకి రావాలని తలపోస్తున్నారని అందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు అటు యువత ఆకాంక్షలను నెరవర్చడంతోపాటు, దౌత్యసంబంధాలలో నెగ్గుకురావడం కత్తిమీద సాములాగే చెప్పుకోవచ్చు.



రేవూరు
ఉమామహేశ్వరరావు,
సీనియర్ జర్నలిస్ట్
9573794759

## మహిళ గెలవాలి

చిన్ని చిన్ని మొక్కలన్ని
వృక్షాలుగా మారినట్టు
మెల్లమెల్లగా మహిళా కీర్తి
లోకమెల్ల సాగుతుంది
నేటి వనిత తన చేతలతో
తన సత్తా చూపుతోంది

పోలీసు శాఖనైనా, కంప్యూటర్ రంగమైన
విమానయానమైన, రాజకీయమైనా
ఒక్కటేమిటి ఆటపాటలు మొదలు
సాటిలైట్ వరకు
తన బుద్ధి కౌశలంతో రాణించుకుంటూనే
ఏ రంగమైన వెనుకాడమని



స్త్రీ జాతికిఎందరో మహిళా మూర్తులు
స్పూర్తిగా ఉన్నారు
ఆర్థికమైన, ఆధ్యాత్మికమైన
వారి మనుగడ నిరంతరం సాగుతూనే ఉంది
అభల అనే అర్ధానికి వ్యతిరేకం తానై
సభల అనే మార్గానికి మగువ
గట్టి పునాదులే వేస్తోంది

ఆడదే అన్నింటికీ మూలం
అంటూనే అనగదొక్కేవారు
నేటి సమాజంలో ఆ భావం వీడి
స్త్రీలను గౌరవించేలా
మహిళ మార్గదర్శకం అవుతుంది
అయినా! మహిళలు ఇంకా ఎదగాలి

మహిళ వరమిచ్చే దేవత కాకున్నా
మానవజాతికి జన్మనిచ్చే చల్లని తల్లి
అందుకే మహిళలు ప్రకృతిలో
చక్కని వన్నె తగ్గని మణిహారాలు
మంత్రిని వోలె ఇంటా బయట
యంత్రాంగం నడుపుతున్న అతివలు
అన్నివేళలా అందరి అభినందనలతో
పరిమళించాలి పుడమి గుండెల్లో
మళ్లీమళ్లీ పుట్టి గెలవాలి!

బొమ్మిదేని రాజేశ్వరి, పెద్దపల్లి
9052744215

## ప్రజాస్వామ్యమా, ధనస్వామ్యమా?

ఎన్నికలు అంటే సామాన్యుడి ఆకాంక్షల ప్రతిబింబం కావాల్సింది పోయి, కోట్ల రూపాయల లావాదేవీల వేదికగా మారుతున్నాయా? ఈ ప్రశ్న ప్రతి పౌరుడినీ వేధిస్తోంది. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ఖర్చు ఆకాశాన్ని తాకుతున్న తరుణంలో, అసలు ప్రజాస్వామ్యం బతికే ఉందా అన్న సందేహం కలగక మానదు. రాజకీయ విశ్లేషకులు దీనిని ప్లూటోక్రసీ (ధనవంతుల పాలన) వైపు సాగుతున్న ప్రయాణంగా అభివర్ణిస్తున్నారు. గత రెండు దశాబ్దాల గణాంకాలను పరిశీలిస్తే, ఎన్నికల వ్యయం ఊహకందని రీతిలో పెరిగింది. 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల నుండి నేటి వరకు ఖర్చు వేల రెట్లు పెరిగింది. ఒకప్పుడు సైకిళ్లపై, కాలినడకన ప్రచారం చేసే రోజులు పోయి, ఇప్పుడు హెలికాప్టర్లు, లగ్జరీ వాహనాలు, భారీ బహిరంగ సభలు అనివార్యమయ్యాయి. ఎన్నికల సంఘం అభ్యర్థుల ఖర్చుపై పరిమితులు విధిస్తున్నప్పటికీ, అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఒక ఎంపీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి వందల కోట్లు ఖర్చు పెడుతున్నారనేది బహిరంగ రహస్యం. ఈ పెట్టుబడి వెనుక ఉన్న ఉద్దేశం కేవలం సేవ మాత్రమేనా? ఖచ్చితంగా కాదు. పెట్టిన పెట్టుబడికి వంద రెట్లు లాభం సంపాదించాలనే ఆలోచనే రాజకీయాలను వ్యాపారమయం చేస్తోంది. రాజకీయ పార్టీలకు నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయి? ఇది మిలియన్ డాలర్ల ప్రశ్న. పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు రాజకీయ పార్టీలకు భారీగా విరాళాలు ఇస్తుంటాయి. అయితే, ఈ విరాళాలు ఉచితంగా రావు. అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు అనుకూలమైన జీవోలు (GOs), కాంట్రాక్టులు, లైసెన్సులు పొందడమే వీరి ప్రధాన లక్ష్యం. దీనినే క్విడ్ ప్రో కో (ప్రతిఫలంగా ఇవ్వడం) అంటారు. దీనివల్ల సామాన్య ప్రజల ప్రయోజనాలు పక్కన పడి, బడా బాబుల లాభాలే ప్రభుత్వ ప్రాధాన్యతలుగా మారుతున్నాయి. ఎన్నికల సమయంలో నగదు పంపిణీ అనేది భారత ప్రజాస్వామ్యానికి పట్టిన అతి పెద్ద చీడపురుగు. ఒకప్పుడు మద్యం, బిర్యానీ ప్యాకెట్లకు పరిమితమైన ప్రలోభాలు, ఇప్పుడు నేరుగా నగదు బదిలీ (Cash for Vote) స్థాయికి చేరాయి. ఓటుకు రూ. 2,000 నుండి రూ. 10,000 వరకు పంచుతున్నారనే వార్తలు మన ప్రజాస్వామ్య విలువలను ఏ స్థాయికి దిగజారుస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. పేదరికం, నిరుద్యోగం వల్ల సామాన్యుడు ఆ క్షణికావేశంలో ఇచ్చే డబ్బుకు ఆశపడి తన ఐదేళ్ల భవిష్యత్తును అమ్ముకుంటున్నాడు. ఈరోజు నువ్వు తీసుకునే రెండు వేల రూపాయలు, రేపు నీ బిడ్డకు అందాల్సిన నాణ్యమైన విద్యను, నీకు అందాల్సిన ఉచిత వైద్య సదుపాయాన్ని దూరం చేస్తాయి అన్న చేదు నిజం ఓటరుకు అర్థం కావడం లేదు. ప్రస్తుతం ఎన్నికల యుద్ధం క్షేత్రస్థాయిలో కంటే మీడియాలో ఎక్కువగా జరుగుతోంది. వార్తల రూపంలో ప్రకటనలను ప్రచురించడం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. ఐటీ సెల్స్ (IT Cells) ద్వారా ప్రత్యర్థులపై బురద చల్లడం, తప్పుడు సమాచారాన్ని (Fake News) వైరల్ చేయడం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఓటర్ల నాడిని పట్టుకోవడానికి ప్రైవేట్ ఏజెన్సీలను నియమించుకుని, వారి మనస్తత్వాలను ప్రభావితం చేసేలా డిజిటల్ క్యాంపెయిన్స్ నిర్వహిస్తున్నారు. రాజకీయ నిధుల్లో పారదర్శకత తీసుకురావడానికి తెచ్చిన ఎన్నికల బాండ్లు (Electoral Bonds) తీవ్ర విమర్శలకు గురయ్యాయి. విరాళాలు ఇచ్చే వారి పేర్లు రహస్యంగా ఉంచడం వల్ల, ఎవరు ఎవరికి ఎంత ఇచ్చారో తెలియని పరిస్థితి ఏర్పడింది. అయితే, ఇటీవలే సుప్రీం కోర్టు ఈ పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని రద్దు చేయడం ప్రజాస్వామ్య ప్రియులకు ఒక పెద్ద ఊరట. ఇది రాజకీయాల్లో నల్లధనం ప్రవాహాన్ని అడ్డుకోవడానికి మొదటి అడుగు మాత్రమే. డబ్బుతో పాటు ఓటర్లను ప్రభావితం చేసే ఇతర కీలక అంశాలు కులం మరియు మతం. ఎన్నికల సమయంలో అభ్యర్థులు తమ కుల సంఘాలకు భారీగా నిధులు కేటాయించడం, మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి ఓట్లు పొందడం చూస్తున్నాం. అభివృద్ధిని ప్రాతిపదికగా తీసుకోకుండా, భావోద్వేగాలతో ఓట్లు సాధించడం వల్ల నిజమైన సమస్యలు అంటే ధరల పెరుగుదల, నిరుద్యోగం, సాగునీటి కొరత మరుగున పడిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాయకులతో ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. అక్కడ సామాజిక ఒత్తిళ్లు ఎక్కువ. కానీ పట్టణ ప్రాంతాల్లో ఓటర్లు కొంత భిన్నంగా ఆలోచిస్తున్నారు. విద్యావంతులు, యువత సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని విశ్లేషించుకుని ఓటు వేస్తున్నారు. అయినప్పటికీ, పట్టణాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండటం మరో ఆందోళనకరమైన విషయం. చదువుకున్న వారు ఓటు వేయడానికి రాకపోవడం వల్ల, ప్రలోభాలకు లోనయ్యే వర్గాల ఓట్లే అభ్యర్థుల తలరాతను మారుస్తున్నాయి. భారత ఎన్నికల సంఘం (ECI) ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సంస్థలలో ఒకటి. ఎన్నికల నిర్వహణలో అది చూపే పటిష్టత అమోఘం. కానీ, ధన ప్రవాహాన్ని అరికట్టడంలో అది కొన్ని పరిమితులను ఎదుర్కొంటోంది. ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఎన్ని తనిఖీలు చేసినా, డిజిటల్ పేమెంట్స్ (GPay, PhonePe) ద్వారా లేదా వినూత్న మార్గాల్లో డబ్బు చేరుతూనే ఉంది. నిబంధనలు ఉల్లంఘించే అభ్యర్థులపై కఠినమైన అనర్హత వేటు వేయగలిగే అధికారాలు ఎన్నికల సంఘానికి మరింతగా అవసరం. రాజకీయాలను ప్రక్షాళన చేయాలంటే కొన్ని విప్లవాత్మక మార్పులు అవసరం , అభ్యర్థులు సొంతంగా ఖర్చు పెట్టుకోకుండా, ప్రభుత్వమే ఎన్నికల నిధిని ఏర్పాటు చేసి అభ్యర్థులకు ప్రచార వనరులు కల్పించాలి. నేర చరిత్ర ఉన్న వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయకుండా శాశ్వత నిషేధం విధించాలి. సరిగ్గా పని చేయని ప్రజాప్రతినిధిని ఐదేళ్ల కంటే ముందే వెనక్కి పిలిచే అధికారం ఓటరుకు ఉండాలి ప్రతి పార్టీ తన నిధుల వివరాలను వెబ్‌సైట్‌లో బహిరంగంగా ఉంచాలి. మార్పు అనేది చట్టాల ద్వారా మాత్రమే రాదు, పౌరుల ఆలోచనా విధానంలో రావాలి. డబ్బు తీసుకుని ఓటు వేయడం అంటే మన ఆత్మగౌరవాన్ని అమ్ముకోవడమే అన్న స్పృహ ప్రజల్లో కలగాలి. రాజకీయ నాయకులు పంపిణీ చేసే డబ్బు మన పన్నుల రూపంలో దోచుకున్నదే అన్న సత్యాన్ని గుర్తించాలి. రేపటి ప్రజాస్వామ్యం మన చేతుల్లో ప్రజాస్వామ్యం అనేది ఒక నిరంతర ప్రక్రియ. ఇది కేవలం ఐదేళ్లకోసారి ఓటు వేయడంతో ముగిసిపోదు. మనం ఎన్నుకున్న ప్రతినిధులను ప్రశ్నించడం, వారి పనితీరును గమనించడం మన బాధ్యత. ఎన్నికల్లో ధన ప్రభావం అనేది ఒక పెద్ద సవాలు, కానీ అది అజేయమైనది కాదు. యువత మేల్కొని, నైతిక విలువల పట్ల కట్టుబడి ఉంటే, ఈ ధనస్వామ్యాన్ని మళ్లీ ప్రజాస్వామ్యంగా మార్చడం అసాధ్యమేమీ కాదు. గుర్తుంచుకోండి, ఒక చెడ్డ నాయకుడు ఎన్నిక కావడానికి కారణం,మంచి ఓటరు ఓటు వేయకపోవడం లేదా తప్పుడు ప్రలోభాలకు లోనవ్వడమే. మన ఓటు మన భవిష్యత్తు. దానిని అమ్ముకోకండి, గౌరవించండి.



డా. సూర్యదేవర
రామకృష్ణ
9490754169

# ఘనంగా వేంకటేశ్వరుడి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు

**స్వామి వారి సేవలో తరించిన పోలీసులు**
**ప్రత్యేక పూజలు నిర్వహించిన పోలీసు కుటుంబాలు**
**నేటి స్వామి వారి రథోత్సవానికి పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు**

**ధర్మపురి మార్చి 07 (వుదయం ప్రతినిధి):**
ధర్మపురి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించే స్వామి వారి రథోత్సవాలకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఐ రాం నర్సింహారెడ్డి పేర్కొన్నారు.ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వేంకటేశ్వ రుని దక్షిణ ఉత్తర దిగ్యాత్ర లు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామివార్ల ఉత్సవ మూర్తులను యజ్ఞాచార్యులు పురుషోత్తమా చార్యులు నేతృత్వంలో ఉప ప్రధాన అర్చకులు నెరేళ్ల శ్రీనివాసచార్యులు, వేద పండితులు బొజ్జా రమేష్ శర్మ, పాలేపు ప్రవీణ్ శర్మ, అర్చకుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ఈఓ సంకటాల శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన పల్లకి సేవపై స్వామివారిని ఆశీనులను చేసి ఊరేగింపుగా ఆటపాటలతో దక్షిణ దిశగా రక్షకభట నిలయాన్ని తీసుకువెళ్లారు.అప్పటికే అలంక రించిన ప్రత్యేక వేదికపై స్వామి వారికి సీఐ రాం నరసింహారెడ్డి దంపతులు, ఎస్సైలు మహేష్ దంపతులు, రవీందర్ దంపతులు, గొల్లపెల్లి ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి దంపతులు, పోలీస్ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం స్వామివారిని పల్లకి సేవ పై ఆసీనుల చేసి ఉత్తర దిశలోని ఉసిరిక వాగు వద్దకు తీసుకు వెళ్లగా అప్పటికే అలంకరించిన వేదిక పై స్వామివారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనం తరం స్వామి వారిని తిరిగి ఆలయానికి తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో సూపరిండెంట్ కిరణ్,అర్చకులు, సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలి




**విద్యా, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత**
**ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి**
**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**
**హనుమకొండ కలెక్టరేట్‌లో దిశా సమావేశం**
**పాల్గొన్న రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, మేయర్, కలెక్టర్**




**హనుమకొండ, మార్చి 07 (వుదయం జిల్లా ప్రతినిధి) :**
ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ జిల్లాను అభివృద్ధిపథంలో అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ( దిశా) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గత దిశా సమావేశంలో నిర్ణయించిన అంశాలపై తీసుకున్న చర్యలు, మహిళా శిశు సంక్షేమ, జిల్లా వైద్య ఆరోగ్య, విద్యా, వ్యవసాయ గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య, నీటిపారుదల, గనులు, భూగర్భ జల, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి, జిల్లా ముఖ్య ప్రణాళిక తదితర శాఖలకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనులు, వాటి పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో దిశా కమిటీ చైర్ పర్సన్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యా వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. పాఠశాలల్లో డ్రాపౌట్స్‌పై దృష్టి సారించాలని అదేవిధంగా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను గణనీయంగా పెంచాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. హనుమకొండ జిల్లా పదో తరగతి ఫలితాల్లో అగ్రస్థానంలో ఉండాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు పూర్తయ్యేంతవరకు స్నాక్స్ అందజేయాలన్నారు. గర్ల్స్ హాస్టల్‌ను తెచ్చుకునే అవకాశం ఉంటుందన్నారు. పీఎం సూర్య ఘర్ సోలార్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని, వాటిని ఏర్పాటు చేయడం ద్వారా నిరంతరాయంగా సోలార్ విద్యుత్ ను అందజేయవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు టాయిలెట్స్ ఉండాలనేది ఎంతో ముఖ్యమని సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ఇచ్చిందని పేర్కొన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో వైద్య ఆరోగ్య సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జి రామ్ జీ పథకం గైడ్లెన్స్ గురించి తెలియజేయాలన్నారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు నివారణకు చర్యలు చేపట్టాలని నేషనల్ హైవే, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. రోడ్లపై చాలా చోట్ల విద్యుత్ దీపాలు లేవని, వెంటనే అమర్చాలని అన్నారు. వచ్చే దిశా సమావేశానికి అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులపై సమగ్ర వివరాలతో హాజరుకావాలని అన్నారు. రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువ స్థాయిలో ఉందని అన్నారు. జిల్లాలతో పోల్చుకున్నట్లయితే జిల్లా ప్రగతి తక్కువగా ఉందన్నారు. జిల్లా లో ప్రీ స్కూల్స్ ను ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్రోల్మెంట్ మీద అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. బడిబాట కార్యక్రమంతో విద్యార్థుల నమోదును చేపట్టాలన్నారు. ప్రీ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు కలెక్టర్ కు అందజేయాలన్నారు. బాలికల పాఠశాలలో టాయిలెట్స్ లేవని, వాటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు 21 ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ పరికరాలను ఇచ్చానని, డిజిటల్ బోధన సాగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. వరంగల్ చౌరస్తా ప్రాంతంలో డ్రైనేజి సమస్య పరిష్కరించాలని అన్నారు. స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. జిల్లాలో 400లకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని 18వేలమంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు తక్కువగా ఉన్నాయని. విద్యార్థుల ప్రవేశాల నమోదును పెంచాలని, మండలానికి ఇన్చార్జి అధికారిని నియమించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి విద్యార్థుల ప్రవేశాలను పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా, మౌలిక వసతులను కల్పిస్తూ మంచి ఫలితాలు సాధించే విధంగా కలెక్టర్ డీఈవో కృషి చేయాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా నీళ్లు అందించాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన వసతులను కల్పించేందుకు అంచనాలను సిద్ధం చేయాలని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలకు సోలార్ సదుపాయాన్ని కల్పించాలని, ఆ దిశగా అధికారుల చర్యలు చేపట్టాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్తును సరఫరా చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. సిపిఆర్ పై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల స్థాయిలో హార్ట్ ఎటాక్‌లు వస్తున్న దృష్ట్యా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు.
ఈ సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. శాయంపేట మండలం పెద్దకోడెపాకలోని ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు లేవని అన్నారు. పాఠశాలల్లో తాగునీరు, కరెంటు, టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు సమావేశంలో చర్చించిన అంశాలపై సమగ్ర నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పనుల పురోగతి కొరకు అధికారులంతా సమిష్టిగా పనిచేస్తూ ప్రగతి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. నగరంలోని ఫిల్టర్ బెడ్లలో చేపట్టిన మరమ్మతులు ఈ నెల 31 తేదీ వరకు పూర్తి చేస్తామన్నారు. సమావేశం అనంతరం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బాలికలకు వేసే హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమం, అదేవిధంగా టీజీ రెడ్కో ఆధ్వర్యంలో తయారుచేసిన ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకానికి సంబంధించిన పోస్టర్లను ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు, కలెక్టర్, తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ రవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్ లను పంపిణీ...



**వరంగల్, మార్చి 07 (వుదయం ప్రతినిధి) :**
ఇందిరమ్మ మైనారిటీస్ మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం వరంగల్ జిల్లా పరిధిలా వరంగల్ మండలంలోని శివ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు కుట్టు మిషన్ లను రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, కార్పొరేటర్లు పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, గుండు చందన, పోశాల పద్మ, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 35వ డివిజన్‌లో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రపరిచి పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ ప్రజలు చెత్తను వేరు చేసి అందించాలనీ, పారిశుధ్యాన్ని పాటించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో నగరంలో స్వచ్ఛత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు.

# పండుగల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు



- ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, జిల్లా కలెక్టర్
- ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం
- ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, మార్చి 7 (వుదయం ప్రతినిధి) :**
కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భిక్కనూర్ లక్ష్మీ, చిట్యాల రాజమణిలకు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం ఆదేశాల మేరకు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు, వస్త్రాలు అందజేశారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో ఫోన్ ద్వారా మాట్లాడించి, లబ్ధిదారులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర సమయంలో కూలిపోయిన ఇళ్లను చూసి చలించిపోయి అధికారంలోకి రాగానే ఇళ్లను నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశం చేయించడం ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న మరికొన్ని ఇందిరమ్మ ఇళ్లను కూడా త్వరలో పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, గ్రామ సర్పంచ్ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.






## పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

**కోదాడ మార్చి 7(వుదయం)**
ఏకాగ్రత, సమయపాలనతో పాటు సరైన ప్రణాళికతో పదో తరగతి పరీక్షలకు సిద్ధమైతే మంచి ఫలితాలు సాధించవచ్చని రిటైర్డ్ ఎంఈఓ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ముత్తవరపు రామారావు తెలిపారు. పిఎం శ్రీ జడ్పీ హెచ్ఎస్ కాపుగల్లులో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.విద్యార్థులు భవిష్యత్తులో విజయాలు సాధించాలంటే స్ఫూర్తినిచ్చే మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని చదవాలని సూచించారు. ఓటమిని గెలుపుకు పునాదిగా భావించి నిరాశ చెందకుండా మంచి ర్యాంకులు సాధించాలని పిలుపునిచ్చారు.పదో తరగతి పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.5000 నగదు బహుమతి అందజేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుకుల రామారావు అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై ఉదాసీనంగా ఉండొద్దు





**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**
**పిహెచ్‌సి అపరిశుభ్రతపై కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆగ్రహం**
**పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశం**

**నాగర్ కర్నూల్ మార్చి 07 (వుదయం ప్రతినిధి)**
శనివారం తెల్కపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న అపరిశుభ్రతను గమనించిన జిల్లా కలెక్టర్ వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమంలో తొలి థీమ్‌గా చేపట్టాల్సిన పరిశుభ్రత కార్యక్రమాలు ఎందుకు నిర్వహించలేదని వైద్యులను జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. ఒక రోజు ముందుగానే పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించినప్పటికీ అమలు చేయక పోవడంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళికపై అధికారులు ఉదాసీనంగా ఉండొద్దని, 99 రోజుల తర్వాత పనిచేసిన వారికి ప్రశంసలు ఉంటాయని, పనిచేయని వారికి చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను సందర్శించి వాటి పనితీరుపై సంబంధిత వైద్య, ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను ఖచ్చితంగా పాటించాలని సిబ్బందికి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, వైద్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందాలి...**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించడంతో పాటు పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. శనివారం తెల్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కిచెన్‌ను సందర్శించి కూరగాయలు తాజాగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. అలాగే వంట సరుకుల నాణ్యతను తనిఖీ చేసి, మెనూ ప్రకారం విద్యార్థులకు గుడ్లు అందజేయాలని సూచించారు. పాఠశాలలో వంట మహిళలు కట్టెల పొయ్యిపై వంట చేయడం గమనించిన కలెక్టర్, త్వరలోనే సిలిండర్లు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఇకపై సిలిండర్లపైనే వంట చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే పాఠశాల ఆవరణలో పీఎం శ్రీ నిధుల ద్వారా నిర్మిస్తున్న సైన్స్ ల్యాబ్, అదనపు తరగతి గదులను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. భవన నిర్మాణ నాణ్యత, ప్రహరీ, ప్రవేశ మార్గాలు, గదుల రూపకల్పన, పచ్చదనం, మూత్రశాలలు, నైపుణ్యాభివృద్ధి కోసం ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఇదే సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న సోషల్ స్టడీ ప్రాక్టీస్ టెస్ట్ పరీక్షలను కూడా కలెక్టర్ పరిశీలించారు. రానున్న పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి విద్యార్థికి మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట డిపిఓ శ్రీరాములు , తెలకపల్లి సర్పంచ్ కొమ్ము చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు తదితరులు ఉన్నారు.

**ఈవీఎం గోదాము తనిఖీ...**
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతి నెల నిర్వహించే ఈవీఎం గోదాము తనిఖీల్లో భాగంగా శనివారం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నాగర్ కర్నూల్ పట్టణ కేంద్రంలోని ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎంల భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, సాంకేతిక అంశాలను సమగ్రంగా పరిశీలించారు. గోదాము వద్ద ఎలాంటి లోపాలు తలెత్తకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండాలని, నిత్యం అప్రమత్తంగా పర్యవేక్షించాలని సంబంధిత భద్రత సిబ్బందికి కలెక్టర్ సూచించారు. పర్యవేక్షణ నివేదికల రిజిస్టర్ లో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీల్లో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రవికుమార్, డిటి కల్పన, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బాలకృష్ణ, ఎండి హుస్సేన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం జీవనశైలిలో మార్పులు అవసరం



**నల్లబెల్లిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' ప్రారంభం**
**ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
**నేటి నుంచి బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్**

**నల్లబెల్లి, మార్చి 7(వుదయం):**
ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉండాలంటే ప్రాథమికంగా తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. శనివారం నల్లబెల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన ప్రజా పాలన . ప్రగతి ప్రణాళిక' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ. అందుబాటులో ఉన్న పౌష్టిక ఆహార పదార్థాలను తీసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. మన పూర్వీకులు కష్టపడి పని చేస్తూ, కాలానుగుణంగా లభించే ఆహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండేవారని గుర్తుచేశారు. వారిని ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అనుసరించాలని కోరారు.డీఎంహెచ్‌వో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు మాట్లాడుతూ. ఈ ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజలకు నాలుగు దశల్లో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.మాతా శిశు, కిశోర, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, టీబీ, డెంగ్యూ, మలేరియా వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించి, నిపుణులైన వైద్యులతో చికిత్స అందిస్తామన్నారు. బాలికలకు రక్షణ కవచం. హెచ్‌పీవీ టీకామార్చి 8వ తేదీ నుంచి 1415 ఏళ్ల లోపు బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను పంపిణీ చేయనున్నట్లు డీఎంహెచ్‌వో ప్రకటించారు.నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి, వరంగల్ సీకేఎం, ఎంజీఎం, వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, తదనంతరం అన్ని పీహెచ్‌సీల్లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ బిడ్డలకు టీకాలు వేయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, ఆర్డీవో ఉమారాణి, స్థానిక సర్పంచ్ నాగెల్లి జ్యోతి, ఎంపీడీవో శ్రీనివాస్, తహసిల్దార్ కృష్ణ, వైద్యాధికారులు డాక్టర్ కిషన్, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆచార్య, ప్రజా ప్రతినిధులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు



**జయశంకర్ భూపాలపల్లి మార్చి 07 (వుదయం జిల్లా ప్రతినిధి):**
మహాదేవపూర్ ఉమ్మడి మండల మైనారిటీ అభివృద్ధి కోసం రూ. 1 కోటి 45 లక్షల నిధులను మంజూరు చేసిన ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు మహాదేవపూర్ గ్రామ మైనారిటీ నాయకులు భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ సలావోద్దీన్, జిల్లా కార్యదర్శి గయాజ్ ఖాన్, కృతజ్ఞతలు తెలిపారు శనివారం వారు వుదయం ప్రతినిధితో మాట్లాడుతూ మహాదేవపూర్ ఉమ్మడి మండల ముస్లిం మైనారిటీ ప్రజల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు, కాళేశ్వరం, అన్నారం, పంకెన, గ్రామాలతోపాటు మహాదేవపూర్ మండల కేంద్రంలోని జామా మస్జీద్, మదీనా మస్జీద్, కలిమ మస్జీద్,ల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఖబ్రస్తాన్ వద్ద సీసీ రోడ్డు మరియు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి తోపాటు పలు నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని ఈ అభివృద్ధి కార్యక్రమాలు మైనారిటీ సమాజానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు ప్రజల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కష్టాల కడలి దాటి అనుకున్న గమ్యం చేరిన వసంతి

- మహిళా దినోత్సవం ప్రత్యేకం

**నర్సంపేట మార్చ్ 7 వుదయం ప్రతినిధి.**
నర్సంపేటకు చెందిన జాటోత్ వసంతి కృషికి ఫలితం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా ఎంపిక. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన జాటోత్ వసంతి తన కృషి, పట్టుదలతో ప్రభుత్వంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పదవికి ఎంపికై అందరికీ ప్రేరణగా నిలిచింది. చిన్న వయసులోనే జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న వసంతి, నాలుగో తరగతి చదువుతున్న సమయంలోనే తన తండ్రిని కోల్పోయింది. కుటుంబానికి ఎలాంటి ఆస్తులు లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు, ఇద్దరు కుమార్తెలతో మాత్రమే ఉన్న కుటుంబ పరిస్థితులు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటూ ఆమె తన చదువును కొనసాగించింది.పేదరికం అనేక అడ్డంకులు ఉన్నప్పటికీ వసంతి తన లక్ష్యాన్ని వదలకుండా కష్టపడి చదువుకుంది. నిరంతర శ్రమ, పట్టుదలతో ముందుకు సాగిన ఆమె ఇటీవల ప్రభుత్వంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్గా ఎంపిక కావడం ఒక గొప్ప విజయంగా నిలిచింది. ఆమె సాధించిన ఈ విజయం కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా సమాజంలోని ఎన్నో యువతులకు ప్రేరణగా నిలుస్తోంది. సంకల్పం, కృషి, ధైర్యం ఉంటే ఎలాంటి పరిస్థితులనైనా జయించి విజయాన్ని సాధించవచ్చని వసంతి విజయగాథ తెలియజేస్తోంది. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె సాధించిన ఈ విజయం మహిళా సాధికారతకు ప్రతీకగా నిలుస్తోంది.



# నల్లగొండను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలబెట్టాలి

**అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందించాలి**
**గ్రామాలలోని సమస్యలు పరిష్కరించేందుకు కృషి**
**మంత్రులు అడ్లూరు లక్ష్మణ్ కుమార్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి**





**నల్లగొండ, మార్చి 07 (వుదయం ప్రతినిధి) :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలులో నల్లగొండ జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలబెట్టాలని నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవన్‌లో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'పై నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, గ్రామాలలో ఉన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందించాల్సిన అవసరం ఉందని అన్నారు.

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుమీద ముఖ్యమైన 10 అంశాల వారిగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని, పరిసరాల పరిశుభ్రత, పెండింగ్ ఫైల్ పరిష్కారంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా పెండింగ్ ఫైల్లను సైతం పరిష్కరించాలన్నారు. రైతులకు సంబంధించిన అంశాలు, సంక్షేమ కార్యక్రమాలు, మహిళలు, చిన్నపిల్లల భద్రత, రోడ్డు ప్రమాదాలు తదిత అంశాలపై ప్రజలకు స్పష్టంగా అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతినిత్యం జరిగే రోడ్డు ప్రమాదాలలో అనేక మంది చనిపోతున్నారని, అలా జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా అవగాహన కల్పించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కు సంబంధించి పెండింగ్లో ఉన్న బిల్లులన్నిటిని సోమవారం లోపు రాష్ట్ర ప్రభుత్వం క్లియర్ చేయనుందని మంత్రి వెల్లడించారు. ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయంలో భాగంగా సోలార్ విద్యుత్ వినియోగించుకోవాలని, ప్రతిక్ ఫౌండేషన్ ద్వారా అయిటిపాముల గ్రామంలో 50 మంది స్వయం సహాయక మహిళా సంఘ లబ్ధిదారులకు రూ.50 లక్షలను ఇచ్చి వారికి స్వయం ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు . 2028 జూన్ నాటికి ఎస్ఎల్ బీసీ ద్వారా సాగునీటి అందిస్తామని, డిండి ఎత్తిపోతల పథకం ద్వారా మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగునీరు అందించే ప్రధాన కాలువల ఎత్తు 436 స్థాయి ఉండేలా చర్యలు తీసుకుంటామని, మూసిని ప్రక్షాళన చేసి తీరుతామని, జిల్లా కలెక్టర్లు నెలలో 15 రోజులు క్షేత్ర స్థాయిలో ఉండాలని, నిరంతరం తనిఖీలు, పర్యవేక్షణ చేస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందేలా చూడాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో గ్రామాలలో పారిశుధ్యం, తాగునీరు, ఇతర కార్యక్రమాలను సవ్యంగా అమలు చేసేలా చూడాలని, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలను సందర్శించాలని చెప్పారు. ఇప్పటివరకు గ్రామాలు, మున్సిపాలిటీలలో ప్రజాప్రతినిధులు లేని కారణంగా అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి కృషి చేయాలని, మహిళలు, పిల్లలు, బాలికల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. తమ ప్రభుత్వం ప్రజల కోసం అంకితమై పనిచేస్తుందని, ఎల్లప్పుడూ తాము ప్రజలకు అందుబాటులో ఉంటామని, ఏ సమస్య వచ్చినా గ్రామసభల ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని, తాము ప్రజలకు అండగా నిలుస్తామని మంత్రి వెల్లడించారు.జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్ని ప్రజలకు చేరాల్సిన అవసరం ఉందని, అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో పథకాలను పేద ప్రజలకు అందేలా చూడాలని, ప్రభుత్వ ఆదేశాలను ఎవరు ఉల్లంఘించవద్దని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలుపట్ల నిర్లక్ష్యం వహించవద్దని, ప్రభుత్వం పేద ప్రజల కోసం రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్తు, రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, ఇవన్నీ కూడా ప్రజల వద్దకు నేరుగా వెళ్లేలా కార్యక్రమాలు రూపొందించడం జరిగిందని తెలిపారు. ఆయా షెడ్యూల్ తేదీల వారీగా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, అధికారులు అందరూ బాధ్యతతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక వాట్సాప్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని, అలాగే జిల్లా కలెక్టర్లు సైతం కార్యక్రమాన్ని ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలని, ఏ రోజు చేసిన కార్యక్రమాలు ఆ రోజు నివేదిక రూపంలో రూపొందించాలని చెప్పారు.రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలులో భాగంగా మొదటి అంశమైన పరిశుభ్రత లో భాగంగా గ్రామ పంచాయతీలకు గతంలో ఇచ్చిన ట్రాక్టర్లన్నీ సద్వినియోగం అయ్యేలా వినియోగంలోకి తీసుకురావాలని, రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య రాకుండా జిల్లా కలెక్టర్లు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ,పాఠశాలల్లో విద్యార్థులు ,టీచర్ల సంఖ్య క్రమబద్ధీకరించాలనిజ్ రైతులకు యూరియా సమస్య లేకుండా సక్రమంగా యూరియా అందేలా చూడాలని, సోలార్ విద్యుత్ పై ప్రజలు, రైతులను చైతన్యం చేయాలని, వేసవిలో విద్యుత్ కొరత రాకుండా సోలార్ విద్యుత్ ఉపయోగపడుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సరైన ఫలితాలను రావడంతో పాటు, ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తుందని తెలిపారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు,అధికారుల సమన్వయంతోనే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతమవుతుందని, ప్రతి గ్రామంలో ప్రభుత్వం అమలు చేయనున్న పది అంశాలు ప్రజల వద్దకు తీసుకువెళ్లేలా చూడాలని, ప్రభుత్వ పథకాలన్నీ పేదలకు అందేలా చూడాలని, గ్రామాలలో లో వోల్టేజ్ సమస్య ,తాగునీటి సమస్య రాకుండా చూడాలని, ఇందిరమ్మ ఇళ్లలో ఎల్ వన్, ఎల్ టు, సమస్యలను పరిష్కరించాలని, మిషన్ భగీరథ కింద అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని తాగునీటి సమస్య లేకుండా చూడాలని, ఎమ్మెల్సీ నెల్లికంట సత్యం, శంకర్ నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి నల్గొండ మేయర్ చైతన్య బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఆదేశించామని, ఇందులో భాగంగా 5 స్థాయిలలో కార్యక్రమాన్ని నిర్వహించామని, గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అంతేకాకుండా 10 ప్రధాన అంశాలపై కార్యక్రమాలను నిర్వహించామని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, నల్గొండ ఎస్పి శరత్చంద్ర పవార్ లు మాట్లాడారు. సమావేశానికి నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో అదనపు కలెక్టర్లు, అన్ని జిల్లాల అధికారులు, తదితరులు హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ సమావేశానికి హాజరైన వారందరి చేత ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై ప్రతిజ్ఞ చేయించారు.

# 'డబుల్' సమస్యలను పరిష్కరించాలి

**మంత్రి వివేక్‌కు లబ్ధిదారులు వినతి పత్రం అందజేత**



**రామకృష్ణాపూర్, మార్చి 07 (వుదయం ప్రతినిధి) :**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డులోని పాత పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ ఇండ్లకు సంబంధించిన లబ్ధిదారుడు దండు సదానందం, పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాండ్ల సమ్మయ్య సమక్షంలో కలసి చెన్నూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి నియోజవర్గ ఎమ్మెల్యే, కార్మిక గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతి పత్రం అందజేశారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు 200 మంది లబ్ధిదారులకు అందచేసి సుమారు 4 నెలలు గడుస్తున్నప్పటికీ లబ్ధిదారులకు వచ్చిన ఇండ్లలోకి వెళ్లాలంటే ముఖ్యంగా నిత్యం కాలాకృత్యాలు తీర్చుకునేందుకు మంచినీటి సదుపాయం, త్రాగడానికి మంచినీటి సౌకర్యం లేదని, వాటికి సంబంధించి 4 కమర్షియల్ మీటర్లు, అంతర్గత సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. మంజూరైన ఇండ్లలో ఎవరు లేక పోవడంతో అల్లరి మూకలు అ ఇండ్లకు ఉన్న అద్దాలను పగల కొడుతున్నారని, మందు బాబులకు అడ్డాగా మారిందని, స్థానిక పోలీసులు రాత్రిపూట నిఘా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు. వీలైనంత తొందరగా పైన ఉన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వివేక్ వీలైనంత తొందరగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని క్యాతనపల్లి మున్సిపల్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో లబ్ధిదారుడు దండు సదానందం, కాంగ్రెస్ నాయకులు రహమాత్ పాషా, తుంగపిండి ప్రసాద్, బంగారి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు

- **కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మార్చి 7, (వుదయం ప్రతినిధి) :**

ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, హాజరు పట్టికలు, వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన తాగునీటిని అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం మరలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. ప్రతి పాఠశాలలో తాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, అదనపు గదులు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన అందిస్తామన్నారు. అనంతరం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మార్చురి గది నిర్మాణ పనులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రి లోని రోగులతో మాట్లాడుతూ కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**
**వైద్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం**
**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సమర్థవంతంగా అమలు చేయాలి**



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 07 (వుదయం ప్రతినిధి) :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మతో కలిసి వైద్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు మొత్తం 99 రోజుల పాటు చేపట్టనున్న కార్యాచరణపై జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోజువారీ వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా 99 డేస్ యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మొత్తం కార్యక్రమాన్ని నాలుగు దశల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు.మొదటి దశలో మార్చి 6 నుంచి 31వ తేదీ వరకు 26 రోజుల పాటు మాతాశిశు సంరక్షణ, కౌమార దశ బాలికలు, వృద్ధుల ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న సుమారు లక్షా 80 వేల స్వయం సహాయక సంఘాల మహిళలకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సీపీఆర్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారో, ఎన్ని చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారో సంబంధిత నివేదికలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.హాస్పిటళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ప్రభుత్వ ఆస్తుల ధృవీకరణ వంటి పరిపాలనా అంశాలను కూడా సమాంతరంగా పరిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టడంతో పాటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వయం సహాయక సంఘాల మహిళల కోసం హెల్త్ ప్రొఫైల్ తయారీ కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో తెలంగాణ డయాగ్నస్టిక్స్ సహకారంతో ఒక్కో మహిళకు మొత్తం 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ దశలో అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు సబ్‌సెంటర్ల పరిధిలో విస్తృత స్థాయిలో స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా డే కేర్ క్యాన్సర్ సెంటర్లలో కీమోథెరపీ సేవల మ్యాపింగ్ చేపట్టాలని సూచించారు. అదేవిధంగా డయాలసిస్ చికిత్స పొందుతున్న రోగులకు వైరల్ ఇన్ఫెక్షన్ పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు అంటువ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా అమలవుతున్న టీబీ ముక్త్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు జిల్లాలో టీబీ కేసులను గుర్తించడంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. టీబీ పరీక్షల నిర్ధారణకు అవసరమైన కిట్ల వివరాలను నివేదికలో అందించాలని ఆదేశించారు. ఎండలు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో వడదెబ్బ నివారణకు అవసరమైన అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగినంతగా నిల్వ ఉంచాలని సూచించారు. డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. మే 16 నుంచి జూన్ 12 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ దశలో పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మరింత విస్తరించనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ మెడికల్ వాహనాల ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించి పేద ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ మేళాలు నిర్వహించి కల్తీ ఆహార పదార్థాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని తెలిపారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, హోటళ్లు, ఐస్‌క్రీమ్ దుకాణాలు వంటి ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కలుషిత ఆహారంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.విధి నిర్వహణలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వైద్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులను ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించాలని సూచించారు. జిల్లాలో శిశు మరణాల రేటు శూన్యానికి చేరుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న సామ్, మ్యామ్ పిల్లలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి మహిళా శిశు సంక్షేమ శాఖతో సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వైద్యశాఖ పనితీరుపై అన్ని పారామీటర్లలో ప్రతినెల సమగ్ర నివేదికను అందించాలని డీఎంహెచ్ఓను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది కొరతపై అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, డిసిహెచ్ ఓ రవిబాబు, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 'ఇందిరమ్మ'పేరుతో ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- **కలెక్టర్ స్నేహ శబరీష్**

**మహబూబాబాద్, మార్చి 7 (వుదయం ప్రతినిధి) :**

ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్నేహ శబరీష్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్, పంచాయతీ రాజ్ శాఖలతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇసుక అక్రమ రవాణా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఇసుక సరఫరా తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అన్ని శాఖలు సమన్వయంతో అరికట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇసుక సరఫరా చేయాలని తెలిపారు. ఇసుక రవాణాలో నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ అనిల్ కుమార్, మైనింగ్ అధికారి వెంకటరమణ, తాసిల్దారులు, ఎంపీడీవోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాబు బడికి వెళ్తున్నావా?

**కలెక్టర్ హరిత**
**ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచన**



**ఆసిఫాబాద్, మార్చి 7 (వుదయం ప్రతినిధి) :**

కోమురం బీం అసిఫాబాద్ జిల్లా దాహేగాం మండల పర్యటనలో భాగంగా మార్గమధ్యంలో ఐనం గ్రామం వద్ద ఓ బాలుడు రోడ్డుపై కనిపించడంతో తన వాహనాన్ని ఆపి అతనిని ఆప్యాయంగా పలకరించారు. "బాబు బడికి వెళ్తున్నావా?" అని కలెక్టర్ ప్రశ్నించగా, ఆ బాలుడు బడికి వెళ్లడం లేదని తెలిపాడు.ఎందుకు ఈరోజు బడికి వెళ్లలేదు?" అని కలెక్టర్ అడగగా, తన చర్మ సమస్య కారణంగా పాఠశాలకు వెళ్లలేదని బాలుడు పేర్కొన్నాడు. దీనిపై స్పందించిన కలెక్టర్ విద్యార్థి ఆరోగ్యం గురించి తెలుసుకొని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ చదువుపై దృష్టి పెట్టాలని, విద్యతోనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. కలెక్టర్ చూపిన ఆప్యాయతతో బాలుడు ఆనందం వ్యక్తం చేశాడు.

# తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

**సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**
**నియోజకవర్గ అదనపు కలెక్టర్‌కు సమస్యలపై వినతి**



**సంగారెడ్డి, మార్చి 7 (వుదయం ప్రతినిధి) :**

గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు కొత్త బోర్లు మంజూరు చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పాండును ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగవంతంగా అమలు చేయడంతో పాటు ఎమ్మెల్యే కోటాకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కంది మండలం చిమ్నాపూర్ గ్రామంలో పాఠశాల భవన నిర్మాణానికి తగిన స్థలం కేటాయించాలని, భవన నిర్మాణానికి దాతలు సిద్ధంగా ఉన్నందున పనులను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా 2026-2027 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతిపాదించిన పనులకు సంగారెడ్డి నియోజకవర్గంలోని కంది, కొండాపూర్, సదాశివపేట, సంగారెడ్డి మండలాలకు రూ.2.86 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థించారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, విఠల్, బిఆర్ఎస్ నాయకులు జీవీ శ్రీనివాస్, పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు అనుగుణంగా ఇసుక రవాణా చేయాలి

- **ఇసుక అక్రమ రవాణా నిరోధానికి ఏర్పాటు**
- **టిజిఎండిసి మేనేజింగ్ డైరెక్టర్ భవేష్ మిశ్రా**
- **సాలూర వద్ద చెక్ పోస్ట్ ప్రారంభం**





**నిజామాబాద్, మార్చి 07 (వుదయం ప్రతినిధి) :**

పొరుగు రాష్ట్రాల నుంచి ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అడ్డుకునేందుకు వీలుగా తెలంగాణ రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ పకడ్బందీ చర్యలు చేపట్టింది. నిజామాబాద్ జిల్లా సరిహద్దులోని సాలూర వద్ద టిజిఎండిసి ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భవేష్ మిశ్రా చెక్ పోస్ట్‌ను శనివారం లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ చెక్ పోస్ట్ వద్ద వేయింగ్ మెషిన్‌తో ఇసుక వాహనాల తనిఖీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. తద్వారా అక్రమ ఇసుక రవాణాతో పాటు, ఓవర్ లోడింగ్ ను సైతం నిరోధించేందుకు ఆస్కారం కలిగిందని ఎండీ భవేష్ మిశ్రా ఈ సందర్భంగా వెల్లడించారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుని మహారాష్ట్ర నుంచి నిర్ణీత పరిమాణంలో నిబంధనలకు అనుగుణంగా ఇసుకను తరలించవచ్చని, అయితే సాలూర చెక్ పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు. ఇదివరకు చెక్ పోస్ట్ లేకపోవడం వల్ల ఇసుక రవాణా విషయంలో పలు అక్రమాలు జరిగేవని, ఈసారి అలాంటి వాటికి ఆస్కారం లేకుండా రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సాలూర వద్ద జిల్లా యంత్రాంగం సహకారంతో ప్రత్యేకంగా చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. దీనివల్ల అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడంతో పాటు తెలంగాణ ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుందని తెలిపారు. అంతేకాకుండా ఓవర్ లోడ్ సమస్యను నిరోధించడం ద్వారా రోడ్లు చెడిపోకుండా, రోడ్డు ప్రమాద సంఘటనలు జరుగకుండా నిలువరించవచ్చన్నారు. అదేవిధంగా నిజామాబాద్‌కు సమీపంలోనే మహారాష్ట్ర ఇసుక క్వారీలు ఉన్నందున ఇసుక అవసరమైన వారికి తక్కువ ధరకే ఇసుక లభ్యం అయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. మంజీరాలో ఇసుక తవ్వకాలకు సంబంధించి సరిహద్దు సమస్య తలెత్తకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పకడ్బందీ చర్యలు తీసుకున్నామని తెలిపారు. తెలంగాణ భూభాగాన్ని గుర్తిస్తూ స్పష్టంగా సరిహద్దులు ఏర్పాటు చేశామని అన్నారు. ఇసుక అక్రమ రవాణా విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని, ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ సిఎం రేవంత్‌రెడ్డి ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. చెక్ పోస్ట్ నిర్వహణ సజావుగా జరగాలని, గట్టి నిఘాను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మైనింగ్ ఏ.డీ సంజయ్, ల్యాండ్ అండ్ సర్వే ఎడి అశోక్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



**జన్నారం,మార్చి 7 (వుదయం విలేఖరి)**

జన్నారం మండలంలోని రెండ్లగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణం కొరకు బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ ముప్పై వేల మూడు వందల రూపాయలను విరాళంగా అందజేశారు.ఆలయ నిర్మాణానికి సహాయంగా విరాళాన్ని అందించి భక్తులకు ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంధవేని పవన్, బెదద గోపాల్, సంతోష్, లక్ష్మణ్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకే అంకితమైన కాకర్లకు
## ఉత్తమ అవార్డు అందజేసిన కేటీఆర్



- **నిరుపేదల పెన్నిధిగా పేరు తెచ్చుకున్న కాకర్ల నారాయణమ్మ**

**నారాయణపేట టౌన్ మార్చి 7(వుదయం ప్రతినిధి)**

మాజీ మంత్రి కే.తారక రామ ప్రజాసేవకే అంకితమైన నారాయణమ్మకు ఉత్తమ మహిళా అవార్డు అందజేశారు. పాడి పరిశ్రమతో స్వయం ఉపాధి పొందుతూ ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఎన్నో సేవలు చేస్తూ ముందుకు సాగుతున్న నారాయణపేట సింగర్ బేస్ మూడవ వార్డు కు చెందిన కౌన్సిలర్ నారాయణమ్మకు హైదరాబాదులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో కాకర్ల నారాయణమ్మకు ఉత్తమ రైతు అవార్డును కేటీఆర్ చేతుల మీదుగా అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఆమెకు ఉత్తమ రైతు అవార్డు కూడా ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. ఉత్తమ రైతుగా ఉంటూ తన వార్డులోని పేద ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరి ఆధార అభిమానాలను పొందుతూ మున్సిపల్ ఎన్నికల్లో మూడో వార్డు నుండి టిఆర్ఎస్ పార్టీ నుండి నామినేషన్ వేసి ఘనవిజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శభాష్ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ అంటూ కితాబ్ ఇచ్చారు. 2016 జూన్ నెలలో తమ పురస్కార అవార్డును కాకర్ల నారాయణమ్మ అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా అందుకున్నారని ఆయన గుర్తు చేశారు. 2008 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉత్తమ మహిళా అవార్డు డాక్టర్ చిన్నారెడ్డి చేతుల మీదుగా కాకర్ల నారాయణమ్మ అవార్డు అందుకున్నారు.పేదలకు ఆసరాగా కొడుకు పేరు పైన ఒక ట్రస్టు పెట్టి ఆ ట్రస్టు నుండి నిరుపేద మహిళలకు తాళిబొట్లను మెట్టలను అందించి ఆమె ఔన్నత్యాన్ని గుర్తుచేశారు. ఈ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు కూడా బాటలు వేస్తూ క్రీడాకారులకు క్రీడా పోటీలు నిర్వహించి తన కొడుకు నాతోనే ఉన్నాడంటూ గెలుపొందిన వారికి బహుమతులను అందించి ఆమె తృప్తి పొందిందని ఆయన గుర్తు చేశారు. ఈ మహిళా దినోత్సవం సందర్భంగా కాకర్ల నారాయణమ్మకు ఉత్తమ మహిళగా అవార్డు ఇవ్వడం తమకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ నారాయణమ్మ సేవలను గుర్తిస్తూ రానున్న కాలంలో ఇలాంటి సేవలు మరిన్ని చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబిత ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ ,సునీత లక్ష్మారెడ్డి లతోపాటు మహిళలు పాల్గొన్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు




- **జోగులాంబ దేవస్థానాన్ని సందర్శించిన**
- **రాష్ట్ర గవర్నర్ సతీమణి సుధా దేవ్ వర్మ**

**అలంపూర్ మార్చి 07 (వుదయం ప్రతినిధి)**

శనివారం అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠంగా ప్రసిద్ధి చెందిన అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సతీమణి సుధా దేవ్ వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి, శ్రీ జోగులాంబ అమ్మవారి ఆలయాలలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా దేవాలయ వేద పండితులు సంప్రదాయ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. విఘ్నేశ్వర పూజను కూడా నిర్వహించారు. తదనంతరం శ్రీ జోగులాంబ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకొని అమ్మవారికి విశిష్ట పూజలు సమర్పించారు. అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఆమెకు పట్టు వస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ న ర్సిం గ రా వు , ఆ ర్డీ వో శ్రీనివాసరావు,దేవస్థానం ఈవో దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువులతో
## పాటు ఆటపాటల్లోనూ ముందుండాలి



**ఎమ్మెల్యే జారె**

**దమ్మపేట మార్చి 7 (వుదయం ప్రతినిధి ):**

దమ్మపేట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కల్చరల్ స్పోర్ట్స్ యాన్యువల్ డే వేడుకల్లో గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు క్రీడల్లో మంచి ప్రతిభ కనబరచిన వారిని అభినందించారు విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారుఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవి, ఉప సర్పంచ్

ఆంగోతు శ్రీనివాసరావు , సీనియర్ నాయకులు కె క్కిరాల రమేష్ , టౌన్ అధ్యక్షులు చిన్నశెట్టి చిట్టిబాబు , కేవీ సత్యనారాయణ , పగడాల రాంబాబు , కాంగ్రెస్ నాయకులు

తదితరులు పాల్గొన్నారు

# నీతి ఆయోగ్ సెమినార్‌కు గద్వాల ఎంపిక
# జిల్లాకు అరుదైన గౌరవం

**నీతి ఆయోగ్ సెమినార్ కు గద్వాల జిల్లా ఎంపిక కావడం గర్వకారణం**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**గద్వాల మా ర్చి 07 (వుదయం ప్రతినిధి)**



నీతి ఆయోగ్ నిర్వహించనున్న ప్రాంతీయ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్‌కు జోగులాంబ గద్వాల జిల్లా గట్టు బ్లాక్ ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. నీతి అయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్స్ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా ఎంపికైన వివిధ జిల్లాల్లో నిర్దేశిత అంశాల్లో అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులను గుర్తించి ఇతర ప్రాంతాల ప్రతినిధులతో వాటిని పంచుకునేందుకు ఈనెల తొమ్మిదిన విశాఖపట్నంలో నీతి ఆయోగ్ ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం-3 పరిధిలో మొత్తం ఆరు రాష్ట్రాలు పాల్గొంటున్నాయని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి జోగులాంబ గద్వాల మరియు

నిర్మల్ జిల్లాలు మాత్రమే ఎంపిక కావడం విశేషమన్నారు. ఇతర జిల్లాల నుంచి అనేక ప్రతిపాదనలు వచ్చినప్పటికీ గట్టు బ్లాక్‌లో విద్యా రంగంలో అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి సెమినార్లో తెలియజేసేందుకు గట్టు బ్లాక్ ఎంపిక కావడం జిల్లాకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో జరిగే ఈ సెమినార్ లో గట్టు బ్లాక్ లో విద్యారంగం సాధించిన ప్రగతిపై ఇతర రాష్ట్రాలతో పంచుకునేందుకు అవకాశం కలిగిందని తెలిపారు. ఈ సెమినార్‌లో జోగులాంబ గద్వాల్ జిల్లా తరపున జిల్లా కలెక్టర్ గా తాను పాల్గొని గట్టు బ్లాక్‌లో విద్యా రంగంలో అమలు చేస్తున్న కార్యక్రమంపై ప్రెజెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో వెనుకబడిన గట్టు మండలంలో గతంలో విద్యా రంగంలో తక్కువ అక్షరాస్యత, సీడ్ పత్తి క్రాసింగ్ సమయంలో విద్యార్థుల సీజనల్ డ్రాప్‌అవుట్స్, పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత, తక్కువ ఫలితాలు వంటి సమస్యలు ప్రధానంగా ఉండేవని తెలిపారు. ఈ పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి వ్యూహాత్మక చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు.గట్టు బ్లాక్ లో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి గత రెండు సంవత్సరాల్లో విద్యా వాలంటీర్ల నియామకం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, మాదిరి పరీక్షల నిర్వహణ, తదితర కార్యక్రమాలను అమలు చేసినట్లు తెలిపారు. పత్తికోత సమయంలో పిల్లలు పనికి వెళ్లకుండా గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో బాల కార్మిక వ్యవస్థ నిరోధక చర్యలు చేపటినట్లు వివరించారు. 9వ-12వ తరగతి విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్, ప్రేరణాత్మక కార్యక్రమాలు, డ్రాప్‌అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలలకు తీసుకురావడానికి గ్రామ, మండల స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కలిపించినట్లు తెలిపారు. భవిష్య భారత్, టీచ్ ఫర్ చేంజ్, ఎంవీ ఫౌండేషన్, తదితర స్వచ్ఛంద సేవ సంస్థల సహకారంతో ఉదయం పోషకాహార కార్యక్రమాలు అమలు చేయడం వలన విద్యార్థుల హాజరు శాతం పెరిగింది అన్నారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచడమే కాక క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో వారిని పాలుపంచుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. దాంతో పదవ తరగతి ఫలితాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. ఈ విజయానికి కారణం విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధుల సమిష్టి కృషి పేర్కొన్నారు.

భవిష్యత్తులో కూడా విద్యా రంగంలో, నిర్దేశిత ఇతర అంశాల్లోనూ మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చేందుకు జిల్లా అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సేవా సంస్థలు కలిసికట్టుగా పనిచేస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను
## ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- **కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**
- **ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక - ఉచిత వైద్య శిబిరాలు ప్రారంభం**
- **సుజాతనగర్ పీహెచ్‌సీలో వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్**
- **ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకే ఉచిత వైద్య శిబిరాలు**
- **కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 07 (వుదయం ప్రతినిధి):**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్ వైద్యులు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకుని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాలను ప్రజలు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆశ వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు ఈ వైద్య శిబిరాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించి ఎక్కువ మంది ప్రజలు శిబిరాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా రక్తపరీక్షలు, కీళ్ల సమస్యలకు సంబంధించిన పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు వంటి ఆరోగ్య పరీక్షలను ప్రజలు చేయించుకొని తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. అవసరమైతే రోగులను కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసి అక్కడ అందుబాటులో ఉన్న అన్ని ప్రధాన పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో స్కానింగ్, ఎక్స్‌రే వంటి పరీక్షలు అందుబాటులో ఉన్నందున అవసరమైన వారికి అక్కడ పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ఉచిత వైద్య శిబిరాలను దశల వారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం సుజాతనగర్, జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ప్రతిరోజు రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చొప్పున ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు తెలిపారు.ఈ వైద్య శిబిరాలలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, డెంటల్, ఆప్తమాలజీ వంటి ఆరు విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. శిబిరాలకు వచ్చే రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేయడంతో పాటు అవసరమైతే మెరుగైన చికిత్స కోసం పై స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ఉచిత వైద్య శిబిరాలపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించి ఎక్కువ మంది ప్రజలు ఈ సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, తాసిల్దార్ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ రమేష్, ఎంపీడీవో భారతి తదితరులు పాల్గొన్నారు.

## మై హోమ్ సిమెంట్స్ లో
## ముగిసిన 55వ భద్రత వారోత్సవాలు

**మేళ్లచెరువు /హుజూర్నగర్**

**మార్చి 7 (వుదయం ప్రతినిధి):ప్రెస్ నోట్**




స్థానిక మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, మేళ్లచెరువులో జరిగిన 55వ జాతీయ భద్రత వారోత్సవ ముగింపు సభకు ముఖ్యఅతిథిగా శ్రీమతి K.V. శ్రీదేవి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఉమ్మడి నల్గొండ జిల్లా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు .ఈ కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ ఎన్. శ్రీనివాసరావు, జి.ఎం (పి&ఏ) డి. శ్రీరామ్, వి. సూర్యనారాయణ, వేణు నాయుడు, మరియు అన్ని విభాగాల HOD's పాల్గొన్నారు.తర్వాత అందరి చేత భద్రతా ప్రతిజ్ఞ చేయించి, ఈ జాతీయ భద్రత వారోత్సవం పురస్కరించుకొని పరిశ్రమలోని పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందికి మరియు కాలనీలో నివసిస్తున్న మహిళా మణులకు, స్కూల్ పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు

. మరియు పరిశ్రమలో పనిచేస్తున్న వారు సేఫ్టీ స్క్రిప్టులు నిర్వహించారు ,ఈ పోటీల్లో గెలుపొందిన మరియు స్క్రిప్టు చేసిన వారికి వారి చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం జరిగింది.ఈ సందర్భంగా శ్రీమతి K.V శ్రీదేవి మాట్లాడుతూ, ఈ సంవత్సరం సేఫ్టీ థీమ్ "భద్రతను మెరుగుపరచడానికి, అందరినీ భాగస్వామ్యం చేయండి, అవగాహన కల్పించండి & సాధికారత చేయండి" అని చెప్పారు

.యూనిటీ అండ్ శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలు పాటిస్తూ భద్రతను పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం వహించాలని కోరారు.

## పచ్చదనం-పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కావాలి

**కోదాడ మార్చి 7 (వుదయం)**

కోదాడ: పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, వెంకటరత్నం బాబు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం రాజీవ్ చౌక్ వద్ద కమిషనర్ రమాదేవి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లతో కలిసి ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి ప్రతిజ్ఞ చేశారు.మార్చి 6 నుంచి 15 వరకు పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.




## శ్రీ కృష్ణవేణి హైస్కూల్ లో
## 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం

**ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ ఐ శ్రీనివాసరావు**

**అలంపూర్ మార్చి 07 (వుదయం ప్రతినిధి)**



అలంపూర్ నియోజక వర్గం అయిజ పట్టణంలోని శ్రీ కృష్ణవేణి హై స్కూల్ నందు శనివారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ ఐ శ్రీనివాసరావు హాజరైనారు. మొదట పాఠశాల హెడ్మాస్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాపించి 15 సంవత్సరాలు అవుతుందని, మొదటి సంవత్సరం 230 మంది విద్యార్థులతో ప్రారంభమైనదని తెలిపారు. మండలంలోనే మా పాఠశాల మంచి ఫలితాలు సాధిస్తూ మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ప్రతి సంవత్సరం మంచి ఫలితాలు సాధిస్తూ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ర్యాంకులు సాధించి మండలంలోనే మంచి పేరు ప్రఖ్యాతులు సాధించామని తెలిపారు. ఇందులో విద్యార్థుల తల్లిదండ్రుల పాత్ర, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో వున్నదని తెలిపారు. ఈ సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థిని ఎ. ప్రతిభ మాట్లాడుతూ గత సంవత్సరం పద్మ సాధించిన (585/600) మార్కులను ఖచ్చితంగా అధిగమిస్తామని సభా ముఖంగా తెలిపారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్ ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠశాలను వీడి ఉన్నత చదువుల కోసం వెళ్లే సమయంలో వారికి వీడ్కోలు పలకడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమం అని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ కష్టపడి చదివితే జీవితంలో సుఖపడుతావని తెలిపారు. కావున ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దాని కొరకు నిర్విరామంగా కృషి, పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని అంత వరకు విశ్రమించకూడదని తెలిపారు. తరువాత ఉపాధ్యాయులు భవిష్యత్తు లో ఎలా ముందుకు సాగాలో మంచి సూచనలు ఇచ్చారు. 10వ తరగతి విద్యార్థులు పాఠశాలలో గడిపిన మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కొంత మంది విద్యార్థులు ప్రసంగాలు చేశారు. పాటలు, నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా 10వ తరగతి విద్యార్థులు తమ గురువులకు, పాఠశాలకు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యాశాఖలో ఖమ్మం జిల్లా
## రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**పాఠశాలలోని పాత సామాగ్రిని పూర్తి స్థాయిలో తొలగించాలి**

**10వ తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి**

**పరీక్షల గ్యాప్ లో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహణ**

**హై స్కూల్ హెడ్ మాస్టర్, ఎం.ఈ.ఓ. లతో విద్యా శాఖపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం, మార్చి 7(వుదయం ప్రతినిధి)**



విద్యాశాఖలో ఖమ్మం జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.

శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హైస్కూల్ హెడ్ మాస్టర్లు, ఎం.ఈ.ఓ. లతో విద్యాశాఖపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కలెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న తర్వాత అధికంగా ప్రాథమిక విద్యపై ఫోకస్ పెట్టడం జరిగిందన్నారు. విద్యాశాఖ పని తీరులో ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు. 99 రోజుల ప్రణాళిక కట్టుదిట్టంగా నిర్వహించడంతో పాటు, రాబోయే 10వ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు.99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పారిశుధ్య నిర్వహణ ప్రధాన అంశంగా చేపట్టామని, ప్రతి పాఠశాలలో పనికి రాకుండా ఉన్న పాత సామాగ్రి, కంప్యూటర్, రిజిస్టర్ లు డిస్పోజ్ చేయాలని కలెక్టర్ సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేకంగా 70 లక్షల రూపాయలు ప్రభుత్వ పాఠశాలలకు నిధులు అందిస్తున్నామని, ఆ నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేస్తూ పాఠశాలలో అవసరమైన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రతి పాఠశాలలో ఫైల్ నిర్వహణ చాలా క్లీన్ గా ఉండాలన్నారు. టాయిలెట్ లలో ఎటువంటి సమస్యలు ఉన్నా స్థానిక సంస్థల అధికారుల సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పాఠశాలకు ఉన్న సామాగ్రి, ఆస్తుల వివరాలు సంక్షిప్తంగా రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 13 వరకు జరిగే 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని అన్నారు. ప్రతి పరీక్ష మధ్య ఉన్న గ్యాప్ లో ఉపాధ్యాయులు విద్యార్థులకు తోడుగా ఉంటూ ఒత్తిడి తగ్గించాలని కలెక్టర్ తెలిపారు. 10వ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించడం వల్ల పిల్లల కెరీయర్ కు మంచి ఫౌండేషన్ ఉంటుందని అన్నారు.విద్యార్థులు వీక్ గా ఉన్న సబ్జెక్టుల్లో ముఖ్యమైన పాఠ్యాంశాలు అనేకసార్లు ప్రాక్టీస్ చేసే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, విద్యార్థి ఒత్తిడితో ఉంటే వచ్చింది కూడా రాయలేక పోతారని, ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు చూడాలని కలెక్టర్ అన్నారు. పరీక్ష రాసిన తర్వాత దాని గురించి అనవసరపు చర్చలు పెట్టకుండా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల సరిగ్గా నిర్వహించేందుకు స్టాఫ్ అటెండెన్స్ చాలా కీలకమని, 90 శాతం ఉపాధ్యాయుల హాజరు ఉన్న పాఠశాలలు మంచి ప్రోగ్రెస్ కనబరిచాయని అన్నారు. స్టాఫ్ రెగ్యులర్ గా వస్తే విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు ఆటోమేటిక్ గా పెరుగుతాయని అన్నారు. ఉపాధ్యాయులు లీవ్ తీసుకోకుండా పాఠశాల విధులకు గైర్హాజరు కావడానికి వీలు లేదని, ఎటువంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.99 రోజుల కార్యాచరణ ముగిసే నాటికి జిల్లాలో 100 శాతం విద్యార్థులకు ఆధార్, అపార్ నెంబర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను సంబంధిత హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు ఎవ్రీ చైల్డ్ రీడ్స్ ద్వారా ప్రాథమిక పాఠశాల మెరుగయ్యాయని, రాబోయే సంవత్సరంలో ఉన్నత తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యాశాఖ పరిధిలో ఖమ్మం జిల్లా రాష్ట్రానికి ఆదర్శవంతంగా నిలిచేలా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

ఈ సమావేశంలో డిఈఓ చైతన్య జైనీ, విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, సీఎంఓ ప్రవీణ్, మండల విద్యాశాఖ అధికారులు, హెడ్ మాస్టర్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

*చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం ఆధ్వర్యంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరం*




**భద్రాద్రి కొత్తగూడెం మార్చి 07(వుదయం ప్రతినిధి ):**

ప్రజలందరి ఆరోగ్య దృష్టిని కాపాడే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం అందరికీ ఓ వరం లాంటిది. అరుదైన ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకొని, మీ కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘ కమిటీ సభ్యులు కోరారు. హైదరాబాద్ లోని శంకర్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో మార్చి 8వ తేదిన ఆదివారం రోజు చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని రైతు బజార్ పోచమ్మ తల్లి గుడి వద్ద ఆదివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని కొత్తగూడెం పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా గతంలో విడతల వారీగా ఏర్పాటు శిబిరాల్లో వేలాది మంది కంటి పరీక్షలు చేసుకోగా ఇప్పటి వరకు 600 మందికి పైగా వ్యక్తులకు కంటి ఆపరేషన్ లు చేయించినట్టు వారు వివరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతు నిరుపేదలకు ఇలాంటి క్యాంపుల ద్వారా ఉచిత వైద్యం అందించడం తమ బాధ్యత అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవ సంఘం రేఖ రాజశేఖర్, గునిగంటి చందర్, నమ్మి జగదీష్, పెద్దిరెడ్డి సుంకు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
## బి.కాం విద్యార్థులకు ప్రత్యేక ఎక్స్టెన్షన్ లెక్చర్లు నియమకం

**చేవెళ్ల మార్చ్ 7 (వుదయం)**

చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వాణిజ్య విభాగంలో బి.కాం విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఎక్స్టెన్షన్ లెక్చర్ల శ్రేణిని నియమించారు. సాధారణ అధ్యాపకులు అందుబాటులో లేని సమయంలో విద్యార్థుల పాఠ్యబోధనలో అంతరాయం కలగకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ ఎక్స్టెన్షన్ లెక్చర్లను వాణిజ్య విభాగానికి చెందిన రాగిణి,మేడంను నియమించారు ఆమె బి.కాం మొదటి, రెండవ, మూడవ సంవత్సరం విద్యార్థులకు వ్యాపార న్యాయాలు (బిజినెస్ లా ), వ్యాపార గణాంకాలు (బిజినెస్ సాటిస్టిక్స్)గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జిఎస్టి) వంటి ముఖ్య అంశాలపై బోధించారు. ఫిబ్రవరి 25, 26, 28 తేదీలతో పాటు మార్చి 5, 6, 7 తేదీలలో ఈ తరగతులు బోధించారు.విషయాలను సులభంగా అర్థమయ్యే విధంగా వివరిస్తూ, ప్రాయోగిక ఉదాహరణలు మరియు పరస్పర చర్చల ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలను స్పష్టంగా వివరించారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకుని సంబంధిత అంశాలపై మెరుగైన అవగాహన పొందినట్లు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభివృద్ధికి అందించిన సేవలను గుర్తిస్తూ కళాశాల సిబ్బంది మరియు విద్యార్థుల సమక్షంలో శ్ర రాగిణి మేడంను సత్కరించారు. స్వర్ణలత మరియు శ్రీ జి. మహేందర్ గౌడ్ శాలువాతో ఆమెను ఘనంగా అభినందించారు.విద్యార్థుల విద్యా పురోగతికి ఆమె అందించిన సహకారం అభినందనీయమని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి. ఆమె చేసిన సేవలను అధ్యాపకులు, విద్యార్థులు ప్రశంసించారు.



# బాదం పప్పుల గురించి నిజాలు

బాదం పప్పులు అనగానే మనకు గుర్తొచ్చేది సూపర్ ఫుడ్. జ్ఞాపకశక్తి పెరగాలన్నా, చర్మం మెరవాలన్నా బాదం తినాలని పెద్దలు చెబుతుంటారు. కానీ అతి సర్వత్ర వర్జయేత్ అన్నట్లు.. ఆరోగ్యానికి మంచివి కదా అని వీటిని అపరిమితంగా తీసుకుంటే మాత్రం శరీరానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో కొన్ని అసాధారణ మార్పులు కనిపిస్తే బాదం కు సరిపడటం లేదని గుర్తించాలి. జీర్ణ సమస్యలు: బాదంలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియకు మేలు చేసినప్పటికీ అధికంగా తీసుకోవడం వల్ల రివర్స్ అవుతుంది. రోజుకు పరిమితికి మించి బాదం తింటే గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం లేదా విరేచనాలు వంటి సమస్యలు తలెత్తుతాయి. అందుకే వీటిని మితంగా తీసుకోవడం శ్రేయస్కరం. కిడ్నీల్లో రాళ్ల ప్రమాదం: బాదంపప్పులో ఆక్సలేట్ అనే సమ్మేళనం అధికంగా ఉంటుంది. శరీరంలో ఆక్సలేట్ పరిమాణం పెరిగితే, అది మూత్రపిండాల్లో పేరుకుపోయి రాళ్లుగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారు బాదానికి దూరంగా ఉండటం లేదా వైద్యుల సలహా తీసుకోవడం



ఉత్తమం.బరువు పెరిగే అవకాశం: బాదంలో ఆరోగ్యకరమైన కొవ్వులు, కేలరీలు ఎక్కువగా ఉంటాయి. వీటిని స్నాక్స్‌లాగా కుప్పలు కుప్పలుగా తింటే శరీరంలో కేలరీల శాతం పెరిగి, బరువు తగ్గడానికి బదులు పెరిగే అవకాశం ఉంటుంది. బరువును అదుపులో ఉంచుకోవాలనుకునే వారు రోజుకు 510 పప్పులకు మించి తినకూడదు. అలెర్జీల పట్ల అప్రమత్తత: కొంతమందికి నట్స్ అంటే అలెర్జీ ఉంటుంది. బాదం తిన్న తర్వాత చర్మంపై దద్దుర్లు, దురద, నోరు లేదా గొంతు వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అలెర్జీ ఉన్నవారు బాదం పప్పులకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. విటమిన్‌ఇ పోషకాల లోపం: బాదంలో విటమిన్‌ఇ సమృద్ధిగా ఉంటుంది. అయితే ఇది శరీరంలో ఎక్కువైతే రక్తం గడ్డకట్టే ప్రక్రియపై ప్రభావం చూపి, రక్తస్రావం అయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది. అలాగే బాదంలోని అధిక ఫైబర్ శరీరంలో కాల్షియం, ఇనుము, జింక్ వంటి ముఖ్యమైన ఖనిజాల శోషణను అడ్డుకుంటుంది. దీనివల్ల రు మంచి ఆహారం తీసుకున్నా శరీరానికి పోషకాలు అందక లోపాలు ఏర్పడవచ్చు. ఆరోగ్య ప్రయోజనాల కోసం బాదం పప్పులను రోజుకు 1015 మించకుండా తీసుకోవడం ఉత్తమం. వాటిని నేరుగా తినడం కంటే రాత్రి పూట నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఉదయం తొక్క తీసి తినడం వల్ల జీర్ణ సమస్యలు తగ్గుతాయి. ఆరోగ్యం కోసం తినే ఆహారం హానికరంగా మారకుండా చూసుకోవడం మన బాధ్యత..

# చక్కని ఆరోగ్యం

# డాక్టర్లు నాలుకను ఎందుకు పరీక్షిస్తారో

మనం డాక్టర్ దగ్గరకు వెళ్ళినప్పుడు, వారు ముందుగా చేసే పని 'నాలుక చూపించమని' అడగడం. ఇది ఏదో సాధారణ పరీక్ష అని మనం అనుకుంటాం, కానీ మన నాలుక మన శరీర ఆరోగ్యానికి ఒక అద్దం వంటిది. మనకు తెలియకుండానే లోపల పెరుగుతున్న ఇన్ఫెక్షన్లు, పోషకాహార లోపాలు, చివరికి క్యాన్సర్ వంటి వ్యాధులను కూడా నాలుక రంగు మరియు ఆకృతిని బట్టి గుర్తించవచ్చు. ఆమె రోజూ ఉదయం లేవగానే అద్దంలో తన ముఖాన్ని చూసుకుంటుంది కానీ, తన నాలుకలో వస్తున్న మార్పులను గమనించలేదు. అతనికి నాలుకపై ఒక చిన్న పుండు పడింది, అది వారం గడిచినా తగ్గడం



లేదు. మనం సాధారణంగా నాలుకను కేవలం రుచి చూడటానికే వాడుతాం, కానీ అది మన శరీరంలోని అనారోగ్యాలను ముందే హెచ్చరించే ఒక 'అలారం' అని కు తెలుసా? రంగు మారినా, పగుళ్లు వచ్చినా లేదా వింతైన పూత కనిపిస్తున్నా.. అది శరీరం పంపుతున్న అత్యవసర సంకేతం కావచ్చు. ఉదయం లేవగానే నాలుకపై పల్చని తెల్లటి పొర ఉండటం సహజం. కానీ, ఆ పూత మందంగా ఉండి, బ్రష్ చేసినా పోకపోతే అది 'ఓరల్ థ్రష్' (మంచిది.సాధారణంగా నోటి పూత వారం రోజుల్లో తగ్గిపోతుంది. కానీ, నాలుకపై వచ్చిన పుండు రెండు వారాలు దాటినా తగ్గకుండా, నొప్పిగా ఉంటే అది ఓరల్ క్యాన్సర్ సంకేతం కావచ్చు. ముఖ్యంగా ధూమపానం, మద్యం సేవించే వారు ఇటువంటి మార్పుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలి.నాలుక తన సహజ సిద్ధమైన గులాబీ రంగును కోల్పోయి పాలిపోయినట్లు కనిపిస్తే, అది శరీరంలో రక్తం తక్కువగా ఉందని (అనీమియా) చెప్పడానికి ఒక నిదర్శనం. ఐరన్ లోపం వల్ల ఎర్ర రక్త కణాలు తగ్గడం వల్ల ఇలా జరుగుతుంది.నాలుకపై లోతైన గీతలు లేదా పగుళ్లు ఉండటం సాధారణంగా ప్రమాదకరం కానప్పటికీ, అక్కడ ఆహార పదార్థాలు చేరి ఇన్ఫెక్షన్లకు దారితీయవచ్చు. అలాగే, పసుపు రంగు పూత ఉంటే అది జీర్ణక్రియ సమస్యలను లేదా నోటి పరిశుభ్రత లోపాన్ని సూచిస్తుంది.ఆధునిక వైద్యంలో ఎన్ని స్కానింగ్లు వచ్చినా, శారీరక పరీక్షలో నాలుకకు ఉండే ప్రాధాన్యత తగ్గలేదు. నాలుకలో పైన చెప్పిన మార్పులు ఏవైనా కనిపిస్తే, స్వీయ వైద్యం చేసుకోకుండా నిపుణులను సంప్రదించడం ఉత్తమం.

# మార్కెట్లోకి కల్తీ పుచ్చకాయలు..!

ప్రస్తుతం కల్తీ సమస్య ఆహార పదార్థాలన్నింటినీ ప్రభావితం చేస్తోంది. కొందరు వ్యాపారులు పుచ్చకాయలను త్వరగా పండేలా చేయడానికి, లోపలి భాగం ఎర్రగా కనిపించేలా చేయడానికి ఇంజెక్షన్లు ఉపయోగిస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలా కల్తీ చేసిన పుచ్చకాయలను తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని సూచిస్తున్నారు. ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉండేట్లే ఉన్నాయి. ఇంకా ఏప్రిల్ నెల రాకముందే పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు చాలా మంది మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరుకు రసం వంటి చల్లని పానీయాలతో పాటు శరీరానికి చలువ చేసే పండ్లను ఎక్కువగా తీసుకుంటున్నారు. వేడి నుంచి ఉపశమనం కలిగించే అలాంటి పండ్లలో పుచ్చకాయ మొదటి స్థానంలో ఉంటుంది. ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో పాటు పీచు, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ ం, విటమిన్ అ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఈ పండును ఎంతో ఇష్టంగా తింటారు. అయితే ప్రస్తుతం కల్తీ సమస్య ఆహార పదార్థాలన్నింటినీ ప్రభావితం చేస్తోంది. కొందరు వ్యాపారులు పుచ్చకాయలను త్వరగా పండేలా చేయడానికి, లోపలి భాగం ఎర్రగా కనిపించేలా చేయడానికి ఇంజెక్షన్లు ఉపయోగిస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలా కల్తీ చేసిన పుచ్చకాయలను తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో పుచ్చకాయను కొనేటప్పుడు అది సహజమైనదా? లేక కల్తీదా? అన్నది గుర్తించడానికి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఈ••ంఎ) కొన్ని సులభమైన సూచనలు చేసింది. మార్కెట్‌లో పుచ్చకాయ కొనేటప్పుడు ముందుగా చిన్న ముక్క కట్ చేసి ఇవ్వమని అడగాలి. ఆ తర్వాత ఒక చిన్న కాటన్ బాల్ లేదా టిష్యూ పేపర్ తీసుకుని ఆ ముక్క లోపలి భాగాన్ని స్వల్పంగా రబ్ చేయాలి.రబ్ చేసిన తర్వాత కాటన్ లేదా టిష్యూ పేపర్ ఎరుపు రంగులోకి మారితే, ఆ పుచ్చకాయ కల్తీ చేసినదిగా భావించాలి. ఎందుకంటే అలాంటి సందర్భాల్లో పుచ్చకాయలో "ఎరిథ్రోసిన్" అనే రసాయనాన్ని ఇంజెక్ట్ చేసి ఎర్రగా కనిపించేలా చేస్తారు .ఈ రసాయనం కలిగిన పుచ్చకాయలు



తినడం ఆరోగ్యానికి హానికరమని నిపుణులు చెబుతున్నారు.అదే సమయంలో టిష్యూ పేపర్ రంగు మారకపోతే, ఆ పుచ్చకాయ సహజమైనదిగా భావించవచ్చు.

# తీవ్ర ఎండలోనూ చల్లదనం కోరుకుంటున్నారా..?

వేడి వాతావరణంలో శరీరం చెమట రూపంలో ఎక్కువగా నీరు, ముఖ్యమైన ఖనిజాలను కోల్పోతుంది. ఈ లోటును సమయానికి భర్తీ చేయకపోతే అలసట, తలతిరుగుడు, తలనొప్పి, వడదెబ్బ వంటి సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి ఈ సీజన్‌లో శరీరాన్ని చల్లగా ఉంచడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచే సహజమైన, పోషకమైన ఆహారాలను ఆహారంలో చేర్చుకోవడం చాలా ముఖ్యం. వేసవి ప్రారంభమైన వెంటనే తీవ్రమైన సూర్య కాంతి, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వేడి గాలులు మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఈ కాలంలో సాధారణంగా కనిపించే సమస్యలు వడదెబ్బ, నిర్జలీకరణం (డీహైడ్రేషన్), అలసట, బలహీనత. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లేవారికి వేడి మరింత తీవ్రంగా అనిపిస్తుంది. అందుకే వేసవిలో ఆహారం, పానీయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. శరీరాన్ని లోపల నుంచే చల్లగా ఉంచే సహజమైన ఆహారాలను తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం. వేడి వాతావరణంలో శరీరం చెమట రూపంలో ఎక్కువగా నీరు, ముఖ్యమైన ఖనిజాలను కోల్పోతుంది. ఈ లోటును సమయానికి భర్తీ చేయకపోతే అలసట, తలతిరుగుడు, తలనొప్పి, వడదెబ్బ వంటి సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి ఈ సీజన్‌లో శరీరాన్ని చల్లగా ఉంచడమే



కాకుండా రోగనిరోధక శక్తిని పెంచే సహజమైన, పోషకమైన ఆహారాలను ఆహారంలో చేర్చుకోవడం చాలా ముఖ్యం. ఇక్కడ చెప్పాల్సింది సబ్జా గింజలు గురించి. వీటిని తులసి గింజలు లేదా ఫలూదా గింజలు అని కూడా అంటారు. ఇవి సహజంగా చల్లదనాన్ని కలిగించే గుణం కలిగి ఉండటంతో పాటు అనేక పోషకాలతో నిండి ఉంటాయి. చిన్నవిగా కనిపించినా ఇవి శరీరానికి చాలా ప్రయోజనకరమైనవి

. ముఖ్యంగా వేసవిలో వీటిని తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. సబ్జా గింజలను ఒక పోషకాల శక్తివంతమైన నిల్వగా భావిస్తారు. వీటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది ? ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. ప్రోటీన్, మెగ్నీషియం, కాల్షియం, ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బోహైడ్రేట్లు, ఇవి తక్కువ కేలరీలు కలిగి ఉండటంతో బరువు నియంత్రణలో కూడా సహాయపడతాయి. అదనంగా ఒమేగా3 ఫ్యాటీ ఆమ్లాలు, ఖనిజాలు కూడా ఇందులో లభిస్తాయి. ఆయుర్వేద నిపుణుల ప్రకారం, సబ్జా గింజలు ఆరోగ్యానికి చాలా ఉపయోగకరమైనవి. వేసవి కాలంలో వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం కలుగుతుంది. అలాగే కడుపును చల్లగా ఉంచి జీర్ణక్రియను మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం, బరువు తగ్గడంలో సహాయపడటం వంటి ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తీవ్ర వేడిలో వడదెబ్బ ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇవి కొంతవరకు సహాయపడతాయి.

# ఇవి ఆకులు కాదు అమృత పత్రాలు

మునగ కాయలు తెలియని తెలుగు వారుండరు. సాంబర్ నుంచి రకరకాల వంటకాలు మునగ కాయలతో తయారు చేస్తారు. వీటితో తయారు చేసిన వంటకాలు రుచికి భలేగా ఉంటాయి. అంతేనా.. ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో ఐరన్, కాల్షియం, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి.

ఇవి శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. మునగ కాయలు తెలియని తెలుగు వారుండరు. సాంబర్ నుంచి రకరకాల వంటకాలు మునగ కాయలతో తయారు చేస్తారు. వీటితో తయారు చేసిన వంటకాలు రుచికి భలేగా ఉంటాయి. అంతేనా.. ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు



చేస్తాయి. వీటిల్లో ఐరన్, కాల్షియం, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. మునగ చాలా పోషకమైన మొక్క. వీటి కాయలే కాదు మునగ ఆకుల్లోనూ విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. రోజువారీ ఆహారంలో సరైన పరిమాణంలో దీనిని చేర్చుకోవడం వల్ల క్రమంగా శరీరానికి బలం, రోగనిరోధక శక్తి లభిస్తుంది. మునగ ఆకుల పొడితో సూప్‌లు, స్మూతీలు, వంటకాలు చేసుకోవచ్చు. మునగ ఆకులలో ఇనుము, కాల్షియం, విటమిన్ ఎ, విటమిన్ సి, ప్రోటీన్ వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఈ మూలకాలు శరీరానికి బలాన్ని ఇస్తాయి. బలహీనతను తగ్గిస్తాయి. ఇది అలసటను తొలగిస్తుంది. ఈ మొక్క ఆకులు యాంటీఆక్సిడెంట్ భాగాలను కలిగి ఉంటాయి. ఇవి కాలుష్యం, ఒత్తిడి వల్ల కలిగే నష్టం నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. ఇది తక్షణ ప్రభావాన్ని చూపదు. కానీ క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మంచి ప్రయోజనాలు పొందవచ్చు. మునగ ఆకులను తీసుకోవడం వల్ల టీ, కాఫీ లాగా తక్షణ శక్తి లభించదు. కానీ క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల క్రమంగా ప్రయోజనాలు లభిస్తాయి. దీనిలోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కడుపును శుభ్రంగా ఉంచుతుంది. గ్యాస్ సమస్యలను తగ్గిస్తుంది. మునగ ఆకులను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రించుకోవచ్చు. మునగ ఆకుల్లోని పోషకాలు శరీరాన్ని లోపలి నుండి పోషిస్తాయి. తద్వారా చర్మం, జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# అందరికి మేలు చేసే అవకాడో వారికి చాలా డేంజర్..



మనలో చాలా మంది అవకాడోను ఎక్కువగా తింటారు. వీటిని అధికంగా తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు వెల్లడించారు. జీర్ణ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడేవారు అస్సలు తినకూడదు. మగవారిలో ఎంతో మంది అవకాడోను ఎక్కువగా తింటారు. వీటిని తినడం వలన కొందరికి ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చేసిన పరిశోధనల్లో తేలింది. జీర్ణ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడేవారు అవకాడోను తినకపోవడమే మంచిది. తింటే కడుపు నొప్పి వచ్చే అవకాశం ఉంది. మైగ్రేన్ తలనొప్పి ఉన్నవారు అవకాడోను దూరం పెట్టాలి. ఎందుకంటే వీటిలో ఉండే 'రమైన్' తల నొప్పిని పెంచుతుంది. ఈ అవకాడోను తింటే బరువు ఈజీగా పెరుగుతారు. వారు మాత్రం అస్సలు తినొద్దు. సన్నగా ఉండే వాళ్ళు ఉంటే లావు అవుతారని నిపుణులు చెబుతున్నారు. అవకాడో తిన్న తర్వాత దురదలు వస్తాయి ఇలాంటి వారు అస్సలు తినకండి. ఇంకా నోటి పుండ్లు కూడా వస్తాయి.

# ఉప్పు, జామకాయ కలిపి తింటున్నారా?

జామ రోగనిరోధక శక్తిని పెంచడం నుండి జీర్ణక్రియను మెరుగుపరచడం, చర్మాన్ని మెరిసేలా చేయడం వరకు అనేక విధాలుగా మేలు చేస్తుంది. జామకాయలో ఆపిల్ కంటే 10 రెట్లు ఎక్కువ ప్రోటీన్, మూడు నారింజల కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. చాలా మంది ఆరోగ్యకరమైన జామ కాయలను ఉప్పుతో తింటారు. విటమిన్ సి, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉన్న జామకాయ ప్రయోజనాలు దాని రుచిని మించి ఉంటాయి.

దాని తీపి, ఉప్పగా ఉండే రుచితో జామ రోగనిరోధక శక్తిని పెంచడం నుండి జీర్ణక్రియను మెరుగుపరచడం, చర్మాన్ని మెరిసేలా చేయడం వరకు అనేక విధాలుగా మేలు చేస్తుంది. జామకాయలో ఆపిల్ కంటే 10 రెట్లు ఎక్కువ ప్రోటీన్, మూడు నారింజల కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది.

చాలా మంది ఆరోగ్యకరమైన జామ కాయలను ఉప్పుతో తింటారు. ఇలా తినటం సరైనదేనా..? జామకాయను ఉప్పుతో ముఖ్యంగా నల్ల ఉప్పు, లేదా రాతి ఉప్పుతో కలిపి తినడం వల్ల దాని ప్రయోజనాలు పెరుగుతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అదనపు విటమిన్ సిని అందిస్తుంది. రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది.

గుండె ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది. ఉప్పు జామ రుచిని పెంచడమే కాకుండా ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేస్తుంది. అయితే, కు అధిక రక్తపోటు ఉంటే, తక్కువ ఉప్పును వాడండి. జామకాయలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది నల్ల ఉప్పుతో కలిపితే మలబద్ధకం, ఆమ్లత్వం, ఉబ్బరం నుండి ఉపశమనం కలిగిస్తుంది. కాబట్టి, కడుపు సమస్యలను తగ్గించడానికి, రు ఖచ్చితంగా జామకాయను నల్ల ఉప్పుతో తినాలి. జామపండ్లలో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఉప్పు ద్రవ సమతుల్యతకు కూడా సహాయపడుతుంది. ఇది రోగనిరోధక శక్తికి గొప్ప కలయికగా మారుతుంది. జామపండ్లలోని యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ (ఒఆఒ), రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. ఉప్పు ఎలక్ట్రోలైట్ సమతుల్యతకు సహాయపడుతుంది. జామపండ్లలోని ఫైబర్, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి.

జామపండ్లకు ఉప్పు వేసుకోవడం వల్ల అదనపు రుచితో పాటు అనే ప్రయోజనాలను పొందవచ్చు. ఉప్పు జామ రుచిని పెంచుతుంది. జామలోని ఫైబర్ కు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఇది బరువు నియంత్రణకు సహాయపడుతుంది.

# 'మష్రూమ్ ఆమ్లెట్' ఒక్కసారి తింటే రోజంతా ఫుల్ ఎనర్జీ!



ప్రతిరోజూ ఉదయం అల్పాహారం విషయంలో చాలామందికి ఒకే రకమైన అయోమయం ఉంటుంది. ముఖ్యంగా ఫిట్‌నెస్ ద శ్రద్ధ చూపే వారు, జిమ్ వర్కౌట్స్ చేసేవారు తమకు తగినంత ప్రోటీన్ అందడం లేదని ఫీలవుతుంటారు. సాధారణంగా డైట్ అనగానే ఉడకబెట్టిన గుడ్లు లేదా మామూలు ఆమ్లెట్ తిని బోర్ కొట్టేస్తుంది. అటు రుచిని, ఇటు ఆరోగ్యాన్ని సమానంగా అందించే ఒక స్పెషల్ బ్రేక్‌ఫాస్ట్ రెసిపీని ఈరోజు మనం పరిచయం చేసుకోబోతున్నాం. హోటల్ స్టైల్‌లో ఫ్లఫీగా ఉండే 'మష్రూమ్ ఆమ్లెట్' ఎలా తయారు చేయాలో తెలుసుకుందాం. అతను ప్రతిరోజూ ఉదయం క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తాడు. కానీ, గంట గడవకముందే నీరసం వచ్చేస్తుంది. ఆమె బరువు తగ్గాలని డైట్ చేస్తోంది, కానీ ఆకలిని నియంత్రించుకోలేక జంక్ ఫుడ్ వైపు మొగ్గు చూపుతోంది. వీరిద్దరి సమస్యకు పరిష్కారం వారి అల్పాహారంలోనే ఉంది. సాధారణ గుడ్డుకు 'మష్రూమ్స్' తోడైతే, అది ఒక అద్భుతమైన ఎనర్జీ బూస్టర్‌గా మారుతుందని కు తెలుసా? కేవలం 10 నిమిషాల్లో తయారయ్యే ఈ వంటకం మెటబాలిజంను పెంచడమే కాకుండా, శరీరానికి కావాల్సిన పోషకాలను సమృద్ధిగా అందిస్తుంది.

కావలసిన పదార్థాలు:
కోడి గుడ్లు: 2 లేదా 3
మష్రూమ్స్: ఒక కప్పు (సన్నగా తరిగినవి)
వెన్న లేదా ఆలివ్ ఆయిల్: 1 టేబుల్ స్పూన్
రుచికి సరిపడా: ఉప్పు, మిరియాల పొడి
తురిమిన చీజ్: కొద్దిగా (ఆప్షనల్)
సన్నగా తరిగినవి: ఉల్లిపాయలు, కొత్తిర

తయారీ విధానం: చాలామంది మష్రూమ్స్‌ను నేరుగా గుడ్డు మిశ్రమంలో కలిపేస్తుంటారు. దీనివల్ల మష్రూమ్స్ లోని నీరు బయటకు వచ్చి ఆమ్లెట్ ముద్దగా మారుతుంది. అలా కాకుండా ఉండాలంటే ఈ పద్ధతి పాటించండి. మొదట ఒక పాన్‌లో కొద్దిగా వెన్న వేసి, మష్రూమ్ ముక్కలను గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చేవరకు వేయించి పక్కన పెట్టుకోవాలి.ఒక బౌల్‌లో గుడ్లు, ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా నురగ వచ్చే వరకు గిలకొట్టాలి. రు ఎంత బాగా మిక్స్ చేస్తే ఆమ్లెట్ అంత మెత్తగా, ఫ్లఫీగా వస్తుంది. తర్వాత అదే పాన్‌ను తక్కువ మంటపై ఉంచి, గుడ్డు మిశ్రమాన్ని వేయాలి. అది కాస్త సెట్ అవుతున్న సమయంలో, ముందుగా వేయించిన మష్రూమ్స్, చీజ్ మరియు ఉల్లిపాయ ముక్కలను ఒక వైపున వేసి ఆమ్లెట్‌ను జాగ్రత్తగా సగానికి మడవాలి. రెండు నిమిషాలు చిన్న మంటపై మగ్గనిచ్చి, చివరగా కొత్తిర చల్లుకుంటే వేడివేడి మష్రూమ్ ఆమ్లెట్ సిద్ధం. మష్రూమ్స్‌లో విటమిన్ డి మరియు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. గుడ్డులోని ప్రోటీన్‌తో ఇవి కలిసినప్పుడు కండరాల నిర్మాణానికి మరియు బరువు తగ్గడానికి అద్భుతంగా తోడ్పడతాయి. ఇది తింటే మధ్యాహ్నం వరకు కు ఆకలి వేయదు, దీనివల్ల అనవసరమైన చిరుతిళ్లకు దూరంగా ఉండవచ్చు. ఆరోగ్యం అనేది మనం తీసుకునే ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది. రొటీన్ వంటకాలకు ఇలా చిన్నపాటి మెరుగులు దిద్దితే ఆరోగ్యం మెండుగా ఉంటుంది.



# పైసా ఖర్చు లేకుండా ఇంట్లోనే బరువు తగ్గండిలా..

బరువు తగ్గడం అనేది ఖరీదైన వ్యవహారమని, జిమ్‌లు, ఖరీదైన డైట్ ప్లాన్‌లు ఉంటేనే సాధ్యమని చాలా మంది భ్రమ పడుతుంటారు. కానీ మన వంటింట్లో దొరికే సాధారణ ఆహార పదార్థాలతోనే పైసా ఖర్చు లేకుండా బరువు తగ్గవచ్చని తమిళనాడు ప్రజారోగ్య అధికారి ఫరూక్ అబ్దుల్లా స్పష్టం చేస్తున్నారు. కేవలం కార్బోహైడ్రేట్లను తగ్గిస్తూ, జీవన శైలిలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ఆయన వివరిస్తున్నారు. చాలా మందికి రోజును టీ లేదా కాఫీతో ప్రారంభించే అలవాటు ఉంటుంది.

అయితే బరువు తగ్గాలనుకునే వారు చక్కెరను పూర్తిగా పక్కన పెట్టాలి. చక్కెర లేని నిమ్మకాయ టీ, బ్లాక్ కాఫీ లేదా బ్లాక్ టీ తీసుకోవడం ఉత్తమం. 100 మి.లీ పాలతో చక్కెర లేదా బెల్లం లేకుండా తాగవచ్చు.మనం తినే ఇడ్లీ, దోసెలలో స్టార్చ్ ఎక్కువగా ఉంటుంది. దీనికి బదులుగా 100 గ్రాముల ఉడికించిన లేదా కాల్చిన వేరుశనగలు తినండి. ఇది స్టార్చ్‌ను భారీగా తగ్గించడమే కాకుండా ఇందులోని ప్రోటీన్ కడుపు నిండుగా ఉంచి త్వరగా ఆకలి వేయకుండా చేస్తుంది.డైటింగ్ సమయంలో మధ్యలో ఆకలి వేయడం సహజం. ఆ సమయంలో చిరుతిండి జోలికి వెళ్లకుండా దోసకాయను ఎంచుకోండి. ఇందులో నీటి శాతం ఎక్కువ, కేలరీలు తక్కువ. ఇది ఆకలిని చంపడమే కాకుండా శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుతుంది.రు ప్రతిరోజూ తినే అన్నాన్ని మూడు భాగాలుగా అనుకుంటే.. ఒక భాగం మాత్రమే అన్నం తిని, మిగిలిన రెండు భాగాలను కూరగాయలు, గుడ్లతో భర్తీ చేయండి. రెండు గుడ్లను ఉడికించి గానీ లేదా ఆమ్లెట్ రూపంలో గానీ తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ఫైబర్, ప్రోటీన్ అందుతాయి. సాయంత్రం వేళ తియ్యని టీకి బదులు జామకాయ తినడం మేలు. ఇక రాత్రి పూట దోసెలు లేదా చపాతీల సంఖ్యను తగ్గించి.. వాటి స్థానంలో 100 గ్రాముల పచ్చి బఠానీలు,

కాలీఫ్లవర్, పుట్టగొడుగులు లేదా చికెన్, పనీర్ చేర్చుకోవాలి. రాత్రి 8 గంటలలోపే భోజనం ముగిస్తే జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. ఆహార నియంత్రణతో పాటు రోజుకు కనీసం ఒక గంట నడవడం తప్పనిసరి. రోజుకు 3 నుండి 4 లీటర్ల నీరు తాగడం వల్ల శరీరంలోని మలినాలు బయటకు పోతాయి. ఒత్తిడి తగ్గడానికి, అవయవాల పనితీరు మెరుగుపడటానికి 6 నుండి 8 గంటల wwwగాఢ నిద్ర అవసరం.

## ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ రెడీ..




టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా సరికొత్త 787-9 డ్రీమ్‌లైనర్ విమానం.. విహారానికి సిద్ధమైంది. దాదాపు 8 ఏళ్ల తర్వాత డ్రీమ్‌లైనర్ విమానం ఎయిరిండియా ఫ్లీట్‌లో ఇటీవలే చేరిన సంగతి తెలిసిందే. ప్రైవేటీకరణ తర్వాత ఎయిరిండియా చేతికొచ్చిన తొలి విమానం కూడా ఇదే. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'వింగ్స్ ఇండియా 2026'లో సందడి చేసిన ఈ లోహ విహంగం.. ఇప్పుడు ప్రయాణికులకు సేవలందించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఇందులోని సదుపాయాలను పరిచయం చేస్తూ టాటా గ్రూప్ ఓ పోస్ట్ పెట్టింది.




# ఫ్లిప్‌కార్ట్ 300 మందికి ఉద్వాసన!



దిల్లీ: ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ (Flipkart layoffs) ఉద్యోగ కోతలను ప్రకటించింది. సుమారు 250-300 మంది ఉద్యోగులను తొలగించినట్లు తెలిసింది. వార్షిక పనితీరు ఆధారంగా ఈ కోతలు చేపట్టిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. వివిధ విభాగాలు, ఉద్యోగ స్థాయిల్లో ఈ లేఆఫ్‌లు ప్రకటించినట్లు సమాచారం. తొలి పబ్లిక్ ఇష్యూకు (IPO) సిద్ధమవుతున్న ఫ్లిప్‌కార్ట్.. మరోవైపు సీనియర్ స్థాయిలో నియామకాలు చేపడుతోంది. ఈ క్రమంలో లేఆఫ్‌లు ప్రకటించడం గమనార్హం. ఎప్పటికప్పుడు ఉద్యోగుల పనితీరును సమీక్షిస్తుంటామని, అందులో భాగంగా కొద్ది సంఖ్యలో ఉద్యోగులకు పక్కన పెట్టినట్లు ఫ్లిప్‌కార్ట్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఎంతమందిని తొలగించారన్న విషయాన్ని మాత్రం ఫ్లిప్‌కార్ట్ వెల్లడించలేదు. వాల్‌మార్ట్ మద్దతు కలిగిన ఫ్లిప్‌కార్ట్ త్వరలో ఐపీఓకు వచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. ఇందులో భాగంగా సింగపూర్‌లో ఉన్న తన ప్రధాన కార్యాలయాన్ని భారత్‌కు తరలించింది. భారత నియంత్రణ సంస్థల అవసరాలకు అనుగుణంగా తన హోల్డింగ్ నిర్మాణంలో మార్పులు చేసింది. దీంతోపాటు సీనియర్ లీడర్‌షిప్‌ను బలోపేతం చేసేందుకు గడిచిన కొన్ని నెలలుగా నియామకాలను చేపట్టింది. సప్లయ్ చైన్ విభాగానికి వైస్ ప్రెసిడెంట్‌గా సోమనాథ్ దాస్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా దిగ్విజయ్ మిశ్రా, బిజినెస్ ఫైనాన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా విపిన్ కపూరియా, మానవ వనరుల వైస్ ప్రెసిడెంట్‌గా యోగితా షాన్‌భాగ్, క్విక్ కామర్స్ సప్లయ్ చైన్ విభాగానికి వైస్ ప్రెసిడెంట్‌గా అమేర్ హుస్సేన్‌ను నియమించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.5,189 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించిన ఫ్లిప్‌కార్ట్.. ఇదే కాలానికి ఆదాయం రూ.82,787.3 కోట్లుగా నమోదు చేసింది. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్‌లో ఫ్లిప్‌కార్ట్, మింత్రా, ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్, క్లియర్‌ట్రిప్, సూపర్.మనీ కంపెనీలు ఉన్నాయి.

# పసిడి ఆభరణాల స్వచ్ఛత..




బంగారం ధర బాగా పెరిగిన నేపథ్యంలో, పసిడి ఆభరణాల స్వచ్ఛతపై పారదర్శకత పెంచడం ద్వారా, కొనుగోలుదార్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పసిడి ఆభరణాలకు తప్పనిసరి హాల్‌మార్కింగ్ నిబంధనల అమలును 380 జిల్లాలకు పొడిగించింది. ఈ నిబంధనల అమలును దశలవారీగా 2021లో ప్రభుత్వం ప్రారంభించింది. దశలవారీగా ప్రస్తుతం విస్తరిస్తూ వచ్చింది. ఇప్పుడు 380 జిల్లాలకు విస్తరించడంతో చిన్న, ప్రాంతీయ మార్కెట్లను కూడా తప్పనిసరి హాల్‌మార్కింగ్ పరిధిలోకి తెచ్చినట్లయ్యింది. ప్రస్తుతం దేశంలో 800 వరకు జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రకారం చూస్తే.. ఇంకా ఈ నిబంధనల వర్తింపునకు దూరంగా సుమారు 400 జిల్లాలు ఉన్నాయన్నమాట. హాల్‌మార్కింగ్ ఆఫ్ గోల్డ్ జువెలరీ అండ్ గోల్డ్ ఆర్టేఫ్యాక్ట్స్ (సవరణ) ఆదేశాలు-2026 ప్రకారం.. తప్పనిసరి హాల్‌మార్కింగ్ పరిధిని 380 జిల్లాలకు పెంచుతూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పసిడి వినియోగం అధికంగా ఉండే తెలంగాణలో 13, ఆంధ్రప్రదేశ్‌లో 18 జిల్లాలు సహా ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లోని రెండో అంచె, మూడో అంచె జిల్లాలను కూడా హాల్‌మార్క్ తప్పనిసరి పరిధిలోకి తీసుకొచ్చారు. పెద్ద నగరాలతో పోలిస్తే చిన్న, ప్రాంతీయ విపణుల్లో కొనుగోలుదార్లకు పసిడి స్వచ్ఛతపై అవగాహన తక్కువగా ఉంటోంది. అక్కడా హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయడం వల్ల, చెల్లించిన నగదుకు తగ్గట్లు స్వచ్ఛమైన బంగారాన్ని కొనుగోలు చేయగలుగుతారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి ఆభరణంపై ఉండే ప్రత్యేక గుర్తింపు సంఖ్య సాయంతో, కొనుగోలుదార్లు బంగారం స్వచ్ఛతను తెలుసుకోగలుగుతారు.

# ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచండి..

## రిఫైనరీలను కోరిన కేంద్రం



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన మార్కెట్‌లో అనిశ్చితి నెలకొంది. దీంతో వంటగ్యాస్ లభ్యతను నిర్ధరించేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలను ఆదేశించింది. దేశీయ సరఫరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ ఎల్‌పీజీ ప్రభుత్వరంగ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు మాత్రమే విక్రయించాలని తన ఆదేశాల్లో పేర్కొంది. ఆ సరఫరాలు దేశీయ వినియోగదారులకు మాత్రమే చేరేలా చూడాలని ఆ మూడు సంస్థలకు సూచించింది. ఎల్‌పీజీని ఉత్పత్తి చేయడానికి కీలకమైన ప్రొపేన్, బ్యూటేన్‌ను పెట్రోకెమికల్ ప్రొడక్షన్ కోసం దారి మళ్లించవద్దని కేంద్రం రిఫైనరీలకు స్పష్టం చేసింది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన వంటి పథకాల ద్వారా దేశంలో ఎల్‌పీజీ గృహ వినియోగం గణనీయంగా పెరిగింది. ఈ ఇంధన అవసరాలు తీర్చుకునేందుకు 60 శాతం దిగుమతుల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి. దాంతో అంతర్జాతీయంగా ధరలు పెరిగినా, రవాణాలో అంతరాయాలు ఏర్పడినా దేశీయంగా ఆ ప్రభావం కనిపిస్తుంటుంది.

## జియో ఫైనాన్స్ యాప్.. పేమెంట్స్, ఇన్వెస్ట్‌మెంట్స్ అన్నీ ఒకే చోట

రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి చెందిన జియో ఫైనాన్స్ కొత్త యాప్‌ను లాంచ్ చేసింది. బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ చెల్లింపులు, సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్లు, పర్సనలైజ్డ్ ఆర్థిక సలహాలు ఈ యాప్ ద్వారా నిర్వహించుకోవచ్చు. వ్యక్తులు తమ ఆర్థిక వ్యవహారాలను సులభంగా, స్మార్ట్‌గా చక్కబెట్టుకోవచ్చని జియో ఫైనాన్స్ ఓ ప్రకటనలో తెలిపింది. రైజింగ్ భారత్ సమ్మిట్, 2026లో సరికొత్త యాప్‌ను లాంచ్ చేశారు. ఏఐ సాయంతో మెరుగైన ఆర్థిక సలహాలు అందించడం ఈ ప్రత్యేకత. దీంతో పాటు జియో పాయింట్స్ పేరిట రివార్డు పాయింట్ల సిస్టమ్‌నూ తీసుకొచ్చారు. చెల్లింపుల సమయంలో లభించే ఈ రివార్డు పాయింట్లను షాపింగ్, డైనింగ్, ట్రావెలింగ్‌కు వినియోగించుకోవచ్చు.

## పెరిగిన వాహన రిటైల్ విక్రయాలు: ఫాడా

దేశీయంగా వాహన రిటైల్ విక్రయాలు ఫిబ్రవరిలో 26% పెరిగాయి. జీఎస్‌టీ రేట్ల కోత ఫలితంగా, వాహన ధరలు దిగిరావడం ఇందుకు దోహదం చేసిందని డీలర్ల సంఘం ఫాడా తెలిపింది. 2025 ఫిబ్రవరిలో రిటైల్‌గా మొత్తం 19,17,934 వాహనాలు విక్రయం కాగా.. గత నెలలో 25.62% అధికంగా 24,09,362 వాహనాలు అమ్ముడయ్యాయి. 'ద్విచక్ర-త్రిచక్ర వాహనాలు, కార్లు (పీవీ), వాణిజ్య వాహ నాలు, ట్రాక్టర్ల అమ్మ కాలూ బాగున్నాయ'ని ఫాడా ప్రెసిడెంట్ సి.ఎస్.విఘ్నేశ్వర్ తెలిపారు. ఏడాది వ్యవధిలో ద్విచక్ర వాహన రిటైల్ విక్రయాలు 25% పెరిగాయి. త్రిచక్ర వాహనాలు 24%, పీవీలు 26%, వాణిజ్య వాహనాల అమ్మకాలు 29% చొప్పున పెరి గాయి. కార్లు, ఎస్‌యూవీలు వ్యాన్లు లాంటి ప్రయాణికుల వాహనాలు (పీవీ) ఈ ఏడాది ఫిబ్రవరిలో 3,94,768 అమ్ముడయ్యాయి. 2025 ఫిబ్రవరిలో ఇవి 3,13,015 విక్రయమయ్యాయి. ద్విచక్ర వాహనాల అమ్మకాలు 13,60,155 నుంచి 17,00,505కు; త్రిచక్ర వాహనాలు 89,418 నుంచి 1,17,130కు; వాణిజ్య వాహనాలు 78,219 నుంచి 1,00,820కు చేరాయి. పట్టణాల్లో వాహనాల రిటైల్ విక్రయాల్లో 21% వృద్ధి ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో 34% వృద్ధి నమోదైంది.






## సంజు శాంసన్ స్ఫూర్తితో అభిషేక్ పుంజుకొంటాడు: కపిల్ దేవ్



సెమీస్‌లో గెలిచి టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌కు భారత్ చేరుకోవడంలో సంజు శాంసన్, జస్‌ప్రీత్ బుమ్రా కీలక పాత్ర పోషించారు. తొలుత బ్యాటింగ్‌లో అదరగొట్టిన సంజు టీమ్ ఇండియాకు భారీ స్కోరు అందించాడు. లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ దూకుడుకు జస్‌ప్రీత్ బుమ్రా తన పదునైన బౌలింగ్‌తో కళ్లెం వేశాడు. ఇక ఈ మ్యాచ్‌లోనూ అభిషేక్ శర్మ (9) మరోసారి నిరాశపరిచాడు. ఈ ముగ్గురిపై క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ తనదైన శైలిలో విశ్లేషణ చేశారు. జస్‌ప్రీత్ బుమ్రా ప్రపంచంలోనే టాప్ బౌలర్ అని భావిస్తున్నా. అతడి గురించి ఎంత చెప్పినా సరిపోదు. తీవ్ర ఒత్తిడిలోనూ ఎలాంటి ప్రదర్శన ఇచ్చాడో మనం చూశాం. దేశంలోని ప్రతి క్రికెట్ అభిమాని ప్రేమ, గౌరవానికి అతడు అర్హుడు. ఇక సంజు శాంసన్ బ్రిలియంట్ క్రికెటర్. కొన్నిసార్లు పెద్ద ప్లేయర్లకూ కష్టాలు తప్పవు. వాటిని ఎదుర్కొని ముందుకు సాగాలి. ఆ పరిస్థితులను అనుభవించిన సంజు శాంసన్ తన ఫామ్‌ను అందుకొన్నాడు. గత రెండు మ్యాచుల్లో అతడి బ్యాటింగ్ ప్రదర్శన అద్భుతం.

# ఫ్రాంచైజీ ఓనర్లుగా ఆ ఇద్దరు మాజీలు?



టీమ్ఇండియా క్రికెట్ దిగ్గజాలైన రాహుల్ ద్రవిడ్, రవిచంద్రన్ అశ్విన్.. యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో వారు భాగం కాబోతున్నారని సమాచారం. వీరు గ్లాస్గో ఫ్రాంచైజీని కొనేందుకు ఇండియన్ కన్సార్టియంలో భాగస్వామ్యం కానున్నట్లు ఓ ఆంగ్ల మీడియాలో కథనం వచ్చింది. రోటర్‌డామ్ ఫ్రాంచైజీని దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్లు ఫాఫ్ డు ప్లెసిస్, హెన్రిచ్ క్లాసెన్, జాంటీ రోడ్స్ కొనేందుకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. ఈ నెల చివర్లో జరిగే కార్యక్రమంలో రెండు ఫ్రాంచైజీలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఆమ్‌స్టర్‌డామ్, బెల్ఫాస్ట్, ఎడిన్‌బర్గ్ ఫ్రాంచైజీలను జనవరిలో విక్రయించారు. డబ్లిన్ ఫ్రాంచైజీ ఇంకా అమ్ముడుపోలేదు. దీన్ని కొనేందుకు ది హండ్రెడ్ లీగ్‌లోని ఓ రెండు జట్ల యజమానులు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో అశ్విన్ ఆడతాడా.. లేదా.. అనే విషయంపై ఇప్పటివరకైతే ఏ సమాచారమూ లేదు.

# ఫైనల్లో అభిషేక్‌ను ఆడించాలి: రవిశాస్త్రి




టీ20 ప్రపంచకప్ 2026లో అభిషేక్ శర్మ పేలవ ఫామ్ కొనసాగుతోంది. ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో అతడు కేవలం 9 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్‌కు చేరా డు. ఇప్పటివరకు అతడు ఈ మెగా టోర్నీల్లో 7 మ్యాచుల్లో కేవలం 89 పరుగులే చేశాడు. జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో మాత్రమే హాఫ్‌సెంచరీ సాధించాడు. ఈ నేపథ్యంలో అభిషేక్ శర్మను ఫైనల్‌లో ఆడించాలని టీమ్ఇండియా మాజీ కోచ్ రవిశాస్త్రి సూచిస్తున్నాడు. అభిషేక్ శర్మను తుది జట్టులో కొనసాగించాలి. ఫైనల్ కోసం మార్పులు చేయాల్సిన అవసరం లేదు. 'నీ సామర్థ్యం మీద నువ్వు నమ్మకంతో ఉండు. తిరిగి పుంజుకో. ధైర్యం కోల్పోవద్దు' అని అతడికి చెప్పాలి'' అని రవిశాస్త్రి అన్నాడు. ఫైనల్‌లో అభిషేక్ రాణించే అవకాశముందని అతడు ఆశాభావం వ్యక్తంచేశాడు. 'మేం నీవెంటే ఉన్నాం. వెళ్లి ఆడు. ఫైనల్‌లో నువ్వు బాగా ఆడతావు' అని రవిశాస్త్రి.. అభిషేక్‌నుద్దేశించి అన్నాడు. సంజుశాంసన్ వెస్టిండీస్, ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచుల్లో కీలక ఇన్నింగ్స్ ఆడి, టీమ్ఇండియా విజయంలో ప్రముఖ పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో అతడు తిరిగి రిథమ్‌లోకి వచ్చాడని రవిశాస్త్రిఅన్నాడు. 'మరింత నిలకడగా తాను ఆడాలన్న విషయాన్ని సంజుశాంసన్ గుర్తించాడు. అతడు ప్రస్తుతం తన షాట్ సెలక్షన్ విషయంలో మరింత తెలివిగా వ్యవహరిస్తున్నాడు. తిరిగిఅతడు పుంజుకున్నాడు. అతడిఅమ్ములపొదిలో చాలా షాట్లున్నాయి. కానీ సంజూలో ఏకాగ్రత లోపిస్తోం ది' అని రవిశాస్త్రి పేర్కొన్నాడు. 'సంజు శాంసన్ మానసికంగా బలంగా ఉన్నాడు. టీమ్ఇండియాలోకి వచ్చినప్పటినుంచి అతడి నైపుణ్యం మీద ఎవరికీ సందేహాలు లేవు. కానీ నిలకడలేమితో అతడు నిరాశపరుస్తున్నాడు. అయితే ప్రస్తుతం దాని నుంచి బయటపడ్డాడు' అని విశ్లేషించాడు.

## ఆసీస్‌తో ఏకైక టెస్టు.. భారత్ 198 ఆలౌట్

ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళా జట్టు ఏకైక టెస్టు ఆడుతోంది. ఇప్పటికే వన్డే, టీ20లను ఆడిన సంగతి తెలిసిందే. పొట్టి సిరీస్‌ను భారత్ గెలుచుకోగా.. వన్డే సిరీస్‌ను ఆసీస్ సొంతం చేసుకుంది. ఇప్పుడు పెర్త్ వేదికగా జరుగుతోన్న పింక్‌బాల్ టెస్టులో భారత్ తొలి



ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే ఆలౌటైంది. జెమీమా రోడ్రిగ్స్ (52) హాఫ్ సెంచరీ సాధించింది. ఆసీస్ బౌలర్ అన్నాబెల్ సదర్లాండ్ (4/46), లూసీ హామిల్టన్ (3/31), బ్రౌన్ (2/41), గార్డెనర్ (1/39) దెబ్బకు భారత్ కుదేలైంది. టాస్ నెగ్గిన ఆసీస్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియాకు శుభారంభం దక్కలేదు. టాప్ బ్యాటర్ స్మృతి మందాన (4) త్వరగానే పెవిలియన్‌కు చేరింది. అనంతరం షెఫాలీ వర్మ (35), ప్రతీకా రావల్ (18) కాసేపు ఇన్నింగ్స్‌ను నడిపించారు. వీరిద్దరూ స్వల్ప వ్యవధిలోనే ఔటయ్యారు. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (19) దూకుడుగా ఆడే క్రమంలో పెవిలియన్‌కు చేరింది. దీప్తి శర్మ (7), రిచా ఘోష్ (11), స్నేహ్ రాణా (5) నిరాశపరిచారు. వరుసగా వికెట్లు పడుతున్నా సరే ఓ వైపు జెమీమా మాత్రం హాఫ్ సెంచరీతో ఆకట్టుకుంది. ఆఖర్లో కాశ్వీ గౌతమ్ (34★) కాస్త దూకుడుగా ఆడి భారత స్కోరు బోర్డును 200కి చేరువ చేసింది.

# గతేడాది ఐపీఎల్‌లో ఏం జరిగింది?

## ఎవరు బాగా ఆడారు?




ఐపీఎల్ 2026కి సర్వం సిద్ధమవుతోంది. 19వ ఎడిషన్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ త్వరలో ప్రారంభం కానుంది. టీ20 ప్రపంచకప్ తర్వాత ఐపీఎల్ షెడ్యూల్ విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది ఐపీఎల్ టోర్నీలో ఏం జరిగింది, ఎవరు బాగా ఆడారు, కీలక గణాంకాల వివరాలు చూద్దాం. బౌలర్లలో అత్యుత్తమ ప్రదర్శన దిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్ మిచెల్ స్టార్క్‌ది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 33 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. అత్యధిక డాట్ బాల్స్ వేసిన బౌలర్ల జాబితాలో మహ్మద్ సిరాజ్ (151), ప్రసిద్ధ్ కృష్ణ (146), ఖలీల్ అహ్మద్ (137) టాప్ 3లో ఉన్నారు.

2025 ఐపీఎల్‌లో మొత్తం 9 మంది బ్యాటర్లు సెంచరీలు చేశారు. వారే వైభవ్, మార్ష్, రాహుల్, క్లాసెన్, అభిషేక్, ఇషాన్, పంత్, సాయి సుదర్శన్, ప్రియాంశ్.

ఈ టోర్నీలో ఫాస్టెస్ట్ 50 కొట్టిన బ్యాటర్ రొమారియో షెపర్డ్.

చెన్నైతో మ్యాచ్‌లో 14 బంతుల్లోనే అర్ధ శతకం బాదాడు. ఆ తర్వాత ప్లేస్ వైభవ్‌ది.(17 బంతుల్లో)

ఇక ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు అయితే చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీది. గుజరాత్ మ్యాచ్‌లో రాజస్థాన్ తరఫున దిగి 35 బంతుల్లో శతకం బాదాడు.

ఈ టోర్నీలో ఒకేఒక్క హ్యాట్రిక్ నమోదైంది. పంజాబ్ బౌలర్ యుజ్వేంద్ర చాహల్ ఈ ఘనత సాధించాడు.

గతేడాది ఐపీఎల్‌లో అత్యధిక అర్ధ శతకాల రికార్డు విరాట్ కోహ్లీ (8) పేరిట ఉంది.

ఎక్కువ వికెట్లు తీసిన ఘనత ప్రసిద్ధ్ కృష్ణ (25)కు దక్కింది.

టోర్నీలో ఎక్కువ ఫోర్లు బాదిన బ్యాటర్ సాయి సుదర్శన్ (88) కాగా, అత్యధిక సిక్స్‌ల రికార్డు నికోలస్ పూరన్ (40) పేరున నమోదైంది.

గతేడాది ఎక్కువ పరుగులు చేసిన సాయి సుదర్శన్ (759 పరుగులు) ఆరెంజ్ క్యాప్‌ను దక్కించుకున్నాడు.

మొత్తం సీజన్‌లో అత్యధిక స్ట్రయిక్ రేటు రికార్డు వైభవ్ సూర్యవంశీ పేరిట ఉంది. 7 మ్యాచుల్లో 206 స్ట్రయిక్ రేట్‌తో 252 పరుగులు చేశాడు.

## ఆ ఎనిమిది మందిలో సంజు శాంసన్..




పొట్టి ప్రపంచకప్ ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్ నామినీలుగా ఎనిమిది మంది పేర్లను తాజాగా ఐసీసీ విడుదల చేసింది. అందులో సంజు శాంసన్ చోటు దక్కించుకున్నాడు. అతడితోపాటు ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్, పాకిస్థాన్ ఓపెనర్ ఫర్హాన్, దక్షిణాఫ్రికా కెప్టెన్ ఐడెన్ మార్‌క్రమ్, పేసర్ లుంగి ఎంగిడి, న్యూజిలాండ్ ఆల్ రౌండర్ రచిన్ రవీంద్ర, బ్యాటర్ టిమ్ సీఫర్ట్, అమెరికన్ బౌలర్ షాడ్లీ వాన్ షాక్ విక్ ఎంపికయ్యారు. వీరిలోంచి ఒకరిని అభిమానులే ఎన్నుకునే అవకాశాన్ని ఐసీసీ కల్పించింది. అందుకోసం తన వెబ్‌సైట్‌లో ఎంపిక చేసే ఆప్షన్ ఇచ్చింది. టీ20 వరల్డ్‌కప్ ప్రారంభానికి ముందు తన ఫామ్ కోల్పోయి జట్టులో స్థానాన్ని ప్రశ్నార్థకం చేసుకున్న సంజు శాంసన్ అనూహ్యంగా పుంజుకున్నాడు. ఈ టోర్నీలో నాలుగు మ్యాచ్‌లు ఆడితే.. వరుసగా రెండు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌లూ కైవసం చేసుకున్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్ పోరులో 42 బంతుల్లోనే 89 పరుగులు సాధించి, టీమ్ఇండియాను ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. అంతకుముందు సూపర్ 8లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. 50 బంతుల్లో 97 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతడు ఇప్పటివరకు నాలుగు మ్యాచుల్లో 201.33 స్ట్రైక్‌రేట్, 77.33 యావరేజ్‌తో 232 పరుగులు సాధించాడు.

